# కథామంజరి


## పది కథల సమాహారం



మార్చి 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



కథామార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

మార్చి 2023

సంపుటి : 4 ♦ సంచిక : 3

ఈ నెల కథామంజరి సంచికకి

ఆర్థికసహాయం అందించినవారు

ప్రముఖ రచయిత

**డా. కె. వివేకానందమూర్తి, (UK).**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# ❧ మా జట్టు ❧

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ / శ్రీమతి / కుమారి

- పప్పు భోగరావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి ఎస్ మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- గాయత్రి రామోజి గారు

శ్రావ్యసంచిక కోసం ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథామార్గదర్శి | v |
| కథాపరిచయం | vii |
| వినదగునెవ్వరు చెప్పిన | xi |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| ఆడ – ఈడ | వసుంధర | 1 |
| చట్టంతో కాపాడండి | ఓట్ర ప్రకాష్ రావు | 7 |
| భారపు పగ్గాలు | పెనుమాక నాగేశ్వరరావు | 11 |
| జీవితాన్ని ప్రేమించే మనిషి | ఎస్. రాఘవేంద్రరావు | 15 |
| తాండవం | తులసి బాలకృష్ణ | 24 |
| ప్రతిబింబం | పి. రాజేంద్రప్రసాద్ | 29 |
| బొమ్మ – బొరుసు | నామాని సుజనాదేవి | 33 |
| మాంగల్యం | భాగవతుల భారతి | 38 |
| చిగురించిన తెలుగు పలుకు | వి. వి. సత్యప్రసాద్ | 43 |
| దివాణం సేరీవేట | పూసపాటి కృష్ణంరాజు | 50 |


Cover Page Credit : Laura Smetser, Amsterdam

# కథాకీయం

అరవైనాలుగు కళలు ఉన్నాయనే విషయం అందరికీ తెలిసిందే! అందులో నృత్యం, సంగీతం, చిత్రలేఖనం... వంటి కళలకు పెద్దపీట దక్కింది. వీటిని నేర్చుకోడానికి అభిలాష ఉండాలి.. అది ఉంటే, దాన్ని సానపట్టడానికి శిక్షణ ఇచ్చే గురువులు ఉన్నారు. గురువులతో పాటు, వాటికి శిక్షణ ఇచ్చే పాఠశాలలు ఉన్నాయి. ఆ అరవై నాలుగులో, కొన్ని కళలు గాల్లో కలసిపోయినా, ఇంకా కొన్ని కళలకు ఈ రోజుల్లో కూడా ఆదరణ బాగానే ఉంది. జన్మతః కొన్ని కళలు అబ్బినా సరే, వాటికి సరైన రీతిలో మెరుగులు దిద్దడానికి, గురువులు అవసరమే! ఆ గురువులు ఇప్పుడు ఎక్కువగానే ఉన్నారు. సుదీర్ఘమైన శిక్షణ ఇవ్వడానికి, డిగ్రీలు ఇవ్వడానికి ఇప్పుడు పాఠశాలలు, కళాశాలలు కూడా ఉన్నాయి. అలాగే, ఆ కోవకి చెందిన పత్రికా రచన, నటన, దర్శకత్వం.. వీటికీ కూడా శిక్షణ ఇచ్చే గురువులు, శిక్షణాలయాలు, డిగ్రీలు.. ఉన్నాయి. అలా కొన్ని కళలకు గురువులు, పాఠశాలు, సర్టిఫికేట్లు.. తర్వాత ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయి. కాని, ఎటొచ్చి కథలు వ్రాయడానికే... ఇలాంటి అవకాశాలు గాని, ప్రోత్సాహం గాని ఏం లేవు. ఈ విషయాల మీద ఒక్కొక్కసారి ఆలోచిస్తుంటే... ఎన్నో జవాబులు లేని ప్రశ్నలు ఉదయిస్తుంటాయి.

ఇతర భాషల్లో కథలు ఎప్పుడు పుట్టాయో, ఎలా ఉన్నాయో అనే విషయాల జోలికి వెళ్ళకుండా, మన తెలుగు కథ... ముఖ్యంగా ఆధునిక తెలుగు కథ పుట్టి వందేళ్ళు పైబడిందని చెప్పుకుంటునే ఉన్నాం. ఈ వందేళ్ళ పైబడిన చరిత్రలో కథారచనలు చేసిన రచయితలందరూ స్వయంకృషితో రచనలు చేసినవారే మనకు కనబడతారు. 'నాకు ఫలానా వారు గురువు' అని ఏ రచయిత చెప్పినా.. ఆ ఫలానా వారి దగ్గర నేరుగా శిక్షణ పొందడం గాని, మెళకువలు తెలుసుకోవడం గాని, దానికో డిగ్రీవో, డిప్లొమావో తీసుకున్న దాఖలు గాని... లేవు. అలా గురువుల రచనలు చదివి, వాటిని స్ఫూర్తిగా తీసుకుని ఏకలవ్యుడులా రచనలు చేసారు. అయితే ఈ మధ్య కాలంలోనే కొంతమంది పెద్దల సహకారంతో కథారచనలు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్న వారికి, అప్పుడప్పుడు చిన్న చిన్న శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి, రచనలు చేయడానికి కొన్ని సూచనలు, మెళకువలు చెప్పి, ప్రోత్సాహం ఇస్తున్నారు.

నిజానికి రచనలు చేయటానికి ఉత్సాహం చూపెట్టేవారిలో స్వతహాగా అభిలాష, జిజ్ఞాస ఉండాలి, స్వయంకృషి, అవగాహన చేసుకునే శక్తి మెండుగా ఉండాలి. ఈ కోవలోనే... 1987 సంవత్సరంలో ప్రఖ్యాత కథా రచయిత కాళీపట్నం రామారావుగారు .. ఓ దినపత్రిక కథా విభాగంలో కథలను ఎంపిక చేస్తూ, తగు సూచనలు ఇచ్చే బాధ్యతను చేపట్టి రెండేళ్ళు నడిపారు. అప్పట్లో ఇప్పుడువున్న సాంకేతిక సదుపాయాలు లేవు. వచ్చిన కథలను చదివి, అవసరమయితే కొన్ని మార్పులు చేసి ప్రచురించేవారు. ఆ రచయితకు కూడా సూచనలు, సలహాలు ఉత్తరం ద్వారా తెలియచేసేవారు. ఆ ప్రయత్నాలకు కొంత మంచి ఫలితాలు వచ్చేయనే చెప్పాలి. ఆ ప్రోత్సాహంతో కథలు రాయలనే కోరిక, చాలమందిలో వచ్చింది. చాలామంది కథకులు పుట్టుకొచ్చారు.

అంతే కాదు.. విద్యా, సాహిత్య పరిజ్ఞానం, జీవితానుభవం, ముఖ్యంగా వయస్సూ.. ఇవేవి రచనలు చేయడానికి ప్రతిబంధకంగా నిలబడలేదు. అన్నివయసుల వారు ఉత్సాహం చూపెట్టేరు. గ్రామాల్లో, పట్టణాలలో ఉండేవారూ, ప్రాథమిక స్థాయి విద్య నుంచి డాక్టరేట్ ల వరకు, ఉద్యోగస్తులు, గృహిణులు, వ్యవసాయదారులు, వ్యాపారస్తులు... ఇలా ఎందరెందరో కథలు రాయడానికి ముందుకు వచ్చారు. అలా అప్పుడు కలం పట్టుకుని అడుగుపెట్టిన వారెంతోమంది ఈ రోజు మంచి కథలు అందిస్తూ, మంచి రచయితలుగా గుర్తింపు పొందారు. అలా తీర్చిదిద్దడానికి మాష్టారు మరో స్థిరమైన ఆలోచన చేసారు. ఆ ఆలోచనల్లోంచి జన్మించినదే "కథాకథనం". కథారచనలకు సంబంధించి, ఎన్నో విషయాలను కారా మాష్టారు వ్యాసాలుగా "కథాకథనం" లో అందించారు. అయితే... ఆ రోజుల్లో కథలు వ్రాయడానికి.. దేశంలో పెరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు, రాజకీయ


వర్గాల వైఫల్యాలు, ప్రజల్లో పేరుకుపోయిన నిరాశ.. వంటి సామాజిక పరిస్థితులు రచనలు చేయాలనే ఆలోచనలకు దోహద పడ్డాయని మాష్టారు అభిప్రాయపడ్డారు. కొద్ది శాతం మంది తప్పితే, మిగతా వారందరూ, తమ చూట్టూ ఉన్న పరిస్థితుల పట్ల అసంతృప్తితోనో, అసహనంతోనో, ఆవేశపడి కథలు రాస్తున్నారని కూడా మాష్టారు అభిప్రాయపడ్డారు. అది శుభ పరిణామం అని తలచినా, ఆ రచనలలో స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నట్టు మాష్టారికి అనిపించలేదు. కథలు వ్రాయాలనే తపన ఒక్కటే సరిపోదు.. కథలో ఉండవలసిన శిల్పం, చదివించగలిగే శైలి, కథనం వంటివి పదునుగా ఉండాలి. వాటిమీద అవగాహన కలిగించడానికి మాష్టారు వ్యాసాలు రాసి "కథాకథనం"గా విడుదల చేసారు. ప్రస్తుత, వర్ధమాన రచయితలు... ఆ పుస్తకాన్ని చదివి తీరాలి. వారే కదు.. తెలుగు కథని నిలబెట్టాలనే ఆలోచన ఉన్న ప్రతీవారు చదివితీరాలి.

కథ మనిషి ఉనికిని తట్టి లేపుతుంది, తరాల మధ్య వారధిగా ఉంటుంది. ఈ తరం రేపటి తరానికి కనబడాలంటే ఈ తరం కథలు రావాలి, అవి ఈ తరంవాళ్ళే రాయాలి!

శతవసంత కాలాలను అవలీలగా దాటిన తెలుగు కథ... మరో వంద సంవత్సరాలు నిలబడాలంటే,. తెలుగు మాట్లాడే ప్రతీవారు ఆ భాద్యత చేపట్టాలి.

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ వాడ్రేవు వెంకట సత్యప్రసాద్**

క్రికెట్, హాకీ, బాస్కెట్‌బాల్, వాలీవాల్ ఆటగాళ్ళకి ఒకప్పుడు ఎక్కువగా ఉద్యోగాలిచ్చి వాళ్ళని ప్రోత్సహించి, తద్వారా సంస్థకి కూడా గుర్తింపు తెచ్చుకున్న ప్రభుత్వ ప్రవేటు సంస్థలు మన దేశంలో చాలా ఉన్నాయి. ఆ విషయంలో అభినందించవలసిందే. కానీ ఈ సంస్థలు క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహం, ఇతర కళారంగాల్లో ఆరితేరిన వారికి అప్పుడూ ఇవ్వలేదు, ఇప్పుడూ ఇవ్వడం లేదనే చెప్పాలి. అయితే.. కొంతమంది కళాకారులు ఆయా సంస్థలలో ఉద్యోగాలు చేసుకుంటూ, ప్రవృత్తిగా వివిధ కళారంగాల్లో తమ ప్రతిభలను ప్రదర్శిస్తూ, అటు సంస్థకూ ఇటు తమకూ... పేరు ప్రతిష్టలు తీసుకొస్తున్నారు. "మేం బ్యాంకుల్లో పని చేస్తూ కథలు, కవిత్వాలు రాసుకుంటున్నా... సర్వీసు నిబంధనల మేరకు, బ్యాంకు నుండి అనుమతి తీసుకోవాలి. ఓ కథ రాసి పత్రికకు పంపితే, దానికి వచ్చే పారితోషికం సంగతి బ్యాంకుకు తెలియచేయాలి. అంచేతే ఈ జంజాటాలు ఎవరు పడతారని, కలం పేర్లతో వ్రాసుకోవడమో, లేదా కలాలు పక్కన పడేయడమో చేసేవాళ్ళం! రాను రాను ఆ పరిస్థితులు మారాయి, ఆ నిబంధనల్లో మార్పు లేకపోయినా, అమలు చేయడం లేదు!" అంటూ బ్యాంకుల్లో పనిచేస్తూ సాహిత్యరంగంలో పేరుప్రఖ్యాతులు గడించిన తెలుగు రచయితలు చాలామంది ఇప్పుడు మనకి కనబడుతున్నారు. అలాంటి వారిలో నిన్నటి తరం తెలుగు కథా రచయితలలో చెప్పుకోదగ్గ కవి, కథారచయిత శ్రీ వివి సత్యప్రసాద్ గారు. "కాలేజీలో చదువుతున్నప్పుడే కనబడిన పుస్తకాలన్నీ చదివేవాడ్ని. ముఖ్యంగా ఆంధ్రపత్రిక అంటే చాలా ఇష్టంగా ఉండేది. అందులో చదివిన కథలే నాకు వ్రాయడానికి స్ఫూర్తిని ఇచ్చాయని చెప్పుకోవచ్చు! నేను బి.ఏ. మూడో సంవత్సరంలో ఉండగానే ఓ కథ రాసాను. అదే నా మొదటి కథ! తరువాత కాలంలో, మా బంధువు శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి గారు నాకు చాలా ప్రోత్సాహం ఇచ్చారు. అలా కథాసాహిత్యంలోకి అడుగుపెట్టిన నేను, కథలు విరివిగా రాశాను. అన్నీ మాస, వార పత్రికల్లో వచ్చాయి. బహుమతులు వచ్చాయి. శ్రీ తిరుమల రామచంద్ర గారి వంటి ప్రముఖుల ప్రశంసలు కూడా అందుకున్నాను. తర్వాత కాలంలో పద్యకవిత్వం వైపు అడుగులు వేసి, ఓ విధంగా వెనక్కి రాలేదు!" అంటూ సత్యప్రసాద్ గారు తన సాహితీ ప్రస్థానం గురించి చెప్పుకొచ్చారు.


ఎనభైయ్యవ ఏట అడుగుపెట్టిన శ్రీ సత్యప్రసాద్ గారు, రాజమండ్రిలో పుట్టి, అక్కడే డిగ్రీ వరకు చదివి, తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ హోదాలలో పనిచేసి, 2001లో పదవీవిరమణ చేసారు. ఉద్యోగం చేస్తున్నప్పుడు, ఆంధ్రలో చాలా ప్రాంతాలలో పనిచేసారు. ఏ ఊరు బదిలీ మీద వెళ్ళినా, ముందు ఆ ఊరిలో ఉండే రచయితలను కలసేవారు. బ్యాంకు ఉద్యోగి

కావడంతో కొంత గౌరవం కూడా ఉండేది. వారితో సాహితీ సంభాషణాలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతూ ఉండేవి. వారం వారం ఆ సమావేశాలలో స్వీయకథా పఠనం ఉండేది. అందుకు తప్పనిసరిగా కథ వ్రాసి పట్టుకు వెళ్ళాలనే పట్టుదలతో కథలు వ్రాసారు. సుమారు అరవై డెబ్బై కథలు వ్రాసారు. 1965 నుంచి కథలు వ్రాసినా, అందులో చాలా మట్టుకు 2000 ముందు ప్రచురితమైనవే. ఉద్యోగ రీత్యా బదిలీలు ఎక్కువగా ఉండటం వలన, ప్రచురితమైన కథల భద్రత జరగలేదు. దొరికిన కథలతో ఈ మధ్యనే "తొడిమ లేని మొగ్గలు" కథా సంకలనం విడుదల చేసారు. ఇది కాకుండా, మరో రెండు పద్య సంపుటలు కూడా సత్యప్రసాద్ గారి సాహితీ సంపదలో చేరాయి. ఇప్పటికీ ఛందోబద్ధమైన పద్య రచనలు, ఆధ్యాత్మిక వ్యాస రచనలు, అవధానాలలో పృచ్ఛకుడుగా వ్యవహరించడం, భువనవిజయంలో తిమ్మన, అల్లసాని పెద్దన్న పాత్రధారణలు, రేడియో నాటికలో నటించడం, సాహితీప్రసంగాలు చేయడం.. ఇలా నేటికి బిజీగానే ఉండే సత్యప్రసాద్ గారికి డి. వెంకరామయ్యగారి కథలంటే చాలా ఇష్టం. ఏలూరు సాహిత్యమండలి వీరికి "కవిమిత్ర" అనే బిరుదుతో సత్కరించగా, దూరదర్శన్ వారి "పద్యాల తోరణం" లో వీరికి మిలీనీయం ప్రథమ బహుమతి వచ్చింది. ప్రముఖ చలనచిత్ర దర్శకుడు శ్రీ వి.యన్ ఆదిత్య.. సత్యప్రసాద్ గారి తనయుడే. రచయితగా, మంచి వక్తగా, ప్రయోక్తగా పేరు తెచ్చుకున్న సత్యప్రసాద్ గారి వంటి చాలామంది తెలుగు సాహితీ ప్రముఖుల వలన, వారు ఉద్యోగాలు చేసిన ఆయా సంస్థలకు కూడా మంచి పేరు రావడం ముదవహమే!

శ్రీ సత్యప్రసాద్ గారు నిండా నూరెళ్ళు ఆయురారోగ్యలతో సాహిత్య సేవలందిస్తూ ఆనందంగా ఉండాలనీ కోరుకుంటూ, వారిని ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం!

*కథామంజరి బృందం.*

# కథామార్గదర్శి



**కీ. శే. పూసపాటి కృష్ణంరాజు**

ఆయన రాసినవి.. పది పదిహేను కథలకు మించి లేవు. వాటిని కథల సంపుటిగా వేస్తే, నిండా వందన్నర పేజీలు కూడా ఉండవు. కాని తరాలు మారినా చెదరని కథాంశాలతో, అద్భుతమైన రచనాశైలితో సజీవంగా నిలిచిపోయే కథలే అవన్నీ! తమ కుటుంబాలలో కనబడే ఆచారాలు, సాంప్రదాయాలు, అభిరుచులు, నడవడిక, చేష్టలు, మంచి, చెడు, ప్రత్యేకమైన పట్టు పదాలు... ఇలా అన్నిటి మీద కలం సంధించి, కథలుగా అందించి... చాసోగారు అభిమానించిన అతి కొద్దిమంది రచయితల్లో ఒకరిగా, ఆయన వారసుడుగా అభివర్ణింపబడిన రచయిత కీ.శే. పూసపాటి కృష్ణంరాజు గారు.

ఆ రోజుల్లో కథలు వ్రాయాలనే తపన ఉన్న ప్రతీ రచయిత, కృష్ణంరాజు గారి కథలు చదివేవారు, ప్రత్యేకించి ఆయన్ని కలిసి, కథాసాహిత్యం మీద ఎన్నో విషయాలు తెలుసుకునేవారు. కనబడిన ప్రతి పుస్తకాన్ని చదివిన కృష్ణంరాజుగారికి చాసోగారంటే చాలా గౌరవం. స్ఫూర్తి కూడా ఆయనేని చెప్పాలి. "మన చుట్టూ జరిగే సంఘటనలు, వింటున్న విషయాలు, సమాజ పోకడలు, ఇలా అందరూ అన్ని విషయాల మీద కథలు వ్రాస్తున్నారు. నువ్వు.. మీ రాజుల మీద కథలు ఎందుకు వ్రాయకూడదు?" అంటూ చాసోగారు ఇచ్చిన ప్రోత్సాహంతో కలం పట్టారు కృష్ణంరాజు గారు. నిజానికి ఓ రెండు, మూడు కథలు వ్రాసినా... అవి మామూలు జీవితాల్లోంచి వచ్చినవే! ఆ తర్వాతే చాసోగారి సూచనతో 'దివాణం సేరివేట' కథ వ్రాసి పంపగా, అది ఆంధ్రపత్రికలో ప్రచురింపబడింది. కృష్ణంరాజుగారు 1980 లో "నేనెందుకు వ్రాస్తున్నాను" అనే పుస్తకంలో .. "మనుషులు బాగుపడాలి.. అని వ్రాసాను. దేశం బాగుపడాలి.. అనే కోరుకుంటున్నాను. ప్రజల జీవితాలను పరిశీలనగా చూసి, చూసినది చూసినట్టు చతురతతో రాసి, జీవిత సత్యాలను రచనలలో చిత్రం కట్టినప్పుడు.. పాఠకులు వారి ప్రతిబింబాలను అద్దంలో చూసుకున్నట్టు, నా రచనల్లో చూసుకుని, చక్కదిద్దుకోడానికి అవి ఉపయోగపడేలా రాసేందుకు ప్రయత్నం చేసాను. చేస్తున్నాను. అందుకే నేను రాసాను!" అంటూ స్వగతంలో వ్రాసుకున్నారు.

ఆ ఆలోచనలతోనే, చుట్టూ ఉన్న సమాజంలో లోపాలను గ్రహించి, వాటి మీద కథలు కట్టాలని నిర్ణయించుకోవడంలో కృష్ణంరాజు గారి బుద్ధికుశలత, సామాజిక స్పృహ వ్యక్తం అవుతాయి. ఆ కోవలోనే.. సీతాలు జడుపడ్డది, కుక్కుట చోరులు, రెండు బంట్లు పోయాయి, తెల్లరాజు–నల్లదొర, కుక్కలు–కుక్కలు, సామంతం, ఏనుగుకు చావు లేదు... వంటి కథలు

ఉత్తరాంధ్రలో రాచవారి జీవితాల విలక్షణకు అద్దం పట్టాయి. "నిజానికి కృష్ణంరాజుగారు నా గురువుల్లో ఒకరు. తాను బాగా ఎరిగిన జీవితం గురించి తనకు పట్టుబడిన జీవభాషలో కథలు రాయాలని గ్రహించిన నిన్నటి తరం రచయితల్లో ఆయన అతిముఖ్యుడు!" అంటూ ప్రముఖ కథా రచయిత కీ.శే. కె.ఎన్.వై. పతంజలి... 2000 లో వచ్చిన "దివాణం సేరివేట" కథల సంపుటిలో ముందుమాటలో పొందుపరిచారు.

10 ఆగస్టు1928 న విజయనగరం జిల్లాలో ద్వారపూడి గ్రామంలో జన్మించిన కృష్ణంరాజుగారు, ఉన్నతవిద్య లేకపోయినా కొన్నాళ్ళు విశాఖపట్నం, మద్రసులలోని చమురు కర్మాగారాల్లో పనిచేసారు. తర్వాత సినీ ప్రముఖులు బాపు గారు, ముళ్లపూడి వెంకటరమణ, ఏడిద నాగేశ్వరరావు, రావి కొండలరావు.. వంటి ప్రముఖులతో మంచి స్నేహం ఏర్పడింది. డి.వి. నారాయణగారు నిర్మించిన "పెళ్ళిపిలుపు" సినిమాకి సహాయ దర్శకుడుగా కూడా పనిచేసారు. అవేవి వంటబట్టక, తిరిగి విశాఖపట్నం వచ్చేసారు. 1994 నవంబరు18 తేదిన కాలం చేసిన కృష్ణంరాజు గారి కథలను ఏరి, పది కథలతో 2000 సంవత్సరంలో "దివాణం సేరివేట" పేరిట కథల సంపుటి వేశారు. తిరిగి ఆ కథలతో పాటు, కృష్ణంరాజుగారు వ్రాసిన మరో ఆరుకథలతో క్షత్రియ పరిషత్, విజయనగరం వారు 2022లో "పూసపాటి కృష్ణంరాజు కథలు" పేరుతో మరో సంకలనం విడుదల చేయడం ముదావహం.

అటు పాఠకుడ్ని, ఇటు రచయితని తట్టిలేపే కథలను అందించిన విలక్షణ రచయిత కీ.శే. పూసపాటి కృష్ణంరాజు గారి కథలు తెలుగు వినీలాకాశంలో నిండుజాబిలిగా వెలుగుతునే ఉంటాయని...ప్రగాఢంగా నమ్ముతూ, ఆయనకి నివాళి అర్పిస్తున్నాం!

*కథామంజరి బృందం*

# కథాపరిచయం

## ఉణుదుర్తి సుధాకర్‌గారి కథ – 'తూరుపు గాలులు'

'తూరుపు గాలులు' అనే కథ అదే పేరుతో వచ్చిన పుస్తకంలోని పదమూడు కథలలో ఒకటి. ఆగస్టు 2018 నాటికి ఉణుదుర్తి సుధాకర్ వ్రాసినవి పదమూడు కథలే (పుస్తకం ప్రచురించే సమయానికి, మే, 2018) అని చదివి ఇంకా ఆశ్చర్యమేసింది. కొన్ని వందల కథలు తయారు చేసి అందులో మంచివి ఏరుకొమ్మని చెప్పలేదు రచయిత. ఏరుకునే అవకాశం చదువరికి ఇవ్వలేదు. ఎందుకంటే అన్నీ ఆణిముత్యాలే.

ఈ కథలు ఎందుకు రాశారో చెబుతూ, సుధాకర్ గారు చెప్పిన రెండు వాక్యాలు చూద్దాం.

'చరిత్రపుటల మధ్య పేరుకుపోయిన సుదీర్ఘ నిశ్శబ్దాలు నన్ను వేధించాయి. ఇవే నాచేత ఈ కథలని రాయించాయి.'

'వర్తమాన చైతన్యాన్ని వృద్ధి చేసుకుంటూ ఎప్పటికప్పుడు చారిత్రక కోణాలను ఆవిష్కరించుకోవాలే తప్ప పాషాణగతాన్ని ఏకపక్షంగా, నిరంకుశంగా వర్తమానంపై రుద్దకూడదని ఈ కథలు వ్రాసే క్రమంలో నాకు బోధపడింది.'

పై వాక్యాలు నన్ను ఒక క్షణం ఆగి ఆలోచింపచేసినై.

చరిత్రకారుడిగా జరిగిన సంఘటనలను కూలంకషంగా అర్థంచేసుకుని వర్తమానంలో మనం చూస్తున్న సంఘటనలకు, మన ప్రవర్తనలకు వున్న సంబంధాన్ని గురించి ఆలోచించడం, ఒక శాస్త్రవేత్తగా ఆ సంబంధాన్ని కనుక్కోవడం, రచయితగా తను కనుగొన్న ఆ సత్యాలను కథల రూపంలో మన ముందుంచడం, ఆయన చేసిన పని. అదే నిజాయితీ అన్ని కథల్లోనూ మనకు కనబడేది.

కథల్లో కల్పన లేదా అని కాదు. సత్యవతి గారు చెప్పినట్లుగా ఆయన చేసింది చారిత్రాత్మక కాల్పనిక సాహిత్య ప్రక్రియ.

సుమారు అన్ని కథల్లోనూ భారత దేశపు తూర్పు తీరం, ఉత్తరాంధ్ర, ఒడిషా ప్రాంతం ప్రతిబింబిస్తాయి. సులభంగా చదివించే శైలి. కథనం... చరిత్రను దృష్టిలో పెట్టుకోని, పెట్టుకోలేని పాఠకుడిని కూడా చదివించగలదు. అన్ని కథల్లోనూ పాఠకులకు కనబడేది రచయిత ఆలోచనల్లోని లోతు. ప్రతి కథ ఇతివృత్తంలోనూ చారిత్రక పరిశోధన కనబడుతుంది. ప్రస్తుత పరిస్థితులమీద చరిత్ర చూపించిన ప్రభావం కనిపిస్తుంది. ఆ చరిత్రలో మనం నిలబడి చూస్తూ అనుభవిస్తున్న భావం, కాలచక్రంలో మళ్ళీ వెనక్కి వెళ్ళి ఒక సాక్షిగా నిలబెట్టిన భావం, మనల్ని కొద్ది సేపటి వరకు వదలవు. కొద్ది రోజులైనా మనతోనే ఉంటూ, ఆలోచింపచేసే కథలు.

అలాంటి కథలలో 'తూరుపు గాలులు' కథ బౌద్ధ మతం ఉత్తరాన తురుష్కుల దాడికి తట్టుకోలేక, దక్షిణాదిన ప్రస్తుతపు శ్రీలంకలో రాచరికపు కుతంత్రాల వలలో ఇరుక్కుపోయి తన ఉనికికే ఆపద కలిగిన నేపథ్యంలో చెప్పబడిన కథ.

గోదావరి సమీపంలోని పంపానదీతీరాన ఉన్న ఒక బౌద్ధ విహారం. భద్రపాలుడు అక్కడున్న కేవలం బౌద్ధ భిక్షువే కాదు. ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో మంచి పేరున్న మూలికా వైద్యుడు కూడా. నాలుగేళ్ళ ముందు నాలందా మహావిహారానికి పంపబడిన దీపాంకరుడు ఇంకా రాలేదని ఎదురుచూస్తున్న భద్రపాలుడితో మొదలవుతుంది కథ. కొంతమంది బౌద్ధ భిక్షువులతో పాటు మానసికంగా క్రుంగిపోయిన దీపాంకారుడు విహారం చేరుకుంటాడు. నాలాందాలో తురుష్కులు చేసిన మారణహోమానికి

దీపాంకారుడు ఒక సాక్షి అయాడు. ఎందుకు బౌద్ధ భిక్షువులను వెంటాడి చంపారు? ఎందుకు గ్రంథాలయాలను తగులబెట్టారు? నాలాందాలో పాళీ భాషను బోధించే ఆచార్యుడి మరణానికి తానే కారకుడా? నడవలేని ఆచార్యులను ఆ చెట్టు క్రింద వదిలేసి తామందరూ ఆయన ఆజ్ఞ మీరి పారిపోకుండా ఉండి ఉంటే, ఆచార్యులు బ్రతికి ఉండేవారా? అలాంటి ఆచార్యుడి త్యాగానికి అర్హుడిగా నిలబడాలంటే తానేమి చెయ్యాలి? ఇలా వేధిస్తున్న ప్రశ్నల నుండి బయటపడడానికి దీపాంకారునికి చాలా కాలమే పట్టింది. క్రమంగా కోలుకుంటున్న దీపాంకారుడు బౌద్ధమతాన్ని నిలబెట్టుకోవాలంటే... దృష్టిని సామాన్యప్రజలపైనే పెట్టాలని, సామాన్యులకు కూడా అందుబాటులోకి తేవాలని, ప్రతి మోక్షా సమేవేశాలలో తన అభిప్రాయాల్ని వ్యక్తీకరిస్తాడు.

ఒకనాడు ఊహించని తరుణంలో ఇద్దరు సింహళ భిక్షువులు, ఆచార్య శాంతిదేవుడు, అతని శిష్యుడైన గుణసేనుడు నలందాలో బయల్దేరి ఉజ్జయిని, ధాన్యకటకం మీదుగా కళింగపట్నం రేవుకు వెడుతూ విహారానికి రావడం దీపాంకారునిలో ఉత్సాహం రేపింది. బౌద్ధమతం సామాన్యులకు అందుబాటులోకి తేవాలనే ఆశయమే ఉంటే, సింహళ దేశానికి మించిన ప్రదేశం వేరే ఉండదని, సింహళీయుల జీవితంలో బౌద్ధం ఒక భాగమైపోయిందనీ, దీపాంకారుడు కనక ఆ దేశానికి వస్తే, అతను కలలుకంటున్న భవిష్యత్తుని కళ్ళారా చూడవచ్చనీ, ఇక్కడ అనుసరిస్తున్న థేరవాద బౌద్ధానికి సింహళదేశంలో రాజవంశ పోషణ ఉందనీ, అందుచేత దీపాంకారుని తమ దేశానికి తమతో పంపి రెండు, మూడేళ్లు అక్కడ ఉన్నట్లైతే అక్కడి పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించి తిరిగి రావచ్చని తన ఉద్దేశ్యాన్ని వ్యక్తపరుస్తాడు ఆచార్య శాంతిదేవుడు. ఇంకా అక్కడ దీపాంకారుడు అధ్యాపకుడుగా తాను నలందా మహావిహారంలో నేర్చుకున్నవి బోధిస్తూ, నలందా స్థాయిలో సింహళదేశంలో మరొక బోధనా కేంద్రాన్ని స్థాపించవచ్చనీ సూచిస్తాడు. భద్రపాలుడూ, దీపాంకారుడు అంగీకరిస్తారు.

వంశధార నది ఒడ్డునే ఉన్న శాలివాటిక విహారంలో బస చేసి కళింగపట్టణం నుండీ, నబోపాడా (నౌపాడా) నుంచి ఉప్పు తీసుకుని వచ్చే ఒక పారశీక ఓడలో త్రికోణమలై (ట్రింకోమలీ) చేరతారు ముగ్గురు భిక్షువులూ. అక్కడనుండి కాలినడకన నాలుగు రోజుల తరువాత పోలోన్నారువ చేరుతారు. ఉత్తరారామంలో శాంతిదేవుని కోసం, గుణసేనుడి కోసం ఎదురు చూస్తున్న వందలాది భిక్షువులు ఘనస్వాగతంతో ఆహ్వానిస్తారు. జ్ఞానాన్వేషణ, క్రమశిక్షణతో కూడిన యువశక్తి అక్కడ ఉన్నట్టుగా దీపాంకారునికి తోస్తుంది.

ఆచార్య శాంతిదేవథేరోకు (శాంతిదేవుడు) సహాయకుడిగా వ్యవహరిస్తూ, పాళీ మూలాగ్రంథాలలోని కొన్ని సూత్రాలను విద్యార్థులకు వివరించే తరగతులను దీపాంకారునికి అప్పగించారు. నాలందాతో పోలిస్తే ఉత్తరారామం కొన్ని శతాబ్దాలు వెనకుంది. అయితే నలందాను ఆదర్శంగా తీసుకుని ఉత్తరరామాన్ని ముందుకు తీసుకెళ్ళాలనే ఆలోచన మంచిదే కదా! దీపాంకారునికి సింహళం త్వరలోనే మాట్లాడడం, చదవడం వచ్చింది. స్థానిక భిక్షువులతో అవలీలగా మాట్లాడుతున్నాడు. తనకు సాయంగా ధర్మపాలుడు తనకు కావలసినవన్నీ సమకూరుస్తున్నాడు. శాంతిదేవుడి సలహా ప్రకారం, నలందాలో నాశనమైపోయిన పాళీ భాషలో వ్రాయబడిన మూలాగ్రంథాలకు ప్రతులు సమకూర్చుకోవడం మొదలు పెట్టాడు.

రెండు, మూడేళ్లు గడిచిపోయింది. ఆచార్యుడుగా బోధన సాగిస్తూ, ప్రతులను సమకూర్చుకుంటున్నాడు. ఒకనాడు తెల్లవారుఝామున జరిగే ప్రార్థనలో పాల్గొనడానికి వెళుతున్నప్పుడు, శాంతిదేవుడు మరణించాడని చెప్తాడు గుణసేనుడు. అంత కఠోరమైన వార్త దీపాంకారుణ్ణి నిశ్చేష్టుడిని చేస్తుంది. గుణసేనుడు దీపాంకారుడిని పక్కకు పిల్చి చెబుతాడు 'శాంతిదేవథేరోని ఎవరో గిట్టని వారు, రాజభవనంలో పైచేయి కలవాళ్ళు, విషప్రయోగంతో చంపివేశారని, తక్షణమే దీపాంకారుడు సింహళదేశం వదిలి, తిరిగి తన స్వస్థానానికి వెళ్ళిపోవాలని, తను తయారుచేసుకున్న మూలాగ్రంథ ప్రతులను త్వరలో పంపడానికి ప్రయత్నిస్తామనీను'. తనను వెళ్ళమనడానికి కారణం, అధికారంలో ఉన్న కొందరు, దీపాంకారుడు వారి

శత్రువుల గూఢచారి అని, అందువలననే సింహళ భాష నేర్చుకుని, ప్రజల్ని తన వలలో వేసుకుంటున్నాడని అనుకోవడమే.

దీపాంకరుడు ఖిన్నుడై వెనక్కి బయలుదేరాడు. మూడు వారాల్లో యాపనయపట్టన (ప్రస్తుత జాఫ్నా)చేరి, అక్కడనుంచి తమిళ జాలరుల పడవనెక్కి భారతతీరం చేరుకున్నాడు. పాండ్య కాకతీయ రాజ్యాలగుండా ప్రయాణించి ధాన్యకటక విహారంలో కొద్ది రోజులు గడిపి, పంపావిహారానికి చేరడానికి ఆరునెలలపైనే పట్టింది. అక్కడ వాతావరణం పూర్తిగా మారిపోయింది తను విడిచిపెట్టిన మూడేళ్ళలో. భద్రపాలుడు ఏడాది క్రితమే పోయారని తెలిసింది. బౌద్ధ భిక్షువుల రాకలు తగ్గిపోయాయి. తిరిగి ధాన్యకటక విహారానికే వెళ్ళి, యువభిక్షువులకు బోధనలు చేస్తూ, గ్రంథాలకు ప్రతులను రాసిపెడుతూ, తన మిగిలిన జీవితం గడపడానికే నిశ్చయించుకుంటాడు.

మరో ఇరవై ఏళ్ళపాటు ధాన్యకటకంలోనే కృషిచేసి అక్కడే తనువు చాలిస్తాడు దీపాంకారుడు. అతని కోరిక మీద అతని చితాభస్మాన్ని కళింగదేశంలోని మహేంద్రతనయ నదిలో కలుపుతారు శిష్యులు.

ఇదీ కథ టూకీగా. అయితే కథ చదువుతున్నప్పుడు రచయిత దీపాంకారుని ఆలోచనలతోనూ, అతని అనుభవాలతోనూ, మనను తాదాత్మ్యం చెందించి అతనితో పాటుగా మనల్ని నడిపిస్తారు. బౌద్ధమతం ఎక్కడైతే పుట్టిందో అక్కడే ప్రాచుర్యం పోగొట్టుకోవడం మొదలయింది. రచయిత ఆ సందేశాన్ని ఎన్నో సంకేతాలతో పాఠకుడి ముందుంచుతారు.

క్రీస్తు శకం 1200 ప్రాంతాల్లో తురుష్కులు నలందాను ధ్వంసం చేసారు. అంటే కథాకాలం అప్పటిదన్నమాట. అది బౌద్ధమతం భారతదేశంలో క్షీణించడానికి అనేక కారణాలున్నప్పటికీ, 12వ శతాబ్దంలో భారతదేశంపై జరిగిన తురుష్కులు, తదితర ముస్లింల దాడులు, వారి పాలన, ముఖ్య కారణాలయాయి. అప్పట్లో బౌద్ధ జీవనం ఎలా ఉండేది, బౌద్ధభిక్షువుల ఆలోచనలు, ఒక చోటు నుండి మరొక చోటుకు ప్రయాణాలు ఎందుకు చేసేవారు, ఎలా చేసేవారు, వారి జీవన విధానాల్లోని కష్టనష్టాలు మనకు కళ్ళకు కట్టినట్టు ఉంటుంది 'తూరుపు గాలులు' కథలో.

చివికిపోతున్న బౌద్ధమతాన్ని పునరుద్ధరించడం ఎలా? రాజుల పోషణలో ఇన్ని దశాబ్దాలూ బ్రతికిన బౌద్ధం ఈరోజు ఎందుకు క్షీణిస్తోంది? రాజకీయాలలో ఎందుకు ఇరుక్కు పోవలసి వస్తోంది? అందుకు అతీతంగా ఉండాలంటే ప్రజలలోకి వెళ్ళి వాళ్ళ మనసుల్ని బౌద్ధమతం వైపుకు మళ్ళించగలమా? ఇవీ అప్పటి ఆలోచనలు. ఆ ఆలోచనలు ఇప్పుడు కూడా కొత్తవి కావు మనకు. ఒక సంస్థ కూలిపోతున్నప్పుడు ఎలా పునరుద్ధరించాలని అన్న ఆలోచన పార్టీలకు, కంపెనీలకు మాత్రమే కాదు... మతాలకు కూడా అవసరమే కదా! 'రాజులూ, రాజ్యాలూ శాశ్వతంగా ఉండిపోవు. మన దృష్టిని రాజ్యాధిపతులపైన కాకుండా సామాన్య ప్రజలపైనే పెట్టాలి. సమాజపు క్రింది పొరలను బౌద్ధధర్మం వైపు ఆకర్షితులను చేయాలి... ఒకవైపు తాత్విక అన్వేషణలను కొనసాగిస్తూనే, మరోవైపు సామాన్య ప్రజానీకాన్ని హేతుబద్ధమైన ధర్మపథం వైపు నడిపించాలి.' – ఇలా సాగుతాయి దీపాంకారుని ఆలోచనలు.

'త్రిపీటకా నియమాలను, వాటి మూల స్వరూపాన్ని, సారాన్ని కాపాడుకుంటూ, ఎటువంటి మార్పులూ చేర్పులూ ఛేయ్యకుండా అత్యంత స్వచ్ఛమైన ప్రామాణికతను కాపాడుకుంటూ వస్తున్నది సింహళ థేరవాదమే.' అని చెప్పిస్తారు రచయిత శాంతిదేవునితో. ఇలాంటి వాక్యాలు అప్పటి పరిస్థితులలో బౌద్ధమతం సింహళలో ఎలా ఉండేదో అనడానికి తార్కాణాలు. ధాన్యకటకం (అమరావతి) గురించి చెప్పినా, అప్పటి భాష గురించి మాట్లాడినా, అప్పటి ఊరి పేర్లు ఉటంకించినా, పరాక్రమబాహుడు పాండ్యరాజుల పక్షాన చోళులను ఓడించి అనురాధపురాన్ని పునరుద్ధరించి, బౌద్ధ ధర్మాన్ని ఒక తాటిపై నిలబెట్టినా, చారిత్రక సత్యాలను క్షుణ్ణంగా పరిశోధించితే కానీ రాయలేని మాటలు. చారిత్రాత్మిక రచనలలో ఊహ కొంతవరకే. సుధాకర్ గారు తీసుకున్న ఇతివృత్తంలో కల్పన పాళ్ళు అతి తక్కువేనని చెప్పాలి.

థేరవాదం, వజ్రాయానం లాంటి పద్ధతులను రచయిత పాఠకులకు పరిచయం చేస్తారు. అతి తక్కువ భాషలో వాటి సారాన్ని మనముందుంచుతారు. ఈ ప్రక్రియ అంత సులభం కాదు.

కథగా చదివిస్తూనే, చరిత్ర పాఠాలను మనకు జీర్ణింపచేశారు రచయిత. కథారచయితకు చరిత్రపైనే కాదు, మతం, వేదాంతాలపై కూడా ఎంతో గౌరవముంది.

'నీటిబొట్టువు, నీటిబొట్టువు

నింగినుండీ నేలరాలిన – నీటిబొట్టువు, నీటిబొట్టువు

ఒకటి రాలెను కొండమీదా, ఒకటి కురిసెను వాగులోనా...

............................

ఏది ఎందుకు ఎక్కడున్నది? ఏది ఎప్పుడు ఎచ్చట చేరును?

ఎవరు ముందో, ఎవరు వెనకో? నీవు ఎవరో, నేను ఎవరో?

అన్నిదిక్కుల ఉన్నదొక్కటె, విశ్వనాథుని రూపమొక్కటె....'

అంటూ సాధువులు పాడుకునే తత్వంలో లోతైన వేదాంత భావాన్ని చూపిస్తారు రచయిత.

చరిత్ర అంటే కొంచెమైనా అభిరుచి, ఆసక్తి ఉన్న పాఠకుడికి ఈ కథ చదివిన తర్వాత ఆ కాలంలో బౌద్ధమత పరంగా ఏమి జరిగిందో, ఆ బౌద్ధమతమేమిటో అన్న జిజ్ఞాస తప్పక కలుగుతుంది. రచయిత అంతకంటే ఎక్కువ కోరుకుంటారనుకోను.

*పరిచయకర్త : శాయి రాచకొండ, యు. ఎస్.*

జనవరి, ఫిబ్రవరి డాక్టర్ల ప్రత్యేక సంచికలలోని కథలు (పది కథల సమాహారం అన్నా, జనవరిలో ఎనిమిదే కథలు ఉన్నాయి) చాలా ఓపికగా చదివేక ఈ నాలుగు ముక్కలు రాయాలనిపించింది. డాక్టర్ల ప్రత్యేక సంచిక ఆలోచన మెచ్చుకోదగ్గది. అందుకు ముందుగా సంపాదకవర్గానికి నా అభినందనలు. మనుషుల్లో ఎన్నిరకాల మంది ఉండగలరో అందర్నీ అతి దగ్గరగా పరిశీలించగల వృత్తుల్లో అదొకటి. కానీ కథ చెప్పటం ఆషామాషీ వ్యవహారం కాదు. కథ చెప్పడం నిజంగా ఒక కళ. "కథలు చెప్పకు," అని అనడంలోనే, లేనిది ఉన్నట్టుగానో, ఉన్నది లేనట్టుగానో చెప్పడం కథగా గుర్తించబడుతోందని మనకి తెలుస్తోంది. (వైద్య)"వృత్తిలో అసమానప్రతిభ గలవారైనా, ప్రవృత్తిలో రచయితలు కాని వారికి, తమ దగ్గర ఉన్న సమాచారాన్ని కథగా మలచడం తెలియదు," అన్న భావన వెనుక నిజాన్ని ఈ కథలు తెలియజేస్తున్నాయి. సంపాదకులు రచయితల అనుమతితో కొంత స్వేచ్ఛతీసుకుని సవరిస్తే, ఇందులో కొన్ని మంచి కథలు అయి ఉండేవి.

మెడికోశ్యామ్ "అనువాద కథ" దేనికీ అనువాదం కాదు. పాఠకుణ్ణి బురిడీ కొట్టించడానికి రచయిత చిలిపిగా పెట్టిన శీర్షిక. అది అనువాదం చెయ్యడాన్ని గురించి చెప్పిన కథ. అనువాదకుడికి (పరోక్షంగా, అన్నిటిలోనూ తప్పులు వెదికే నా లాంటి పాఠకుడికి) ఉండవలసిన లక్షణాలు చెప్పే కథ. కథకి నిజంగా పెద్ద కాన్వాసు అక్కరలేదు. నీతినో, సందేశాన్నో, భావజాలాన్నో చెప్పొచ్చును గాని అవేవీ కథకి లక్ష్యం కాదు. మౌలిక ప్రయోజనం కాదు. కథ రచయితకీ, పాఠకుడికీ మధ్య జరిగే ఆత్మీయ సంభాషణ. ఆ స్నేహం నుండి మనం పైన చెప్పినవే గాక చాలా నేర్చుకోవచ్చు. "ఈ విశాలసృష్టిలో ఒకడే మూల రచయిత. మన మందరమూ అనువాదకులమే," అన్నమాట రచయిత లైటర్ వెయిన్ లో చెప్పినది కాదు. ఒక ఆణిముత్యం. ఆ సందర్భంలో అలా అనిపించవచ్చు. దేవుడిని పక్కన బెడితే, ఈ సృష్టిలో మొట్ట మొదటగా ఎవడు కథని చెప్పేడో వాడే అసలు రచయిత. తక్కిన వాళ్ళందరూ, దాన్నే తిరిగి తిరిగి, తిప్పి తిప్పి, వ్యక్తుల్నీ, సంఘటనలనీ, సందర్భాలనీ మార్చి చెప్పుకున్నారు(...తున్నారు,... కుంటారు) అని భావం. అలాగే, "జీవితమంతా అదే పని చేసిన దద్దమ్మ, అసలు అనువాదం సాధ్యమే కాదంటున్నాడు". "పదార్థము జడపదార్థము, భాషాతీత భావప్రకటనే సరియైన పరిభాష అన్నది మరిచి," అన్న మాటలు ఎంతో గంభీరమైనవి. అనువాదకుడు మూలంలోని మాటలకి బిగుసుకుపోకూడదు. నిజానికి మాటలు జడపదార్థాలు. ప్రాణం లేనివి. అవి భావాన్ని బట్వాడా చెయ్యగలిగినపుడే ప్రాణం పోసుకుంటాయి. మాటకి మాట అనువాదం కాదు, అది ఎంత సరిపడిన మాట అయినా. దాని వెనుక ఉన్న భావం కూడా బట్వాడా కావాలి. అందుకని భాషకి అతీతంగా, మూల రచయిత చెప్పిన భావాన్ని తన మాటలలో అందించినపుడే రసావిష్కరణ జరుగుతుంది. కథలో మిక్క కథకుడి కన్నీరు తుడవడం, కొన్ని సందర్భాలలో ఆత్మీయత ముందు మాటలు ఎంత నిష్ప్రయోజనమో సూచించకనే సూచిస్తారు రచయిత.

వివేకానందమూర్తి గారి కథ "హీరో" పైకి (మొరటు)హాస్యం, వ్యంగ్యం కలగలిపినట్టు కనిపించినా, ముగింపు తెలుగు సినిమాని పట్టి పీడిస్తున్న బలహీనతని సున్నితంగా సూచిస్తుంది. విశాఖ రచయితల రచనల్లో "కవి కాని కథకుడు" రావిశాస్త్రి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తొంగి చూస్తుంటాడు: "చంద్రుడు వెన్నెలపిండితో చేసిన చపాతీలా ఉన్నాడు," అన్న మాటలోని సౌందర్యమూ "నువ్వో డబ్బున్న వెధవ్వి. కోవిడ్ మ్యుటేషన్ గాడివి," అన్న మాటల వెనక ఉన్న కసీ గమనించండి.

కృష్ణకుమారిగారి "ఇది కథ కాదు" కొంచెం ఆత్మకథలా సాగింది. దాన్ని ఎడిట్ చేసి డా.వేణు కథకి పరిమితమైతే, బిగువైన కథ అయ్యేది. శస్త్ర చికిత్స చేస్తున్నపుడు వేణు మనసులోని మాటలుగా వ్రాసిన

"ఈ రక్తపు గడ్డలకు, చర్మపు తొడుగులకేనా కవులు కవనాలు సృష్టిస్తారు!!! ఈ కృత్రిమ సౌష్టవాలకేనా మహామహులు సైతం

పిచ్చి వారౌతారు!!! గుప్పెడు ప్రమాణంలో ఉండి కాలం మూడేవరకూ కొట్టుకునే ఈ గుండెలోనేనా ప్రేమా, అనురాగం, ఆరాధన అనే అమృతాన్ని నింప ప్రయత్నిస్తారు!! కవులెంత పిచ్చివారు!!!"

అన్న మాటలు ఎంతో తాత్త్వికమైనవి.

డా. శేషశర్మ "నియమం–నిష్ఠ", భానుమతీ రామకృష్ణ 'అత్తగారి కథల'ని గుర్తు తెస్తూ అలవోకగా సాగిన హాస్య రచన. ఇలాంటి రచనలకి మన– పర– భేదం లేకుండా భాషని నేర్పుగా వాడగలగాలి. ఈ కథలో అది బాగా కనిపిస్తుంది.

మెడికోశ్యాం గారి ICCU కథ మీద శ్రీ శాయి రాచకొండగారి విశ్లేషణ బాగుంది. కథలోని కొన్ని సన్నివేశాలు రచయిత స్వయంగా చూసినట్టు చెప్పలేదు. అది ఔచిత్యభంగం అవుతుంది. అందుకు కాలాన్ని పాత్రగా చేసి వ్రాయడం రచయిత నేర్పు. (తర్వాత, దూరదర్శన్ లో బాగా పాప్యులర్ అయిన మహా భారత్ సీరియల్ లో కూడా ఇదే టెక్నిక్ ఆ దర్శకుడు ఉపయోగించాడు.). మనందరికీ, అచ్చులో ఉన్న అక్షరం (సిద్ధాంతం, సూత్రం, మొదలైనవి) మీద అచంచలమైన విశ్వాసం ఉంది. అలాగే ఈ కుర్ర డాక్టరుకీ తను పుస్తకంలో చదివిన దాని మీద విశ్వాసం. దాని ఆధారంగానే రోగికి భయం లేదని విశ్వాసం కల్పిస్తాడు. కానీ, అతని సలహాయే రోగి పాలిట మృత్యువయిందా? అన్న విచికిత్స ఈ కథకి కొసమెరుపు. ఇంత మంచి విశ్లేషణ చదివిన తర్వాత పాఠకుడికి ఆ కథ చదవాలనిపిస్తుంది. ఆ కథ లింకు (కథకుడి అనుమతితో) పెట్టి ఉంటే బాగుండేది. అలా చేయడానికి మీకున్న సాధక బాధకాలు ఆలోచించుకోండి.

ఈ వ్యాసంలో ఇన్ఫ్రాక్షన్ కి బదులు ఇన్ఫెక్షన్ అని అచ్చుతప్పు పడింది అన్ని చోట్లా. మీరు గూగుల్ / మైక్రోసాఫ్ట్ ఇత్యాది spell check ల ని ఎక్కువ నమ్మకండి.

**నండూరి సూర్యనారాయణ మూర్తి**

# ఆడ - ఈడ

వసుంధర

✆ 9885620065



**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***యాంకర్ అడిగాడు – దమనయ్యని, "గతంలో 'చెంబు'ని గుడ్డిగా సమర్థించారు. 'చెంబు' అప్పుడూ ఇప్పుడూ ఒకేలా ఉంది. ఇప్పుడు మీరు 'చెంబు'ని దుమ్మెత్తి పోస్తున్నారంటే, ఆ మార్పు మీలోనే అనుకోవాలి. దీన్ని మీరెలా సమర్థించుకుంటారు?" అని.***

***దమనయ్య ఏమాత్రం తడుముకోలేదు. "ఆ మాత్రం తెలియదా– నేనప్పుడు ఆడ! ఇప్పుడు ఈడ. అంతే!" అని టీవీ అదిరేలా బిగ్గరగా నవ్వాడు.***

మిస్టరీలు ఎప్పటివో హిస్టరీలోనే కాదు, ఇప్పుడు మన చుట్టూ కూడా ఉంటాయి. నా ప్రేమ కథ అలాంటిదే! మంజులని మొదట చూసింది ఓ సూపర్ మార్కెట్లో! అందానికి కళ్లు, ఆలోచనలకి మతి ఒక్కసారే చెదిరిపోయాయి. పరిచయానికీ, పలకరింపుకీ... నాకు చొరవ తక్కువ, మొహమాటం ఎక్కువ.

పలకరించి పరిచయం చేసుకోకపోతే... మళ్లీ కనబడదేమో, మిస్టరీగా మిగిలిపోతుందేమోనని భయం!

ఏంచెయ్యాలా అనుకుంటూంటే, అత్తా అంటూ ఓ పది పన్నెండేళ్ల కుర్రాడు ఆమెను సమీపించాడు. అతణ్ణి చూడగానే నాలో ఆశాజ్యోతి వెలిగింది.

అతడు శ్యామ్. ఏడో తరగతి చదువుతున్నాడు. నేనతడి క్లాస్‌టీచర్.

అటెండెన్స్ వేస్తాను కాబట్టి అతడి ఇంటిపేరు తెలుసు. మాకు దూరపు బంధువు కావచ్చని అప్పుడే అనుకున్నాను. ఆమె శ్యామ్‌కి అత్త అయితే కనుక మా పెళ్లికి కులం అడ్డు రాదని సంతోషం కలిగింది.

నన్ను చూశాడు శ్యామ్. క్లాస్ టీచర్నని విష్ చెయ్యలేదు. ఎరుగనివాడిలా నన్ను దాటి వెళ్లిపోయాడు.

నాక్కోపమొచ్చింది. అ కోపాగ్నికి తోడుగా, శ్యామ్ ద్వారా మంజుల పరిచయమయ్యే అవకాశం వచ్చిపోయిందన్న ఉక్రోషాజ్యం!

బాలప్రకాష్ స్కూల్లో టీచర్ని. ఐతే బ్రతకలేక బడిపంతుల్ని కాదు!

ఇంటర్లో సైన్సు గ్రూప్. మార్కులు తొంభై శాతం దాటినా, ఇంజనీరు అవ్వాలనుకోలేదు. లెక్కల్లో బియ్యే, ఫిలాసఫీలో ఎమ్మే చేశాను. అప్పుడు బియ్యీడీ ట్రైనింగ్ తీసుకుని, టీచర్నయ్యాను. టెన్తు క్లాసు దాకా ఏ సబ్జెక్టైనా అవలీలగా చెబుతాను.

ఐతే స్కూల్లో నాకున్న గౌరవానికి వేరే కారణాలూ ఉన్నాయి. గ్రామంలో వారసత్వపుటాస్తి పాతికెకరాలు, నగరంలో ప్రస్తుతం కోట్ల విలువ చేసే స్థలాలు, ఆన్‌లైన్ ట్రేడింగులో నాన్న సంపాదన... వాటిలో కొన్ని! ఉద్యోగం నాకు పురుష లక్షణమే కానీ,

అవసరం కాదు. జీవితమంతా భావితరాలతో గడిపే వెసులుబాటు కోసం, టీచింగ్ జాబ్ ఎంచుకున్నాను. మన చుట్టూ ఉండే వాతావరణంతో టచ్ పోకూడదని, స్కూలుకి తరచుగా బస్సులోనే వెడతాను.

విద్యార్థులకి పాఠాలు చెప్పడమే కాదు, వాస్తవాలపట్ల అవగాహన కలిగించడమూ టీచర్ల బాధ్యతని నేననుకుంటాను! సైన్సు, లెక్కల్లోని క్లిష్టమైన అంశాలు కూడా, గరికిపాటి వారి ప్రవచనాల్లా ఉల్లాసమిచ్చేలా చెబుతానని విద్యార్థుల్లో నాకు పేరు.




శ్యామ్ మంచి స్టూడెంటు. బుద్ధిగా పాఠాలు వింటాడు. శ్రద్ధగా చదువుతాడు. పరీక్షలు బాగా వ్రాస్తాడు. కానీ క్లాసులో ఒక్క ప్రశ్న కూడా వెయ్యడు. అందులో ఏదో మర్మమున్నదని అప్పుడు నాకు స్ఫురించలేదు. ఇప్పుడు నన్ను విష్ చెయ్యనప్పుడు కూడా...!

మంజుల వివరాలు తెలియాలంటే శ్యామ్‌ని కదపాలి. నేరుగా అడిగితే బాగుండదు కాబట్టి ఓ ఉపాయం ఆలోచించాను. మర్నాడు క్లాసులో ఒకో విద్యార్థినే నిలబెట్టి... ఏదో విషయ సేకరణ చేస్తున్నట్లు, వాళ్లింట్లో ఎవరెవరున్నారో ఏంచేస్తున్నారో చెప్పమన్నాను.

నా క్లాసు స్ట్రెంగ్తు ముప్పై. లేని ఆసక్తి నటిస్తూ ఓ పదిమందిని అడిగేక, అప్పుడు శ్యామ్‌ని అడిగాను.

"ఇంకో రోజు చెబుతాను" అన్నాడు శ్యామ్ వెంటనే. తెల్లబోయిన నేను ఏదో అనేలోగా క్లాసంతా ఘొల్లుమన్నారు.

"ఎందుకు నవ్వుతారు?" అని శ్యామ్ మీది ఉక్రోషాన్ని మిగతా పిల్లల మీదకి మళ్లించి గదమాయించాను.

"వాడంతే సార్! ఏమడిగినా, ఇంకో రోజంటాడు" అన్నాడో కుర్రాడు నవ్వాపుకుంటూ.

అప్పుడూ శ్యామ్ తీరు పట్ల ఆసక్తి పుట్టలేదు. మంజుల వివరాల పట్ల ఆత్రుతతో, "ఇంకో రోజంటే ఎప్పుడు... రేపా?" అన్నాను.

"తెలియదు సార్!" అన్నాడు శ్యామ్. మళ్లీ క్లాసంతా ఘొల్లుమన్నారు.

ఏమనాలో తెలియలేదు. జవాబుకోసం నొక్కిద్దామంటే, నేనడిగిన ప్రశ్న అంతరార్థపు లోతులకి వెళ్లి మంజులను తాకాలి. అది నాకిష్టం లేదు. అందుకని ఊరుకున్నాను తప్పితే శ్యామ్ అలా ఎందుకన్నాడూ అనుకోలేదు. వేరే మార్గం ఆలోచించాను.

స్టూడెంట్సందరి వివరాలూ స్కూలు ఆఫీసులో ఉంటాయి. అలా శ్యామ్ తండ్రి పేరు, అడ్రసు, ఫోన్ నంబరు సంపాదించాను. తర్వాత అమ్మకిచ్చి నా పరిస్థితి చెప్పి, "నువ్వోసారి వాళ్లింటికి ఫోన్ చేసి తెలివిగా ఆ అమ్మాయి వివరాలు రాబట్టు!" అన్నాను.

నేనో అమ్మాయిని ఇష్టపడుతున్నానని తెలియగానే అమ్మ ఫ్లాట్. అమ్మాయి తరఫు వాళ్లు మావాళ్లే కావడంతో డబుల్ ఫ్లాట్.

వెంటనే వాళ్లింటికి ఫోన్ చేసింది. అది ల్యాండ్‌లైన్. అవతల ఒకామె తీసి, "హలో!" అంది.

అమ్మ స్పీకర్ ఆన్ చేసి, ఆ వెంటనే, "నేను సీత. మా అబ్బాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. తెలిసినవాళ్లు మీ నంబరిచ్చారు. మీ అమ్మాయి వివరాలు చెప్పగలరా?" అంది.

ఆమె వెంటనే, "ఇంకో రోజు ఫోన్ చేస్తారా?" అంది.

అమ్మ ఆశ్చర్యంగా, "మీకు కావాలంటే మా అబ్బాయి వివరాలు ఇస్తాను...." అని ఇంకా ఏదో అనబోతుండగా– "ఇంకో రోజు ఫోన్ చేసినప్పుడు చెబుదురుగాని...." అందామె.

"ఇంకో రోజంటే ఎప్పుడు?"

"తెలియదండీ!" అని ఫోన్ పెట్టేసిందామె.

ఆ సంభాషణంతా విన్న నాకు... ఆ 'ఇంకో రోజు' అన్న పదం ఇదివరకు విన్నట్లే అనిపించింది. అంతకుమించి పట్టించుకోలేదు.

"బొత్తిగా మర్యాద తెలియనివాళ్లలా ఉన్నార్రా! వీళ్లు మనకొద్దు" అనేసింది అమ్మ.

అమ్మ వద్దనేసినా, మంజులనే కావాలనుకున్న ప్రేమాతురుణ్ణి కాబట్టి – ఈ శతాబ్దపు ప్రత్యేక దైవం షిర్డి సాయిబాబా ప్రబోధించే, శ్రద్ధ, సహనం అవసరం అనుకుంటూ తెగ ఆలోచించాను. అంతే! కాలేజీ రోజుల్లో తెగ ఫాస్టని పేరుపడ్డ మిత్రుడు అజయ్ గుర్తుకొచ్చాడు.

"అడ్రసుందిగా, మిగతా వివరాలు రాబట్టడానికి, అఖండుడైన ఓ పెళ్లిళ్ల పేరయ్య తెలుసు. నాకొక్క రోజు టైమియ్యి!" అన్నాడు వాడు.

వాడు ఒక్క రోజనే అన్నా, ఎందుకో నమ్మకం కుదరక "ఇంకో రోజంటే ఎప్పుడు?" అన్నాను అనుమాన నివృత్తికి.

"ఇంకో రోజేమిటి, ఎప్పుడేమిటి? ఒక్క రోజంటే ఒక్క రోజే!" అన్నాడు వాడు ఆశ్చర్యంగా.

అప్పటికి అనుమానం తొలగిపోవడమే కాదు, అజయ్ అన్న మాట నిలబెట్టుకుని మర్నాటికే వివరాలందించేశాడు.

మంజుల బీటెక్ ఫైనలియర్. ఆమె పెద్దన్న పూర్ణచంద్ర బ్యాంక్ ఆఫీసరు. ఎక్కువగా టూర్లమీద ఉంటాడు. వదిన సత్యవతి హోం మేకర్. చిన్నన్న సతీష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. ఆమె తండ్రి రిటైర్డ్ గవర్నమెంట్ ఆఫీసర్. తల్లి రిటైర్డ్ హోం మేకర్. పూర్ణచంద్ర పిల్లలు శ్యామ్, ఏడేళ్ల గిరిజ. వీళ్లు కాక వచ్చేపోయే చుట్టాలతో ఎప్పుడూ సందడిగా ఉండే ఉమ్మడి కుటుంబమది.

ఈ వివరాలు నాకు తృప్తినిచ్చాయి. మంజులకు చదువయ్యేదాకా పెళ్లి చెయ్యకపోవచ్చు. నాకేమభ్యంతరం లేదు. ఈలోగా మేమిద్దరం ఒకనొకరు అవగాహన చేసుకోవచ్చు. ఒకవేళ మాకు పెళ్లి జరిగినా ఆమె చదువుకు అంతరాయం కలగనివ్వను.

"అమ్మాయి పెళ్లి గురించి ఇంట్లోవాళ్ల ఆలోచనేమిటో కనుక్కున్నాడా మీ పేరయ్య?" అడిగాను ఆత్రుతగా.

"అది 'ఇంకో రోజు' కనుక్కుని చెబుతానన్నాడాయన" అన్నాడు అజయ్.

పొరపాటు విన్నాననుకుని, "ఒక్క రోజంటే– రేపుదయానికా, రాత్రికా?" అన్నాను.

"ఒక్కరోజు కాదు. 'ఇంకో రోజు'. అదెప్పుడో తెలియదన్నాడాయన" అన్నాడు అజయ్.

కథ మళ్లీ మొదటికొచ్చిందని నీరసపడినా– కొన్ని ముఖ్యమైన వివరాలతో కొంత ముందుకు వెళ్లింది కదా అని సరిపెట్టుకున్నాను. మంజుల కుటుంబ వివరాలు విన్నాక, "ఉమ్మడికుటుంబమంటే సంప్రదాయంగా ఉంటారు. ఆవేళ నేను ఫోను చేసినప్పుడు ముహూర్తం మంచిదై ఉండదు. ఆ మాటనడం మర్యాద కాదని 'ఇంకో రోజు' అనుంటారు. ఈసారి మంచి రోజు చూసి నేను మళ్లీ మాట్లాడతాన్లే! ఉమ్మడి కుటుంబంలోంచి వచ్చిన పిల్ల ఇంట్లో అందరితోనూ ఎంచక్కా కలిసిపోతుంది. వదులుకోకూడదు" అంది అమ్మ సంబరంగా.

ఆ తర్వాత నాల్రోజులకి స్కూల్లో క్లాసయ్యేక శ్యామ్ నా దగ్గరకొచ్చి, "వెరీ సారీ సర్! ఆ రోజు మీరడిగితే వివరాలు వెంటనే చెప్పలేదు. ఇప్పుడు చెబుతాను" అన్నాడు. అతడు చెప్పినవన్నీ, అజయ్ నియమించిన పేరయ్య సమాచారంతో టాలీ అయ్యాయి.

శ్యామ్ తీరు ఆశ్చర్యపెట్టినా అంతకంటే ఎక్కువ తృప్తినిచ్చింది అతడిచ్చిన సమాచారం. "ఈ వివరాలు ఆ రోజే చెబితే ఇంకా బాగుండేది. ఒక్క మాట చెప్పు– ఇంట్లో నువ్వొక్కడివే ఇలానా– లేక మీ అత్త, బాబాయి, చెల్లి కూడా ఇంతేనా?" అన్నాను– మంజుల గురించి మాత్రమే అడిగితే బాగుండదని మిగతా ఇద్దర్నీ కలిపి.

శ్యామ్ వెంటనే, "రేపు చెబుతాను" అని వెళ్లిపోయాడు.

ఇది చెప్పడానికి రేపటిదాకా ఆగడమెందుకని అనుకున్నా– 'ఇంకో రోజు' అనకుండా 'రేపు' అని నిర్దిష్టంగా చెప్పాడని సంతోషించాను.

ఆ మధ్యాహ్నం అజయ్ ఫోన్ చేశాడు, "పేరయ్య గుడ్ న్యూస్ తెచ్చాడురా! పూర్ణచంద్రగారు మంజులకి చదువయ్యేలోగానే పెళ్లి చేసే ఉద్దేశ్యంలో ఉన్నారుట. మీ అమ్మగార్ని ఈరోజే ఫోన్ చెయ్యమను. శుభం జరుగుతుంది!" అన్నాడు.

మనసు ఆనందంతో పొంగిపోతుంటే అదుపు చేసుకుని, "కానీ ఈరోజు మంచిదౌనో కాదో‥‥" అని నీళ్లు నమిలాను.

"మంచి రోజా, పాడా! ఆ ఇంట్లో పూర్ణచంద్రగారున్న రోజే మంచి రోజుట!" అన్నాడు అజయ్.

వాడు చెప్పింది వింటే నయం, భయం, విస్మయాలు కలగడంతో పాటు కలిగిన సంశయాలు మాయం కావడమూ జరిగింది.

పూర్ణచంద్రది ఉమ్మడికుటుంబం. ఇంటిల్లపాదీ ఇంటి యజమాని మాటమీదే నడవాలని నియమం. రొటీన్‌కి భిన్నమైనదనిపిస్తే, యజమానిని సంప్రదించకుండా స్వతంత్రించి ఎవ్వరూ ఏ నిర్ణయం తీసుకోరాదు, మాట్లాడరాదు. ఒకప్పుడా ఇల్లు పూర్ణచంద్ర తండ్రి మాటమీద నడిచేది. ఆయన రిటైరయ్యేక ఆ స్థానం పూర్ణచంద్రకు లభించింది. అంటే... శ్యామ్ సూపర్ మార్కెట్లో మంజులతో కనబడినప్పుడు... బయట ఓ టీచర్ ఎదురుపడ్డం అతడికదే ప్రథమం. తండ్రినడగకుండా దణ్ణం పెడితే స్వతంత్రించడం ఔతుంది. అందుకని నేనెవరో తెలియనట్లు నటించాడు. తర్వాత క్లాసులో నేను ఇంటి వివరాలడిగినప్పుడు, తండ్రి టూర్లో ఉన్నాడు. ఆయన తిరిగి ఎప్పుడొస్తాడో తెలియక 'ఇంకో రోజు' అన్నాడు. తెలిసినప్పుడు 'రేపు' అన్నాడు. అమ్మ విషయంలోనూ అదే జరిగింది. బహుశా టూర్లో ఉన్నప్పుడు ఆయన్ను ఫోన్లో కూడా సంప్రదించకూడదన్న నియమముందేమో!

తర్వాత నా ప్రేమకథ చురుగ్గా ముందుకు సాగింది.

ఆ రోజు ఇంటికెళ్లేసరికి ... పూర్ణచంద్రగారు జాతకాలడిగినట్లు శుభవార్త చెప్పింది అమ్మ. ఆ తర్వాత రెండ్రోజులకే జాతకాలు కుదిరాయనీ, మంజులను చూసుకుందుకు రమ్మనీ ఆహ్వానించేడు పూర్ణచంద్ర. తర్వాత పెళ్లిచూపులు సంప్రదాయంగా జరిగాయి. మంజుల డిగ్రీ పూర్తి చేయొచ్చనీ, ఉద్యోగం కూడా తనిష్టమనీ హామీ ఇచ్చారు మావాళ్లు.

నాకు హుషారొచ్చింది. ఇక నేను మంజులను కలుసుకుంటే అభ్యంతరముండదన్న నమ్మకంతో, ఒకరోజు సాయంత్రం ఆమె కాలేజి గేటువద్ద కాసి, పలకరించాను. ఆమె చిరునవ్వుతో బదులివ్వడంతో రెచ్చిపోయి, బీచికి వెడదామని ప్రపోజ్ చేశాను.

“ఇంకో రోజు” అందామె.

“ఇంకో రోజంటే?” అన్నాను అప్రయత్నంగా.

“తెలియదు” అని వెళ్లిపోయిందామె.

అర్థమైంది. పూర్ణచంద్రగారు టూర్లో ఉన్నాడు. ఎప్పుడొస్తాడో తెలియదు. బహుశా నేనెప్పుడైనా కనిపించి పలకరిస్తే, చిరునవ్వుతో బదులివ్వమని చెప్పి ఉంటాడాయన. అదంతవరకే! బీచి ప్రపోజల్‌కి మళ్లీ ఆయన అనుమతి కావాలి.

ఇంటికెళ్లేక జరిగింది ఇంట్లో చెప్పాను. నాన్న వెంటనే, “అది ఉమ్మడికుటుంబంలా లేదు. నియంత ఏలే దేశంలా ఉంది. ఆ ఇంట్లో పెరిగిన పిల్లతో, జీవితకాలం కాపురమెలా చేస్తావురా? ముహూర్తం పెట్టేముందు ఇంకోసారి ఆలోచించాలేమో!” అన్నాడు బెంగగా.

అమ్మ వెంటనే, “అలాగంటారేంటి? పెళ్లయ్యేక ఆడపిల్ల – ఈడ పిల్లే కానీ ఆడ పిల్ల కాదు” అని సంబంధాన్ని సమర్థించింది.

★★★

రాత్రి న్యూస్ ఛానెల్లో కరటయ్య, దమనయ్యల గురించిన డిబేట్ చూస్తున్నాను.

కరటయ్యది చెంబు పార్టీ. అడ్డూ అదుపూ లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడ్డం ఆయన ముద్ర.

కరటయ్య కాకి తెలుపంటే తెలుపే. తెలుగుని తెగులంటే తెగులే. అదీ ఆయన అనుచరుల దృక్పథం.

కరటయ్యే దేవుడని, ఆయన మాటే వేదమని – నమ్మే ఆయన అనుచరుల్లో ముఖ్యుడు దమనయ్య.

ఎందుకంటే – దమనయ్యకు చదువు, సంస్కారం, వివేకం పుష్కలంగా ఉన్నాయని గౌరవిస్తారు జనం. ఆయన కరటయ్య తరఫున ప్రచారం చేస్తే, అందుకు ప్రభావితులై జనం కరటయ్యని పెద్దయ్యగా ఎన్నుకున్నారు. పదవిలోకొచ్చేక కొన్నాళ్లపాటు కరటయ్య దమనయ్యకు చెప్పుకోతగ్గ ప్రాముఖ్యమిచ్చాడు. అధికారం వంటబట్టేక, తన గొప్పతనం మామూలుది కాదన్న భావన పుట్టి పెరిగి బలపడింది. ఆయన క్రమంగా దమనయ్యని పక్కన పెట్టాడు.

అది దమనయ్య కొన్నాళ్లు సహించాడు. కొన్నాళ్లు మాత్రమే సహించేడు.

చెంబు పార్టీ అంటే ఇప్పుడు కరటయ్య. కేవలం కరటయ్య. దమనయ్యని తల్చుకునేవారు లేరు.

తన ఉనికికి గుర్తింపు రావాలంటే– చెంబు పార్టీ వదలక తప్పదని దమనయ్య అనుకున్నాడు. తన భావనని కొందరు జర్నలిస్టుల ఊహాగానంలా మీడియాలో ప్రచారం చేయించాడు.

దమనయ్య ప్రయత్నం ఫలించింది. లోటా పార్టీ ఆయనకోసం ఫీలర్సుని పంపింది.

దమనయ్య లోటా పార్టీలో చేరాడు. చేరుతూనే టి20లో సూర్యకుమార్ యాదవ్‌లా విజృంభించి, కరటయ్యని దుమ్మెత్తిపోస్తున్నాడు.

ఇక న్యూస్ ఛానెల్సుకి పండగే పండగ. దమనయ్య రోజుకో ఛానెల్లో డిబేట్లో పాల్గొంటున్నాడు.

ఒక డిబేట్ చూస్తే మరొకటి చూడక్కర్లేదు. అవే ప్రశ్నలు. అవే సమాధానాలు.

డెయిలీ సీరియల్సుకి అలవాటుపడ్డ జనం. ఆ సీరియల్సుకిలాగే ఈ డిబేట్సుకీ టిఆర్‌పిలు పెంచేస్తున్నారు.

ఆరోజు ఒక ఛానెల్ నిర్వహిస్తున్న అలాంటి డిబేట్‌నే నేను చూస్తున్నాను.

యాంకర్ అడిగాడు– దమనయ్యని, "గతంలో 'చెంబు'ని గుడ్డిగా సమర్థించారు. 'చెంబు' అప్పుడూ ఇప్పుడూ ఒకేలా ఉంది. ఇప్పుడు మీరు 'చెంబు'ని దుమ్మెత్తి పోస్తున్నారంటే, ఆ మార్పు మీలోనే అనుకోవాలి. దీన్ని మీరెలా సమర్థించుకుంటారు?" అనడిగాడు.

దమనయ్య ఏమాత్రం తడుముకోలేదు. "ఆ మాత్రం తెలియదా– నేనప్పుడు ఆడ! ఇప్పుడు ఈడ. అంతే!" అని టివి అదిరేలా బిగ్గరగా నవ్వాడు.

ఈ సమాధానం ఇదివరకు విన్నట్లే గుర్తు! కానీ అమ్మ మంజుల సంబంధం గురించి, "పెళ్లయ్యేక ఆడపిల్ల– ఈడ పిల్లే కానీ ఆడ పిల్ల కాదు!" అని ప్రోత్సహించిన తర్వాత విన్నానేమో– నా మనసుకి బలంగా హత్తుకుంది

దమనయ్య సమాధానంవల్ల జనాలకేం ఒరుగుతుందో తెలియదు. కానీ నాకు దమనయ్య మాటలు మంజుల విషయంలో– అమ్మ వ్యాఖ్య కంటే ఎక్కువ ధైర్యాన్నీ, ప్రోత్సాహాన్నీ ఇచ్చాయి.

# చట్టంతో కాపాడండి

ఓట్ర ప్రకాష్ రావు



✆ 9787446026

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***"దేశంలో కల్తీ వ్యాపారం యథేచ్ఛగా జరుగుతోంది. చట్టం ఏమీ చేయదన్న ధైర్యం! ఉదాహరణకు ఇప్పుడు నూనెల ధర పెరిగిందని గొడ్డుమాంసంతో తయారు చేసిన కల్తీ వంటనూనెను చాలా రోజులుగా అమ్ముతున్నట్లు కొన్ని దినపత్రికలలో వచ్చింది. అవన్నీ వార్తలతోనే... ఆ తరువాత వారిపై ఎటువంటి చర్య తీసుకోవడం లేదు. ముందు అటువంటివారిని పట్టుకుని కనికరం లేకుండా... దిశ హంతకులను ఎన్కౌంటర్ చేసినట్లు ఒక్కసారి చెయ్యండి సార్. ఆ కల్తీ వలన సమాజంలో వ్యక్తులకు ఏర్పడే గుండె జబ్బులు, కాన్సర్ లాంటి తీవ్రమైన జబ్బులనుండి కాపాడినవారవుతారు!"***

వరదరాజు పన్నెండు సంవత్సరాల క్రితం హత్య చేయబడ్డాడు!

అతనొక పెద్ద వడ్డీ వ్యాపారి. దయాదాక్షిణ్యాలు లేకుండా వడ్డీవ్యాపారం చేస్తూ ఎంతోమంది ఆస్తులు తన పేర రాయించుకున్న వ్యక్తి. అతని హత్యను పోలీసులు ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నా, హంతకుడిని కనిపెట్టలేకపోయారు. రాజకీయపార్టీకి చెందినవారు ఉండవచ్చని, లేక తీవ్రవాదులు ఉండవచ్చని, ఆస్తికోసం సొంత బంధువులే హత్య చేసి ఉండవచ్చన్న పుకార్లు వచ్చాయి. కానీ ఏది నిజమన్న సంగతి పోలీసులు చెప్పలేక పోయారు. పన్నెండు సంవత్సరాలయినా ఆ కేసు ముగించలేకపోయారు!

ఈ రోజు ఉదయం వాట్సాప్‌లో వచ్చిన వీడియో వైరల్ అయింది.

ఆ వీడియోలో ముసుగు ధరించిన ఒక వ్యక్తి "అయ్యా నేను రైతు కుటుంబానికి చెందిన వ్యక్తిని. పన్నెండు సంవత్సరాల క్రితం నేనే వరదరాజును హత్య చేశాను. ఇంతకాలమూ నేను అజ్ఞాతంగా పోలీసులకు దొరకకుండా జీవించాను. పోలీసులు ఆ కేసు ఇంకా ముగించలేదని తెలుసుకున్నాను. నేను బయట లోకానికి వచ్చినా, నాకు ఎటువంటి ఆపద కలగదని తెలుసు. కానీ ఇప్పుడు వృద్ధాప్యం వల్ల అనుకుంటాను ... నా మనస్సాక్షి అంగీకరించడం లేదు. అందుకే మీడియా ముందు ఆ హత్యను నేను ఎందుకు చేసానో, ఎలా చేసానో వివరించి పోలీసులకు లొంగిపోదలచుకున్నాను. ఆదివారం ఉదయం పది గంటలకు గాంధీచౌక్ జంక్షన్ దగ్గరకు వస్తాను. మీడియా వారికీ ఈ విషయం చెప్పదలచుకున్నాను. దయచేసి ఎవరైనా మైక్ లేదా మెగా ఫోన్ లాంటిది ఏర్పాటు చేస్తే బాగుంటుంది, నేను మెల్లగా మాట్లాడినా అందరికీ వినపడుతుంది!" అన్నాడు.

పోలీసులు సైబర్ క్రైమ్ దగ్గరకు వెళ్లారు. మరికొంతసేపటికి ఆ వీడియో పంపిన సెల్ నంబరుతో పాటు చిరునామా సంపాదించారు. ఆ ఫోనుకు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. చిరునామా ప్రకారం ఆ ఇంటికి వెళ్లారు.

పదవ తరగతి చదివే పవన్‌కుమార్... ఆ సెల్‌ఫోన్ ఉపయోగిస్తున్నాడని తెలిసింది. పవన్‌కుమార్‌ను విచారించారు.

"అంకుల్, నేను సైకిల్ మీద వస్తున్నప్పుడు నా ప్యాంటు జేబులోనున్న సెల్‌ఫోన్ ఎక్కడో పడిపోయింది. వెంటనే ఇంటిలో

చెబితే, 'కొత్త సెల్‌ఫోన్ నిర్లక్ష్యంగా పారవేసావా?' అంటూ తిడతారన్న భయంతో ఇంకా చెప్పలేదు. ఎవరైనా తెచ్చిస్తారేమోనన్న ఆశతో ఎదురుచూస్తున్నాను.  మరో రెండు రోజులు చూసిన తరువాత ఇంటిలో చెబుదామనుకున్నాను!" అన్నాడు పవన్ కుమార్.

'హంతుకుడు ఎవడో తెలుసుకోవాలనుకుంటే ఆదివారం దాకా ఎదురుచూడవలసివుంది!' అనుకున్నారు పోలీసులు.

శనివారం సాయంత్రం బడి వదిలే సమయానికి ఎవరో ఒక వ్యక్తి వచ్చి "అయ్యా ఈ సెల్‌ఫోన్ అక్కడ రోడ్డుమీద దొరికింది.  మీ బడిపిల్లలది ఎవరిదైనా కావచ్చని ఇస్తున్నాను!"  అంటూ వాచ్‌మెన్ దగ్గర ఇచ్చి వెళ్ళాడు.

వాచ్‌మెన్ వెంటనే హెడ్‌మాస్టర్‌కు అందచేశారు. హెడ్‌మాస్టర్ ఆ ఫోన్ నంబర్ చూసి అది పవన్‌కుమార్ సెల్‌ఫోన్ అని తెలుసుకుని పిలిచి ఇచ్చాడు.

పవన్‌కుమార్ వెంటనే పోలీసులకు ఫోన్ చేసి సెల్‌ఫోన్ దొరికిన సంగతి చెప్పాడు

★★★

ఆదివారం ఉదయం పదిగంటలకంతా మీడియా వారు, పోలీసు వారు, ప్రజలు పెద్ద గుంపుగా ఏర్పడ్డారు.

పోలీసుల అనుమతితో మీడియా వారు మైక్ ఏర్పాటు చేశారు. రెండు చేతులలోనున్న తెల్ల జేబురుమాలును ఊపుతూ నేనేనన్నట్టుగా తల ఆడించగానే అందరూ ఆశ్చర్యంతో అతనికి దారి ఇచ్చారు. డెబ్బై సంవత్సరాల వయసుగల ఆ వ్యక్తి చాలా బలహీనంగా వున్నాడు.



మైక్ ముందు నిలబడి ... "అందరికీ నమస్కారం.  నేనొక రైతును, వరదరాజును నేనే హత్య చేసాను." అన్నాడు.

"వరదరాజును ఎలా హత్య చేశారు?" అడిగారు.

సమాధానం చెప్పాడు

"మీదే ఊరు?"

"రామాపురం"

"తెలుగు రాష్ట్రాలలో చాలా రామాపురాలు ఉన్నాయి..."

రామాపురం ఉన్న మండలం, జిల్లా, పిన్‌కోడ్‌తో పాటు తన పేరు చెప్పాడు.

హత్యకు ఉపయోగించిన ఆయుధం గురించి, తప్పించుకున్న విధం గురించి మీడియా వారు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పాడు.

"ఇంతకూ మీరెందుకు హత్య చేశారు?"

"సార్, ఆయన చేసే వడ్డీ వ్యాపారపు రాక్షసత్వానికి, నా స్నేహితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకే హత్య చేసాను."

"స్నేహితుడి కోసమా?" అన్నాడు విలేఖరి.

"ఎస్ ఐ సార్, మరో ఆత్మహత్య జరగకూడదనే, పన్నెండు సంవత్సరాల క్రితం నేను ఆ హత్య చేసాను. ఇప్పుడు నా అంతకు నేనై అంగీకరిస్తున్నాను. నన్ను క్షమించి వదిలివేయవచ్చుగా!" అంటూ ఎస్ ఐ వైపు చూస్తూ అడిగాడతను.

"పన్నెండు సంవత్సరాలే కాదు, పాతిక సంవత్సరాలు తరువాత దొరికినా మేము అరెస్ట్ చేసి కోర్టులో నిలబెడతాం. న్యాయమూర్తులు చట్టప్రకారం శిక్షిస్తారు!" చెప్పాడు ఎస్ ఐ.

"ఈ పట్టణంలో కొంతమంది హంతకులు బహిరంగంగా హత్య చేసినా... ఎందుకు సార్, అరెస్ట్ చేసి కోర్టు ముందు నిలబెట్టలేదు? ఎందుకు అరెస్ట్ చెయ్యలేదు?"

"ఏంటి నువ్వు మాట్లాడేది?" అన్నాడు. ప్రక్కనున్న పోలీసులతో "మైక్ ఆఫ్ చేసి అరెస్ట్ చెయ్యండి!" అన్నాడు.

"ఒక్క నిమిషం సార్, మీరు నన్ను అరెస్ట్ చెయ్యాలనే నేనిక్కడకు వచ్చాను. కానీ నా మనసులోని మాటలను చెప్పడానికి అడ్డుపడినా ప్రయోజనం ఏమీ లేదు. మీడియావారితో పాటు కొంతమంది అధికారులకు ప్రముఖులకోసం వివరంగా వ్రాసి వాటి జెరాక్స్ కాపీలు అందరికీ పంపాను. మీ డిపార్ట్మెంట్ అధికారులకూ పంపాను. ప్లీజ్ కొన్ని నిమిషాలే!" అంటూ చేతులు జోడించాడు.

ఇన్స్పెక్టర్ ఒకసారి పోలీసుల వైపు చూస్తూ ఆగమన్నాడు.

"థాంక్స్ సార్! పది సంవత్సరాల క్రితం బహిరంగంగా హత్య చేసిన ఈ పట్టణంలోని ప్రముఖ వ్యక్తిని ఎందుకు సార్ అరెస్ట్ చెయ్యలేదు?"

"ఏయ్! ఏమిటి నువ్వంటున్నది?" కోపంగా అన్నాడు.

"సార్ పది సంవత్సరాల క్రితం ఈ పట్టణంలో చెరువును కబ్జా చేసి ఒక రాజకీయ వ్యక్తి కాలేజీ కట్టాడు. చెరువును కబ్జా చేసి కాలేజీ కట్టడం అంటే భూమిని హత్య చేసినట్లే సార్... ఆ చెరువు మూత పడటం వలన వర్షపు నీరు పట్టణంలోకి వచ్చి ఎంత ఇబ్బందిపడ్డారో మీకు తెలుసు కదా సార్!"

ఆ మాటలతో అక్కడున్న ప్రజల్లో ఏదో చలనం, ఉత్సాహం, సంతోషంతో అతని మాటలను బలపరుస్తున్నట్టుగా విజిల్స్, చప్పట్లు...

"సార్, ప్రతి మనిషి విజయానికి వెనుక ఒక స్త్రీ ఉంటుంది అంటారు. అది ఎంతవరకు నిజమో కానీ, ప్రతి భూకబ్జా అంటే భూమి హత్య వెనుక ఒక రాజకీయ నాయకుడు వుంటాడన్నది జగమెరిగిన సత్యం. ఆ చెరువులో కాలేజీ కట్టిన చోట పడగొట్టి మరలా ఆ చెరువుకు ప్రాణం పొయ్యండి అంటే అది కుదరదు అంటారు. ఆ హంతకులను ఎన్కౌంటర్ చేసినా పాపం లేదు కానీ, వారికి ఆవగింజంత శిక్ష లేదు. అందుకే చెరువులు, అడవులు ఆక్రమించుకుంటూ ఇప్పుడు పల్లెలవైపు వస్తున్నారు!"

"ఇంతకూ మీరేమి చెబుతున్నారు?"

"నేషనల్ హై వే వస్తుందంటే దయాదాక్షిణ్యాలు లేక, ఎటువంటి రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా వేయడానికి పవర్ ఉన్నది. అలాగే ఈ పోలీసులకు, కోర్టులకు ప్రభుత్వానికి స్వతంత్రంగా అలాంటి హంతకులను శిక్షించడానికి స్వేచ్ఛ ఎప్పుడు వస్తుంది. ఎవరి ఒత్తిడులకు లొంగకుండా ఒక మిలట్రీలాగ పని చేయగల రోజు రావాలి. పోలీసు వ్యవస్థ అంటే మంత్రులు తప్పుచేయడానికి భయపడాలి కానీ..."

"సార్ మీరు ఎక్కువగా మాట్లాడుతున్నారు... మీరు మాతో రండి!" కోపంగా అన్నాడు ఇన్స్పెక్టర్.

"క్షమించండి సార్. చివరగా రెండే రెండు విషయాలు, మొదటిది ఏమిటంటే దేశంలో కల్తీ వ్యాపారం యథేచ్ఛగా జరుగుతోంది. చట్టం ఏమీ చేయదన్నధైర్యం! ఉదాహరణకు ఇప్పుడు నూనెల ధర పెరిగిందని గొడ్డుమాంసంతో తయారుచేసిన కల్తీ వంటనూనెను చాలా రోజులుగా అమ్ముతున్నట్లు కొన్ని దినపత్రికలలో వచ్చింది. అవన్నీ వార్తలతోనే... ఆ తరువాత వారిపై ఎటువంటి చర్య తీసుకొనడం లేదు. ముందు అటువంటి వారిని పట్టుకుని కనికరం లేకుండా ... 'దిశ' హంతకులను ఎన్కౌంటర్ చేసినట్లు ఒక్కసారి చెయ్యండి సార్. ఆ కల్తీ వలన సమాజంలో వ్యక్తులకు ఏర్పడే గుండె జబ్బులు, కాన్సర్ లాంటి తీవ్రమైన జబ్బులనుండి కాపాడినవారవుతారు!"

మరలా చప్పట్లు... ఈలలు.

"మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, వరదరాజుల్ని నేను చంపలేదు. ఆ రోజు నేను కాలు ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో వున్నాను. వాటికి కావలసిన పేపర్స్ నా దగ్గర వున్నాయి. నాకున్న వ్యాధి వలన నేను మరణానికి దగ్గరవుతున్నాను. మరణించే లోపున ఒక మంచి పని చెయ్యాలనిపించి ఇలా చేసాను!"

"వరదరాజుల్ని ఎలా హత్య చేసారో అంత చక్కగా ఎలా వివరించారు?"

"ఆ సమయంలో వచ్చిన దినపత్రికలలో వార్తలను సేకరించి మీరందరూ నమ్మేలా ఒక కట్టు కథ కల్పించాను. చెరువులను ఆక్రమించడం నేడు సర్వసాధారణమైంది. అందుకు కారణం వారి వెనకనున్న రాజకీయం. దయచేసి భూమిని కాపాడండి! పన్నెండేళ్ల క్రితం నేను హత్య చేసానంటే అరెస్ట్ చేయడానికి వచ్చినందుకు మీకు నా ధన్యవాదములు! పది సంవత్సరాల క్రితం చెరువులు ఆక్రమించుకున్న భూకబ్జాదారులను శిక్షించలేని మీ చట్టాన్ని చూస్తుంటే బాధగా వుంది. భూమిని కాపాడే చట్టం మీ చేతుల్లోకి రావాలి. ఆఖరుగా నేను కోరుకునేది ఒక్కటే... భూమిని కాపాడాలన్న అవగాహన ప్రజలలో, మంత్రులలో లోపించింది. ట్విన్ టవర్స్‌ను నిబంధనలను ఉల్లంఘించి నిర్మించారంటూ... వాటిని కూల్చివేయాలని కోర్టు ఆదేశించడం... ఆ తరువాత కూల్చివేయడం మీకందరికీ తెలుసు. భూమాతను మీరైనా చట్టంతో కాపాడండి సార్. అందరికీ ధన్యవాదములు. ఎస్ ఐ సార్ నన్ను అరెస్ట్ చేసుకోవచ్చు!" అంటూ చేతులు జోడించాడు.

# భారపు పగ్గాలు

పెనుమాక నాగేశ్వరరావు



✆ 9441254044

**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***పాపపుణ్యాలంటే నాకు అనిపించేది ఒక్కటే! మనవల్ల ఒకరు బాధపడితే ... అది పాపం! ఒకరి సంతోషానికి మనం కారణమయితే ... అదే పుణ్యం! అంతేకాదు ... మన సంతోషమే స్వర్గము, మన దుఃఖమే నరకం అన్నారు చూడు, నా దృష్టిలో అదే నిజం! త్రిశంకు స్వర్గాలు, పున్నామ నరకాలు కాదు. అయినా కర్మఫలం తప్పించటం భగవంతుడి వల్లే కాదని చెబుతుంటే, మన కడుపున పుట్టిన పిల్లల వల్ల అవుతుందా?***

ఉదయం అయిదు గంటలకి ఓ అయిదారు నిముషాలు అటుయిటుగా నిద్ర లేస్తాడు ధర్మరాజు!

పేదలు కక్కుర్తి పడితే అర్థం చేసుకోవచ్చు. జాలి చూపవచ్చు. కోట్లకి పడగలెత్తిన మారాజులు కక్కుర్తి పడితే ఎట్లా? టూత్ పేస్టు నొక్కుతూ రోజూ అనుకుంటాడు ధర్మరాజు. దాన్లో సగం పేస్ట్, సగం గాలి. అందుకే ఆయనకి ఆ అసహనం. అలా మొదలయ్యే అసహనం ఏదో ఒక కారణంగా రోజంతా వెంటాడుతూనే వుంటుంది. దంతధావనం చేసుకుని ఇంట్లోకి వచ్చేసరికి కాఫీగ్లాసు చేతికి అందాలి. కప్పు పనికి రాదు ... గ్లాసుడు కాఫీ లోపలికి వెళితే గానీ సంతృప్తి కలగదు పాపం ధర్మరాజుకు. బాగా దగ్గరి బంధువుల ఇళ్లకూ, రోజూ కలిసే స్నేహితుల ఇళ్లకూ వెళ్లినప్పుడు, ఆయనకి అలా గ్లాసుతో కాఫీ అందుతుంది. కొత్తవారు మాత్రం కప్పుతోనే సరిపెడతారు. అసంతృప్తిగానే పెదవులు తడుపుకుంటాడాయన!


కాఫీ ప్రియుడు ధర్మరాజు. పూర్వం కాఫీ పెడుతుంటే వంట గదిలోంచి ఘుమఘుమలాడుతూ చక్కని వాసన వచ్చేది. ఇప్పుడేముంది ఆ కాఫీపొడి అంతా కల్తీమయం. ఆ వాసనా, ఆ రుచీ మళ్ళీ ఎక్కడినుంచి వస్తాయంటూ వాపోతూనే కాఫీ తాగేస్తుంటాడు ధర్మరాజు.

స్నానం చేస్తూ చేతిలోకి తీసుకున్న సబ్బు వంక చూసి పెదవి విరుస్తాడు. దాని పరిమాణం తగ్గింది. నాణ్యతా తగ్గింది. పరిమళమూ తగ్గింది. సబ్బు రుద్దుకుని స్నానం చేసి వస్తే, ఇల్లంతా ఎంత చక్కటి సువాసన వస్తుండేది! ఇప్పుడేవి అలాంటి సబ్బులు? పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన ఉన్నాయి ... అనుకుంటూనే స్నానాలగది నుంచి బయటపడతాడు.

లోపలికి వస్తూనే దేవుడి గూడు దగ్గర కుంకుమ బొట్టు పెట్టుకుని నుంచుని చేతులు జోడిస్తాడు. భక్తిగా కళ్ళు మూసుకుని ఏవో శ్లోకాలో, పద్యాలో శబ్దం రాకుండా చదువుకుంటాడు. అప్పటికే భార్య వెలిగించిన అగరు బత్తీల వాసనకి అసంతృప్తిగా పెదవి విరచి, అక్కడినుంచి హాల్లోకి చేరతాడు. అప్పటినుంచి మొదలవుతుంది అసలు కథ. దినపత్రిక చేతిలోకి తీసుకుని, ఒక్కో వార్తా చదవటం, వ్యాఖ్యానించటం అలవాటు ధర్మరాజుకు! పైగా తాను భార్యతో చెప్పిన విషయాలేమైనా వార్తగా వస్తే, రెట్టింపు ఉత్సాహంగా పెద్దగా చదివి వినిపిస్తాడు. ఆమెకు వేరే వ్యాపకం ఉండకపోవటంతో కాసేపు భర్త చెప్పే వార్తా విశేషాలతో పాటు మరికొన్ని వింతలూ, విడ్డూరాలూ కూడా విని, ఆనక ఫలహారం తయారుచేసే పనికి ఉపక్రమిస్తుంది.

కందిపప్పు వేయించేటప్పుడు రావాల్సిన కమ్మని వాసన రానప్పుడూ, తిరగమోత తిప్పుతున్నప్పుడు గుప్పున కొట్టవలసిన కమ్మని వాసన నాసికాపుటాలకు అందనప్పుడు, ఇంపైన ఇంగువ ఘాటు లేశమైనా లేనప్పుడూ అసంతృప్తిగా పెదవులు చప్పరించకుండా ఉండలేడు, పాపం ధర్మరాజు.

ధవళ వస్త్రాలలోనే దర్శనం ఇస్తుంటాడు ధర్మరాజు. వయసు మూడు పదులు దాటేవరకు తెల్ల చొక్కా, తెల్ల పాంటు ధరించిన ధర్మరాజు షష్టి పూర్తి అయ్యాక ధోవతిలోనే ఎక్కువ కనబడసాగాడు. బిళ్ళగోచీ పెట్టి కట్టుకునే ధోవతి, పొడుగు చేతుల ఖద్దరు చొక్కాలో నిండుగా గంభీరంగా కనిపిస్తాడు ఆరడుగుల ధర్మరాజు. చెదరని చిరునవ్వు ఆయనకు అదనపు ఆకర్షణ. చిన్నప్పటి నుంచీ ఖరీదైన చెప్పులే వాడటం అలవాటు. నాణ్యత కలిగిన పరిమళ ద్రవ్యం ఉపయోగిస్తాడు ధర్మరాజు. పనిమీద వెళ్ళేటప్పుడు, ఊళ్ళకి వెళ్ళేటప్పుడు భుజంపైన కండువా ఉండాల్సిందే. ఇది ఇప్పుడాయనకు అవసరంగా మారిన అలవాటు.



నాజూకుతనము, నాసిరకము తప్ప నాణ్యత వుండటం లేదు వస్తువుల్లో ... మనుషుల ఆలోచనలూ, మాటలూ కోటలు దాటుతున్నాయే తప్ప, చేతల దగ్గరికి వచ్చేసరికి చేతకానితనమే కనబడుతున్నది ... చతికిలపడటమే జరుగుతున్నది. తేలిగ్గా తేల్చేస్తున్నారు, తెల్లముఖాలు వేసేస్తున్నారు. తీగలు లాగినట్లు నటిస్తున్నారు కానీ డొంకలు కదలటంలేదు.

‘‘కమలా ... రేపటినుంచి నువ్వు నాకు వంట నేర్పాలోయ్!" భార్యనుద్దేశించి అన్నాడు ధర్మరాజు

‘‘అదొక్కటే తక్కువ. ఏం ... మీకు పుస్తకాలు, టీ. వీ. కార్యక్రమాలు, అందులో వచ్చే రాజకీయ చర్చలు, బయట చూసే నాటకాలు, సభలు, సమావేశాలు చాలటంలేదా ... వంట మీద మనసు పడుతున్నారు!" ముసిముసిగా నవ్వుకుంటూనే చిరుకోపం నటించిందామె.

"కాదులే కమలా... నేను నిజంగానే అడుగుతున్నాను! రేపటినుంచి ఓ నెల రోజులు నాకు నేర్పు. ఆ తర్వాత నా నేర్పు నీకు చూపిస్తాను. సరేనా!"

"మీరంతగా అడుగుతుంటే కాదంటానా? అలాగే!"

"వెరీగుడ్... వెరీగుడ్! దటీజ్ మై కమల. థాంక్యూ!" సంబరపడిపోయాడు ధర్మరాజు.

ఆమె వంటపనిలో పడింది. ధర్మరాజు ఆలోచనలో పడ్డాడు.

ఏది పుణ్యం? ఏది పాపం? ఏది మంచి? ఏది చెడు? ఏది నిజం? ఏది అబద్ధం? అన్నీ ప్రశ్నలే! అన్నీ సందేహాలే!

తీర్థయాత్రలకు వెళ్లివస్తే పుణ్యం వస్తుందంటారు. నదీస్నానం పుణ్యాన్నిస్తుందంటారు. సాధూనాం దర్శనం పుణ్యం అని కూడా అంటారు. పుణ్యం సంపాదించటానికి ఇన్ని దారులు ఉన్నై. ఇంకా చాలా కూడా ఉన్నాయట. పాపపు పనులు చేయకుండా

ఉండటమే పుణ్యం అని తేల్చేశాడు మొన్నీ మధ్యనే వచ్చి వెళ్ళిన స్నేహితుడు రాంబాబు. అది కూడా సమంజసంగానే తోచింది ధర్మరాజుకు.

అతగాడు అంతటితో ఆగలా... 'మనం ఎవ్వరినీ మోసం చేయకుండా బ్రతకటం పుణ్యం. మనం మోసపోకుండా వుండటం తెలివి, మోజు పడటం పాపం!' అని మూడు ముక్కల్లో వేదాంతం వల్లించాడు. అతను అంత తేలిక మాటల్లో ఎంతో గొప్ప విషయాల్ని చెప్పినట్లు అనిపించింది ధర్మరాజుకు.

ఇంకా కొంచెం వివరంగా చెప్పమని అడిగాడు ధర్మరాజు

"ఏం లేదు మిత్రమా! మనం బ్రతకటానికి ఏదో ఒక పని చేస్తుంటాం కదా... ఆ పని చేయటానికి బద్ధకించకూడదు. ఎవరి మెప్పు కోసమో చేయకూడదు. ఇష్టంగా చేయాలి. తృప్తిగా చేయాలి. తపనగా చేయాలి. నువ్వు ఆ పని చేస్తున్నందువల్లే కదా, రోజూ నీ ఆకలి తీర్చుకుంటున్నావు? నీ ఆకలి తీర్చే ఆ పని పట్ల నీకు అత్యంత శ్రద్ధ వుండాలి! ఇక రెండవది మోసపోకపోవడం ... ఊరకనే వచ్చే దేనినీ ఆశించకు. నువ్వు మోసపోవు. నీ మనసే నిన్ను మోసం చేసేది, ఎవరో, ఎవరో ఎవరో కాదు! మూడవది, ముఖ్యమైనది మోజు పడకపోవటం! అంటే... ఇది ఇలాగే జరగాలి, అది అలా జరిగితేనే బాగుంటుందని అనుకోవటమే మోజు పడటం. అది లేకపోతే ఇక పాపం లేనట్లే. పాపం లేకపోతే ఉండేది పుణ్యమేగా!

"నన్ను నేను ఎవ్వరితోనూ పోల్చుకోను. పోటీ అసలే పడను. వాళ్ళు అలా ఉన్నారు. నేను ఇలా ఉన్నాను. నేను ఆనందంగా ఉన్నాను. హాయిగా ఉన్నాను. ఎవరైనా బాగున్నారంటే సంతోషిస్తానుగాని అసూయపడను. కోపం వస్తే వస్తుంది, పోతుంది గాని ఎవ్వరిపైన నాకు ద్వేషం లేదు. ఉపకారం చేస్తానో చెయ్యానోగాని అపకారం చేయను. అసలు ఆ ఆలోచన కూడా రాదు. నా పనే నా ప్రపంచం. నా ఇల్లే నా సర్వస్వం. నా ఇల్లే నా స్వర్గం!" చెప్పాడు రాంబాబు.

మరి దేవుడి సంగతి ఏమిటంటావని అడిగాడు ధర్మరాజు కుతూహలంగా.

"ఇప్పుడు మనం మాట్లాడుకున్నట్లు బ్రతుకగలిగితే మనమే దేవుళ్ళం! ఇంకా దేవుడితో పనేముంది? అయినా దేవుడనే వాడు ఒకడున్నాడు అనుకుంటే పోలా? కాస్తో కూస్తో మంచే జరుగుతుంది!" అని నవ్వేశాడు రాంబాబు.

"నువ్వే దేవుడివి... ఇంకా దేవుడెవరు? అందరూ చెప్పేది అదే. కానీ మనం అర్థం చేసుకోకుండా ఆ దేవుడు ఎవరో బయట ఎక్కడో ఉన్నాడని వెతుక్కుంటూ వెళుతున్నాం... అంతే! నిన్ను నువ్వు తెలుసుకో అంటే అర్థమదే!" అన్నాడు.

అతగాడి మాటల్లో ఏదో కాన్ఫిడెన్స్ ధ్వనించటంతో ధర్మరాజుకు ఇంకా ఇంకా వినాలనిపించసాగింది.

"ఇంకొంచెం వివరంగా చెప్తావా?" ఆసక్తిగా అడిగాడు ధర్మరాజు.

"నీలాంటి ఓ భక్తుడు దేవుని దర్శనానికి వెళ్ళి గంటకు పైగా క్యూలో నుంచుని, కాళ్ళు నొప్పులు పెడుతుండగా... 'డబ్బులున్న మారాజులకు దగ్గర్నుంచి కనిపిస్తావు, నాబోటి పేదోళ్ళకి మాత్రం దూరం నుంచి, అదీ గంటల తరబడి నిలబెట్టి గాని దర్శనం ఈయవు. ఇదేం న్యాయం స్వామీ?' అని అడిగాట్ట. అందుకు బదులుగా దేవుడెమన్నాడో తెలుసా?" అడిగాడు రాంబాబు

"నాకేం తెలుసు. నువ్వే చెప్పు!" అని పెద్దగా నవ్వాడు ధర్మరాజు

"తల్లికి మించిన దైవం లేదు అని చెప్పాను. మీరు ఆవిడని పూజించటం చేయకపోగా, నిరాదరిస్తున్నారు! తండ్రి మాటకు

మించిన వేదం లేదు అన్నాను, మీరు పాటించటం లేదు! గురువే దైవం అన్నాను, మీరు వినిపించుకోవటం లేదు! ఇక్కడా, అక్కడా అని కాదు నువ్వు ఎక్కడ వెతికితే అక్కడ ఉన్నాన్నేను అంటే నమ్మలేకపోతున్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారికి సహాయం చేయండి, నాకు సేవ చేసినట్లే అని చెబుతుంటే ఆచరిస్తున్నారా? నన్ను ఇక్కడ నిలబెట్టి, నేను ఎప్పుడు మీకు కనిపించాలో వేళలు మీరే చెప్పి, టిక్కెట్లు పెట్టి మీ ఇష్టం వచ్చినట్లు అన్నీ మీరే చేసి నన్ను నిందిస్తారా?' అని అడిగాట్ట దేవుడు. ఇప్పుడు చెప్పు!" అంటూ ధర్మరాజు కళ్ళల్లోకి సూటిగా చూశాడు రాంబాబు.

"నువ్వు సినిమాలు బాగా చూస్తుంటావనుకుంటాను!" అడిగాడు రాంబాబే మళ్ళీ.

"చూస్తాను! ఇప్పుడు టీ. వీ. ఉందిగా, సినిమాలు కాస్త తగ్గినట్లే!" అన్నాడు ధర్మరాజు నవ్వుతూ.

"మంచిది... మంచిది! సినిమా అయినా, టీ.వీ. సీరియల్ అయినా మనం చూస్తూ భావోద్రేకాలకి గురి అవుతుంటాం కదా? అదే విలన్ మీద కోపం వస్తుంది, హీరో మీదనో, హీరోయిన్ మీదనో జాలి పుడుతుంది, హాస్యనటుడి మాటలకి, హావభావాలకి నవ్వు వస్తుంది. ఒక సినిమా చూసేటప్పుడు మనకి కోపం కలుగుతున్నది, జాలి కలుగుతున్నది, భయం ఆనందం కూడా కలుగుతున్నాయి! మన జీవితం కూడా ఓ సినిమానే! ఇప్పుడు చెప్పుకున్న భావాలన్నీ కలుగుతై, పోతై. ఈ జరిగే పరిణామాలన్నింటినీ సినిమా చూస్తున్నట్లు చూడటమే మన పని!" అంటూ ఆగాడు రాంబాబు.

మళ్ళీ తానే, ఒక్క నిమిషం ఆలోచించి... "చివరిగా ఒక్క మాట చెప్పి ఇక నేను బయలుదేరుతాను. పాపపుణ్యాలంటే నాకు అనిపించేది ఒక్కటే! మనవల్ల ఒకరు బాధపడితే ... అది పాపం! ఒకరి సంతోషానికి మనం కారణమైతే... అదే పుణ్యం! అంతేకాదు, మన సంతోషమే స్వర్గము, మన దుఃఖమే నరకం అన్నారు చూడు, నా దృష్టిలో అదే నిజం! త్రిశంకు స్వర్గాలు, పున్నామ నరకాలు కాదు. అయినా కర్మఫలం తప్పించటం భగవంతుడివల్లే కాదని చెబుతుంటే, మన కడుపున పుట్టిన పిల్లల వల్ల అవుతుందా? అందుకే ఈ బంధాలు, మమకారాలకు నేను పెట్టిన పేరు త్రిశంకు నరకం! అలాగే వేటితోనూ సంబంధం లేకుండా వుండటమే పున్నామ స్వర్గం అంటాను!" అని బయలుదేరాడు రాంబాబు.

చాలా చాలా పెద్ద విషయాన్ని చిన్న చిన్న మాటల్లో చెబుతున్నాడనిపించింది ధర్మరాజుకు.

రాంబాబైతే వెళ్ళిపోయాడు గానీ, అతను చెప్పిన మాటలు ధర్మరాజు మనసును వదిలి వెళ్ళటం లేదు. ఎందుకో ధర్మరాజులో గతంలో లేని సంతోషం ఏదో చోటు చేసుకుంది. కొత్త ఉత్సాహం ప్రవేశించింది.

బహుశా పిల్లలు లేరన్న దిగులు రాంబాబు మాటలతో పూర్తిగా వదిలిపోయిందని చాలాకాలం తర్వాత తెలుసుకున్నాడు ధర్మరాజు. తన సంతోషానికి కారణమైన రాంబాబుదే పుణ్యమంతా అని నవ్వుకున్నాడు ధర్మరాజు.

# జీవితాన్ని ప్రేమించే మనిషి

ఎన్. రాఘవేంద్రరావు



✆ 9966212386

**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***"అరవై వయసు తర్వాత ఇంకా చాలా కాలం బతకాలని చాలామంది ఆశపడతారు. చాలా కోరికలు తీర్చుకోవాలని, ఆనందాలను పొందాలని, మనసులో తెగ ఉబలాటపడతారు. కానీ ఇప్పటి పరిస్థితులను బట్టి ఇక ఎక్కువ కాలం బతకమేమో అని అనుమానం వచ్చిన వాళ్లు... ఇదిగో ఇలాగే మీ మాస్టారిలాగే ప్రవర్తిస్తారురా..."***

ఆ ఇంట్లో అమరేశ్వరరావు అరవయ్యేళ్ల పండుగ అంగ రంగ వైభవంగా జరుగుతోంది.

అయితే నిన్నటి వరకూ బాగానే హుషారుగా ఉన్న అమరేశ్వరరావు, ఈ రోజు ఒక్కసారిగా చాలా నిరాశగా మారిపోయాడు. తొంభైతొమ్మిది పాళ్ళు జీవితం గడిచిపోయింది... 'ఇక ఒక శాతం మాత్రమే మిగిలి ఉంది' అన్న విచిత్ర భావన, అతని ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అంతేకాదు... తలకు రంగు వేసుకొని వైట్ ప్యాంటు, వైట్ షర్ట్ టక్ చేసి పగలు రాత్రి కూడా నీట్‌గా ఉంటూ, అందమైన టోపీ కూడా పెట్టుకునే అలవాటు ఉన్న అమరేశ్వరరావు... ఒక్కసారిగా ఈరోజు నుండే అవన్నీ వదిలి పెట్టేశాడు! లూజ్ ప్యాంటు లూజ్ షర్ట్‌తో, తల దువ్వుకోవడం కూడా వదిలిపెట్టి, కనీసం గడ్డం కూడా చేసుకోకుండా సర్వం కోల్పోయినవాడిలా, బేల ముఖంతో ఫంక్షన్‌లో అందరికీ కనిపించాడు.

ఫంక్షన్‌కి వచ్చిన అందరితో... 'నాకు మీ అందరినీ చూడడం ఇదే చివరి చూపేమో...' అన్న ధోరణి కూడా అతని మాటల్లో మధ్య మధ్య ఏదో రూపంలో దొర్లుతోంది. దానికి కారణం లేకపోలేదు. అరవై సంవత్సరాలు నిండిన తన స్నేహితులు, బంధువులు చాలామంది... కొందరు దీర్ఘరోగంతోను, కొందరు సడన్‌గాను, ఇంకొందరు కొత్తరకం జబ్బుల బారినపడి... ఈ మధ్య కాలంలోనే పరలోకానికి చేరిపోయారు. ఇవన్నీ చూశాక... 'తను కూడా ఏ గంటలో ప్రాణం విడిచిపెట్టి పోవలసి వస్తుందో' అనే ఒక రకమైన భయాందోళనలకు గురై ... మనిషి చిన్నపాటి వణుకు కూడా వచ్చినట్టు కనిపిస్తున్నాడు అమరేశ్వరరావు!

ఒకపక్క రక్త సంబంధీకులు, దూరపు బంధువులు, దగ్గర బంధువులు, తనకన్నా పెద్దవాళ్ళు, బాల్య స్నేహితులు, ఇరుగుపొరుగు, శ్రేయోభిలాషులు, హితులు, అధికారంలో ఉన్న కొందరు... మొత్తం అందరూ వచ్చి, బెస్ట్ విషెస్ చెప్పి, బొకేలు ఇచ్చి, భోజనాలు చేసివెళుతున్నారు. అలా వాళ్ళు వెళ్తూ వెళ్తూ తనతో ... "వెళ్ళొస్తాం" అని చెబుతున్నప్పటికీ... 'సరే అలాగే వెళ్ళిరండి! థాంక్స్!" అని చెప్పలేకపోతున్నాడు అమరేశ్వరరావు.

మనిషి ముభావంగా, సర్వం కోల్పోయినవాడిలా రేపో ఎల్లుండో మనుషులెవ్వరికీ కనిపించనంత దూరంగా వెళ్ళిపోతాను... అన్నంత వైరాగ్యంతో ముఖం కుంచించుకుపోతున్నట్టుగా ఉన్నాడు.

అలా అలా సాయంత్రానికల్లా అందరూ వెళ్ళిపోయారు. అందరితో పాటు ఇద్దరు కొడుకులు, కోడళ్ళు, వాళ్ళ పిల్లలు... అలాగే

ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళు, వాళ్ళ పిల్లలు... మొత్తం అందరూ అర్జంటు పని ఏదో ఉందని చెప్పి జారుకున్నారు నెమ్మదిగా.

అమరేశ్వరరావు భార్య మంగతాయారు సామాన్లు సర్దుకునే హడావుడిలో పడిపోయింది. ఇక మిగిలింది... అమరేశ్వరరావు, అతని ఇంటి పక్క రెండంతస్తుల బిల్డింగ్‌లో నివాసముండే స్నేహితుడు భక్తవత్సలం. వీరిద్దరూ చెరో కుర్చీల్లో తీరుబడిగా కూర్చుని ఘనంగా జరిగిన కార్యక్రమంగురించి మాట్లాడుకుంటున్నారు.



"ఒరేయ్ అమరేశ్వరరావు... నేను కూడా అరవై ఏళ్ల పండుగ ఇలా చేసుకోలేకపోయానురా! చాలా బాగా జరిగింది. ఎంతైనా నువ్వు అదృష్టవంతుడివి!" అన్నాడు భక్తవత్సలం

"బాగానే జరిగిందిరా, కానీ నేను చివరిదశలోకి వచ్చేసాను కదా! ఇంకెన్నాళ్లు బ్రతుకుతాను? దూరప్రాంతం నుంచి వచ్చిన నా కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, అలాగే మనవళ్ళు, మనవరాళ్ళు సరదాగా నాలుగు రోజులు ఉంటారనుకున్నాను. మళ్లీ వాళ్ళు ఎప్పుడు వస్తారో... వాళ్ళు వచ్చేసరికి నేను ఉంటానో, లేదో..." బాధగా ప్రాణం పోతున్నప్పుడు మాట్లాడే ఆఖరి మాటల్లా అన్నాడు అమరేశ్వరరావు.

"బాగుందిరా. నీ వాళ్ళందరూ వచ్చి కనీసం రెండు రోజులైనా ఉన్నారు. నా రక్తసంబంధీకులు అర డజను మంది ఉన్నా ఒక్కరు కూడా రాలేదు... నెల రోజుల క్రితమే కదా నీకు మల్లే నా ముచ్చట కూడా జరిగింది.. నీకు తెలుసు కదా" అంటూ నిట్టూర్చాడు భక్తవత్సలం.

"అయినా నాకన్నా నువ్వే నయంరా! పిల్లలు అందరూ దూరం దూరంగా ఉన్నారని నీకు తోడుగా ఆ కుర్రాడిని అట్టేపెట్టుకున్నావ్ చూడు... చాలా తెలివైన గొప్ప విషయం అది!" అంటూ, కొంచెం దూరంలో నిలబడి ఉన్న శీనుని చూపిస్తూ అన్నాడు అమరేశ్వరరావు.

"ఆ అనాథ కుర్రాడి విషయమే కదా నువ్వు చెప్పేది! వాడి గురించి చెబుదామనే నేను ఇంత సేపు కూర్చున్నాను. మా పెద్దవాడు నన్ను అమెరికా వచ్చేయమని అంటున్నాడు. ఇక అక్కడే ఉండమంటున్నాడు. నాకు కూడా వెళ్ళిపోదామనే ఉంది. వారం రోజుల నుండి ఏర్పాట్లన్నీ చేసుకుంటున్నాను. నువ్వు నీ హడావుడిలో ఉన్నావు కదా అని చెప్పలేదు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే అనాథ శరణాలయం నుంచి తెచ్చుకున్న ఆ కుర్రాడు, రెండు సంవత్సరాల నుండి నా మంచిచెడ్డలు చూస్తూ నా దగ్గర ఉంటున్నాడు కదా... ఆ శీనుగాడిని ఇకమీదట నీ దగ్గర ఉండేలా నీకు అప్పచెబుదామనుకుంటున్నాను. నిన్న రాత్రి వివరంగా చెప్పి వాడిని అడిగితే, వాడు కూడా సరే అంటూ ఇష్టపడ్డాడు. మరి నీ ఉద్దేశం ఏమిటిరా?" అంటూ ప్రశ్నించాడు భక్తవత్సలం.

"నాకిష్టమేరా... నా చరిత్ర కూడా ఇక అయిపోతోంది కదా! ఈ పరిస్థితులలో నాకు ఎవరో ఒక తోడు కావాలి. కూడా వెన్నంటి ఉండాలి. భార్య ఉన్నా నేను బయటకు వెళ్లిన ప్రతిసారీ నాకూడా ఆమె ఉండలేదు కదా. ఇప్పుడు ఈ పరిస్థితుల్లో ఆ కుర్రాడు

నాకు బాగా ఉపయోగిస్తాడు. ముందు నీకు థాంక్స్ రా. పదో తరగతి ఫెయిల్ అయిపోయిన ఆ కుర్రాడిని ఈ రెండేళ్లలో నీ పనులు అన్ని చేయించుకుంటూ మిగిలిన విషయాలలో కూడా బాగా ట్రైనింగ్ ఇచ్చావు. ఒక విధంగా చెప్పాలంటే కన్నతండ్రిలాగే చూసేవనుకో. వాడికి ప్రపంచం జ్ఞానం నేర్పావు. నేను కూడా నీలాగే రెండు పూటలా తిండి పెట్టి జాగ్రత్తగా చూసుకుంటాను" అంటూ భక్తవత్సలానికి మాట ఇచ్చేశాడు అమరేశ్వరరావు.

"సరేరా... నేను రావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో నాకే తెలియదు. నేను ఉంటున్న ఈ ఇంట్లో, ఊర్లోనే ఉన్న మా బంధువులు ఉండేలా ఏర్పాటు చేశానులే. ఎప్పుడన్నా వస్తే ఉండడానికి ఒక రూము నా కోసం అట్టే పెట్టుకున్నాను. ఎల్లుండే నా ప్రయాణం!" అంటూ లేచాడు భక్తవత్సలం.

"మన టైం అయిపోయిందిరా! ఇక... ఏ రోజు ఏ సమస్య వస్తుందో ఎప్పుడు మంచాన పడతామో తెలియని స్టేజ్‌లోకి వచ్చేసాము. అమెరికా వెళుతున్నావుకదా, అక్కడ నీ ఆరోగ్యం బాగా ఉండేలా చూసుకో! ఏదో ఇలా చెప్తున్నాను గాని, మన జాగ్రత్తలో మనం ఉన్నా, పై నుండి పిలుపు వచ్చిందంటే వెళ్లిపోక తప్పదు. సరే జాగ్రత్త!" అంటూ మిత్రుడికి కరచాలనం చేశాడు అమరేశ్వరరావు .

భక్తవత్సలం శీనుని దగ్గరకు పిలిచి, చెప్పవలసిన విషయాన్ని చాలాసేపు పూర్తిగా చెప్పాడు. చివరగా శీనుని జాగ్రత్తగా ఉండమని, ఎప్పుడైనా ఫోన్‌లో మాట్లాడుకోవచ్చు అని కూడా చెప్పాడు.

శీను కొంచెం బాధపడినా... చివరికి "సరే గురువు గారూ!" అంటూ ఒప్పుకోక తప్పలేదు.

★★★

శీను, అమరేశ్వరరావు ఇంటి వీధిఅరుగు పక్కనే ఉన్న పెద్ద గదిలో ఉంటూ, అమరేశ్వరరావుని 'మాస్టారు' అంటూ సంబోధిస్తూ, ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆయన పక్కనే కనిపెట్టుకుని గడుపుతూ, ఆయన భార్య మంగతాయారు ఏ పని చెబితే ఆ పని చేస్తూ, ఖాళీగా ఉన్నప్పుడు ఏవో పుస్తకాలు చదువుకుంటూ కాలం గడుపుతున్నాడు.

ఆ రోజు...

అప్పుడే పక్క ఊరు రామచంద్రపురం నుండి తనతో మాట్లాడడానికి వచ్చిన వ్యక్తులతో పిచ్చాపాటీలో పడ్డాడు అమరేశ్వరరావు.

వాళ్ళందరికీ కావలసిన ఏర్పాట్లు మొత్తం అన్నీ చేసి, తన మాస్టారు పక్కనే నిలబడ్డాడు శీను.

అమరేశ్వరరావు వాళ్లతో మాట్లాడుతూ... "ఇదిగో రెడ్డిగారూ నా వయసు అయిపోతోంది కదా, నా పరిస్థితి ఏ క్షణంలో ఎలా ఉంటుందో చెప్పలేను. అందుకని మనం ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు తొందర్లోనే సెటిల్ చేసుకుందాం!" అంటూ.. అతనికి చెప్పవలసిన వ్యవహారాలన్నీ చెప్పేశాడు.

ఆ తర్వాత అదే రోజు సాయంత్రం జగన్నాథగిరి నుండి వచ్చిన రంగారావుగారితో మాట్లాడుతూ, "ఇదిగో రంగారావుగారూ, మీ పాతకలప వ్యాపారం బాగుందా? మీ జగన్నాథగిరిలో మా మేనమామగారి అబ్బాయి కృష్ణారావు ఉన్నాడు కదా! నేను ఫోన్ చేసినా, వాడు మొన్న ఫంక్షన్‌కు రాలేదు. నేనంటే చిన్న కోపం వాడికి! నాకు టైం అయిపోతోంది కదా... వాడు కూడ మొన్న వచ్చి ఉంటే బాగుండును అనుకున్నాను. సరే, నా చివరి చూపుకైనా వస్తాడేమో చూడాలి!" అంటూ అతని వ్యవహారాలు చక్కబెట్టి అతడిని కూడా పంపించాడు అమరేశ్వరరావు.

ఈ మాటలన్నీ వింటూ నిలబడి ఉన్న శీను ... తన మాస్టారు అమరేశ్వరరావు ఎందుకు అంత బేలగా మాట్లాడుతున్నాడో... తను ఇక్కడ చేరినప్పటినుండీ ఇప్పటి వరకూ అర్థం చేసుకోలేకపోయాడు. తర్వాత తర్వాత ఆయన విధానం అంతే కామోసు... అని సరిపెట్టుకున్నాడు. తను రెండు సంవత్సరాలు భక్తవత్సలం గారి దగ్గర ఉన్నప్పటికీ, ఆయన ఎప్పుడూ ఇంతలా బెంబేలు పడిపోతూ, మాట్లాడిన సందర్భం కనబడలేదు. ప్రతిక్షణం వయసును గుర్తు చేసుకుంటూ మాస్టారు ఎందుకు ఇలా కంగారు పడిపోతున్నారో శీను అర్థం చేసుకోలేకపోయాడు.

★★★

అలా... ఎలాగోలా నాలుగు ఏళ్ళు గడిచాక...

ఆరోజు... ఆదివారం ఉదయం పార్కులో అమరేశ్వరరావు తన మరో నలుగురు స్నేహితులతో కూర్చున్నాడు.

"మన జగ్గారావు బకెట్టు తన్నేశాడట నిజమేనా?"

"నిజమే... మచిలీపట్నంలో ఉన్నాడు. గట్టిగా వయసు అరవైరెండు ఏళ్లు నిండలేదు."

"నాకూ అదే భయం పట్టుకుంది. మనం సడన్‌గా పోతే మన వెనకాల ఉన్నవాళ్ళు మన ఆస్తుల గురించి కొట్టుకోవచ్చు. మనం ఎక్కడైనా దాచినవి ఏమైనా ఉంటే వాళ్ళకి కనపడక అవి కోల్పోతారు కదా. అందుకనే నేను నాకున్న కొద్దిపాటి ఆస్తులను నలుగురు సంతానానికి నా భార్యకు సమంగా వీలునామా రాసి ఉంచాలి అనుకుంటున్నాను. సీక్రెట్ ఏమీ ఉంచకుండా అన్ని విషయాలు నా భార్యకు వివరంగా అర్థమయ్యేలా... ఈ రోజే చెప్పేయాలనుకుంటున్నాను. ఏమో మన జగ్గారావుగాడి లాగా ఎప్పుడు బకెట్టు తన్నేస్తామో తెలియదు కదా!" అన్నాడు... అతి నిరాశగా మిగిలిన నలుగురు స్నేహితులతో అమరేశ్వరరావు.

పక్కనే ఉండి, ప్రతి అక్షరం వింటున్న శీను... పార్కులో జరిగిన ఈ సంఘటనతో, తన మాస్టారు అమరేశ్వరరావులో కనబడిన ఆందోళనకరమైన ఈ మార్పుకి కారణం ఏమిటో గ్రహించుకోలేకపోయాడు. అరవై ఏళ్లు నిండిన వాళ్ళలో, కొంతమందైతే ఇలాగే 'ఇక ఎక్కువ రోజులు బతకమేమో' అని ఎందుకు బెంబేలు పడిపోతున్నారో శీను చిన్న గుండెకాయ అర్థం చేసుకోలేకపోతున్నది.

ఇంటికి వచ్చాక మాస్టారు ప్రశాంతంగా కూర్చున్నప్పుడు దగ్గరకు వెళ్లి కొంచెం మాట్లాడదాం అనుకున్నాడు... కానీ ధైర్యం చేయలేకపోయాడు.

ఇలా మరో ఏడు ఏళ్ళు గడిచిపోయాయి.

ఇప్పుడు మాస్టారు అమరేశ్వరరావు వయస్సు అరవై ఏడు వచ్చింది. శీను వయసు ఇరవై ఏడు దగ్గర పడ్డాయి.

మాస్టారు అమరేశ్వరరావు ఆరోగ్యం మామూలుగానే ఉంది. కానీ మాట పలికే విధానములో ఆ కంగారుపడుతూ భయపడే తీరు ఇంకా బాగా పెరిగిపోయింది... ఇదివరకటికన్నా.

డెబ్బై ఏళ్లకు దగ్గర పడిపోతున్నాము. ఒక బ్రహ్మరాక్షసి తరుముకు వచ్చేస్తోంది... అన్నట్టు అతని ప్రవర్తన మారిపోయింది.

"మీ మాస్టారు మనసు బాధపెట్టకుండా, ఆయన ఏది చెబితే అది చేస్తూ, ఆయనకు ఏమాత్రం సమస్య రాకుండా, ఏ సందర్భంలోనూ ఎదురు చెప్పకుండా మసలుకో!" అని తన మొదటి గురువుగారు భక్తవత్సలం ఒకసారి అమెరికా నుండి ఫోన్

లో మాట్లాడుతూ చెప్పడంతో, ప్రస్తుత తన మాస్టారు అమరేశ్వరరావు... ఎలా మాట్లాడితే నాకెందుకులే అని సరిపెట్టుకుంటూ బ్రతకడం అలవాటు చేసుకున్నాడు శీను.

మరో ఆరునెలలు అలా గడిచాక...

అమరేశ్వరరావు భార్య, శీనుతో సహా ఓ రోజు అదే ఊరిలో ఉన్న దూరపు బంధువుల ఇంటికి ఫంక్షన్‌కి వెళ్లి ఇంటికి వచ్చాక... ఇంట్లో మాస్టారికి కొంచెం దగ్గరగా వచ్చి నిలబడ్డాడు శీను.

"ఏరా?" ప్రశ్నించాడు మాస్టారు అమరేశ్వరరావు.

"మాస్టారూ, ఒక మాట అడుగుతాను... కోప్పడతారేమో... అడగమంటారా?" అన్నాడు శీను.

అమరేశ్వరరావు ఏమిటన్నట్టు చూశాడు శీను ముఖంలోకి.

"మాస్టారూ... నేను ఏడు సంవత్సరాల నుండి మీ దగ్గరే ఉంటున్నాను కదా... నన్ను మీరు, అమ్మగారు మీ కొడుకు కన్నా బాగా చూసుకుంటున్నారు!" అంటూ చెప్పబోతుండగా, "విషయం చెప్పరా..." సమయం దాటిపోతున్నట్టు అసహనంగా కంగారు పెట్టాడు అమరేశ్వరరావు.

"ఇదే మాస్టారూ ఇదే! ఈ కంగారే, ఈ ఆదుర్దాయే ఈరోజు మనం వెళ్ళిన ఫంక్షన్‌లో కూడా... మీరు వయసు పూర్తిగా అయిపోతున్నట్లు, మహా భయంకరమైన ప్రమాదం జరగబోతున్నట్టు... ఎందుకు మీరలా ఉంటున్నారు? మీ కన్నా పెద్ద వయసు వాళ్ళు కూడా చాలామంది బాగానే ఉన్నారు కదా! నేను వచ్చిన నాటినుంచి, ఇప్పటికీ భగవంతుని దయవల్ల మీ ఆరోగ్యం బాగానే ఉంది. మరి మీరు ఎందుకలా వయసు విషయంలో కంగారుపడుతూ బాధపడుతూ, తడబడుతూ మాట్లాడతారు?" అంటూ ధైర్యంగా అడిగేశాడు.

మాస్టారు చాలాసేపు పిచ్చిగా, అదోరకంగా వెకిలిగా నవ్వేశాడు.

"చిన్న కుర్రాడివిరా... నీకేం తెలుసు పెద్దవాళ్ల మనస్తత్వాలు? నాకు డెబ్బై ఏళ్లు దగ్గరపడుతున్నాయిరా! డెబ్బై సంవత్సరాలు అంటే, తక్కువ వయసు కాదుకదా! కాటికి కాళ్లు చాపి, సిద్ధంగా ఉన్నాం. మా భయాలు మావి! అయినా అరవై ఏళ్లు దాటాక ప్రతిరోజూ దినదిన గండమేరా! ఏ క్షణాన గుండెపోటు వస్తుందో... ఏ క్షణాన పెరాలసిస్ వస్తుందో... ఏ క్షణాన క్యాన్సర్ ఉందన్న విషయం బయటపడుతుందో...ఏ క్షణాన ఏ మాయదారి కొత్త రకం జబ్బు ప్రవేశించి... ఎప్పుడు హుష్ కాకి అయిపోతామో... అన్న భయం ప్రతి క్షణం ఆవరించి ఉంటుంది మా మనసుల్లో!"

"మాస్టారూ... అవన్నీ మాలాంటి పిల్లల్లో కూడా వస్తున్నాయి కదా!"

"మీరు బాధ్యత లేని వాళ్ళురా. మేము బాధ్యతలు ఉన్నవాళ్ళం. మా బాధ్యతలన్నీ సక్రమంగా పూర్తి చేసామో, లేదో... చెయ్యగలమో, లేదో... అన్న బెంగతో బతుకుతున్నవాళ్ళం!"

"మీ బాధ్యతలన్నీ నెరవేర్చేశారు కదా మాస్టారూ... ప్రశాంతంగా ఉండొచ్చుకదా. వయసైపోయింది...వయసైపోయింది అని పది మంది దగ్గర ఏకరువు పెట్టుకుంటూ, మీకు మీరే భయపడిపోతున్నారు. ఈ ఆదుర్దా మీ ఆరోగ్యాన్ని మరీ దెబ్బతీస్తుంది కదా మాస్టారూ?"

"నీకు తెలివితేటలు బాగా పెరిగిపోయాయిరా. పోనీ మాలాంటి ముసలోళ్ళు ఎలా బ్రతకాలో నీకు ఏమైనా తెలిసుంటే చెప్పు!" కోపంగా అడిగాడు అమరేశ్వరరావు.

"నాకు తెలియదు మాస్టారూ... నేను మొన్న మన ఊరి శివాలయంలో చింతామణి శాస్త్రిగారి పురాణానికి వెళ్లాను.. అక్కడ ఆయన వృద్ధుల జీవన విధానం గురించి చెప్పారు. అసలు వృద్ధులు పుట్టిన తేదీ మర్చిపోవాలంట, పాత స్నేహితులని మళ్లీ కలుపుకోవాలట, సరదా కార్యక్రమాలలో పాల్గొనాలట, మార్పుగా ఉండే ప్రదేశాలు తిరగాలట, శత్రువుని మిత్రుడుగా ప్రేమించాలట, కనపడిన ప్రతి పిల్లలతో సరదాగా ఉండాలట, మనసు ప్రశాంతంగా ఉంచుకొని, అసలు చావునే గుర్తు చేసుకోకుండా, నవ్వుతూ గడపాలి అని చెప్పారు. వీటన్నింటికీ మించి భార్యతో ఆనందంగా ఉండాలని అన్నారు. ఇవన్నీ మీకు చెప్పడం కోసం బాగా గుర్తు పెట్టుకున్నాను. ఇందులో ఒక్కటైనా మీరు పాటిస్తున్నారా చెప్పండి మాస్టారూ?" ఏమాత్రం భయపడకుండా అన్నాడు శీను.

"అమ్మో... నా దగ్గరకు వచ్చిన ఈ ఏడు సంవత్సరాలలో చాలా గ్రంథాలు చదివావురా! సరే ఇవన్నీ నువ్వు ముసలాడు అయ్యాక పాటించి వందేళ్లు బ్రతికేయ్! ఇదిగో... నీవన్నీ తెలిసీ తెలియని పిచ్చి మాటలురా! ప్రస్తుతం నా బుర్రలో ఇప్పుడు ఏమి ఆలోచిస్తున్నానో తెలుసా? రేపు సూర్యోదయం నేను చూడగలనా... లేదా... అని ఆలోచిస్తున్నాను. అర్థమయిందా!" అమరేశ్వరరావు కొంచెం కేకలు పెట్టినట్టుగానే మాట్లాడాడు.

"లేదు మాస్టారూ... జరిగేది జరుగుతూనే ఉంటుంది కదా. ఎవరూ ఆపలేరు. అసలు ఏ ప్రమాద సూచనలు లేకపోయినా వయసు తరుముకొస్తోంది అన్న ఆలోచనతో మీరు నిరాశ పడిపోయి, మీ చుట్టూ ఉన్నవారిని నీరసం పెడుతున్నారేమో ఆలోచించండి. మీరు.... 'నా పని అయిపోయింది'... అని ఏడు సంవత్సరాల క్రితమే అనుకున్నారు... అయిపోయిందా? మీకేదైనా నష్టం జరిగిందా? చెప్పండి." సమాధానం చెప్పండి అన్నట్టు ప్రశ్నించాడు శీను.

"పిల్ల కాకివిరా... నీకు పెళ్లి చేస్తేనే కానీ ఇదంతా అర్థం కాదు. వెళ్లి పని చూసుకోరా!"

తన శిష్యునితో వాదించే శక్తి లేనట్టుగా అమరేశ్వరరావు నీరసంగా మడతమంచం మీద వాలిపోయి బెంగపడినవాడిలా దుప్పటి ముసుగు పెట్టాడు. భార్య మంగతాయారు వచ్చి మజ్జిగ అందించినప్పటికీ వద్దని సైగ చేసి ఏదో ఆలోచనలో పడిపోయాడు.

అలా ఇంకొంతకాలం గడిచింది... అమరేశ్వరరావు డెబ్బై ఏళ్ళ వయసులోకి వచ్చాడు. శీనుకి ముప్పై నిండాయి.

★★★

మూడు నెలల పాటు ఇండియాలో ఉండి శీనుకి పెళ్లి చేసి వెళ్లాలనే ఉద్దేశంతో పది సంవత్సరముల తర్వాత... ఇండియా తన సొంత ఇంటికి తిరిగి వచ్చాడు భక్తవత్సలం. తను వెళ్లేటప్పుడు తన ఇంటిలో ఒక పెద్ద గది ఖాళీగా ఉంచుకుని వెళ్ళటం మూలాన అందులోనే ఉన్నాడు. వచ్చిన రోజే అమరేశ్వరరావుతో హాలులో కుర్చీలో కూర్చుని చాలాసేపు మాట్లాడాడు. ఈ పది సంవత్సరాలలో ఈ ప్రాంతంలో జరిగిన వింతలు,విశేషాలు వాతావరణ ప్రభావాలు, ఆరోగ్య విశేషాలు మాట్లాడుకున్నాక... శీను వాళ్ళిద్దరి పక్కన నిలబడి ఉండగానే అతని పెళ్లి విషయం కూడా మాట్లాడుకున్నారు.

"చేసెయ్యాలిరా భక్తవత్సలం... మన శీనుగాడికి ఎలాగోలా మళ్లీ నువ్వు తిరిగి వెళ్ళే లోపల, రెండు నెలల్లో పెళ్లి చేసేద్దాం. ఎందుకంటే నాకు డెబ్బై ఏళ్ళు పైనపడుతున్నాయి కదా. ఏ నిమిషంలో పుటుక్కుమంటానో... భయంగా ఉంది!" అన్నాడు

అమరేశ్వరరావు తన స్నేహితుడు భక్తవత్సలంతో.

అలా వాళ్ళిద్దరూ, రోజూ కూర్చుని మాట్లాడుకుంటూనే ఉన్నారు. శీనుకి సంబంధ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

భక్తవత్సలం వచ్చిన పదిహేను రోజుల తర్వాత, ఆ ఇద్దరూ హాలులో కూర్చుని మాట్లాడుకుంటుండగా రామచంద్రపురం నుండి రెడ్డిగారితో సహా మరో ఇద్దరు వచ్చారు.

“అమరంగారూ... మీ శీను పద్ధతి ఏమంత బాగుండలేదు. పది రోజుల క్రితం, మీతో ఉన్న కొద్దిపాటి బ్యాలెన్స్ విషయం క్లియర్ చేసుకోవడానికి వస్తానని మీకు చెప్పమని మీ శీనుకి ఫోన్ చేశాను. వాడు ఫోన్లో ఏమన్నాడో తెలుసా? ‘రెడ్డిగారూ, మీరు రావద్దు. మా మాస్టారి పరిస్థితి అసలు బాగుండలేదు. చివరి రోజుల్లో ఉన్నట్టుగా ఉన్నారు కదా! వయసు డెబ్భై పైబడి పోయింది కదా... ఏ నిమిషం ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు అన్నట్టుగా నాకు కూడా అనిపిస్తుంది! నేను ఫోన్ చేస్తానులెండి’ అన్నాడు. సరే ఏదో సమస్య అనుకుని, ఆగిపోయి ఈ వీధిలోనే ఉన్న కిరాణాకొట్టు సుబ్బారావుకి ఫోన్ చేశాను. వాడు... మీరు గుండుపిక్కలా తిరుగుతున్నారని, ఏ రోగము, జబ్బు లేదని చక్కగా చెప్పుకొచ్చాడు. మీ శీనుకి కొంచెం భయం చెప్పి దారిలో పెట్టుకోండి! లేకుంటే మీ పరువు ఖచ్చితంగా గంగలో కలిసిపోవడం ఖాయం!” అంటూ గట్టిగా చెప్పి తను వచ్చిన విషయం పూర్తి చేసుకుని వెళ్లిపోయాడు రామచంద్రపురం రెడ్డిగారు.

భక్తవత్సలం శీను వైపు చిలిపి నవ్వుతో... అదోలా చూశాడు.

శీను మీద అమరేశ్వరానికి కోపం తాడిచెట్టు అంత ఎత్తున లేచింది.

“ఒరేయ్ భక్తవత్సలం... ఇదిగో ఈ మధ్యన ఇలా మారేడు ఈ శీనుగాడు! నా గురించి అంత డ్యామేజ్ ఎందుకు చేస్తున్నాడు? నీకు చెప్పలేదు కానీ వారం క్రితం కూడా నేను వీధి చివరకి వెళ్ళినప్పుడు, నన్ను అందరూ చిత్రంగా చూడడం మొదలు పెట్టారు. విషయం ఏమిటి అని వాళ్ళని అడిగితే... ఇదిగో... ఇలాగే వాళ్లకి కూడా చెప్పాడట. నేను బాగానే ఉన్నాను కదా, బీపీ షుగర్ కూడా లేవు. నీకంటే పోయినేడు హార్ట్ఎటాక్ కూడా వచ్చింది అన్నావు... నాకు డెబ్భై ఏళ్ల వరకూ ఏ సమస్యా లేదు. నా పరువు వీడు ఎందుకు మురికి గుంటలో కలుపుతున్నాడో అర్థం కావడంలేదురా!” అనేసాడు చికాకుగా అమరేశ్వరరావు.

“అదేమిటి మాస్టారూ, అవి మీరు అందరికీ ప్రతి రోజూ చెప్పే మాటలే కదా! మీరు అలా చెబుతూ ఉంటే నీరసం వస్తుందని మీ బదులు నేనే చెప్పడం తప్పా? నేను అబద్ధం చెప్పడం లేదు... నాటకం కూడా ఆడడం లేదు! మీ మాటల్నే మీరు చెప్పకుండా నేను చెబుతున్నాను. అలా... మీకు ఉపకారం చేస్తుంటే నన్ను ఆడిపోసుకుంటారేమిటి?” అన్నాడు శీను మరింత చిరాకుగా.

పరిస్థితి మారబోతోందని గ్రహించిన భక్తవత్సలం, దాన్ని కాస్త ప్రశాంతపరచి సర్దుబాటు చేశాడు.

ఆ తర్వాత మరో నెల రోజులకు శీనుకి మంచి సంబంధం కుదరడం, పెళ్లి అవ్వడం జరిగిపోయాయి. తన మాస్టారి ఇంటిలో తను ఉండే గది పెద్దదిగా అన్ని సౌకర్యాలతో ఉండడంతో, భార్యతో అక్కడే ఉంటున్నాడు.

భక్తవత్సలం తను వచ్చిన పని పూర్తిఅవడంతో, మూడు నెలల తర్వాత అమెరికా తిరుగు ప్రయాణం హడావుడిలో ఉన్నాడు. చివరగా స్నేహితుడు అమరేశ్వరరావుతో మాట్లాడడానికి వచ్చి, అతనితో కూర్చున్నాడు. వారిద్దరి పక్కగా శీను నిలబడి ఉన్నాడు.

అప్పుడే జగన్నాథగిరి నుండి పాతకలప వ్యాపారం చేసే రంగారావు కొందరితో కలసి వచ్చాడు. వస్తూ అమరేశ్వరరావుని చూసి అవాక్కయిపోయాడు.

“అమరేశ్వరరావుగారు... మీరు హ్యాపీగా ఉన్నారు సంతోషం. ఆ మధ్య ముఖ్యమైన విషయం మాట్లాడడానికి మీ దగ్గరకు వద్దామనుకుంటే, మీ శీను మమ్మల్ని రెండు నెలలనుండి మోసం చేస్తున్నాడు. మీ పరిస్థితి ఏమాత్రం బాగుండలేదని, ఏ సమయం ఎలా ఉంటుందో చెప్పలేమని, డెబ్భై వయసు దాటాకా ఎవరైనా బ్రతకడం కష్టమని ఇంకా ఏదేదో చెప్పి మమ్మల్ని భయపెట్టేసాడు. చివరికి నిన్న రాత్రి కూడా ‘ఎలా ఉంది పరిస్థితి?’ అని అడిగితే, మళ్లీ అలాగే చెప్పాడు. మీరు చూస్తే సకల ఆరోగ్యంగా ఉన్నారు. ఇలాంటి తప్పుడు వాడిని మీ దగ్గర ఎలా పెట్టుకున్నారు? వీడు నమ్మకస్తుడిగా కనిపించడం లేదు. పంపించేయండి లేదా ప్రమాదంలో పడతారు! ఈ విషయం చెబుదామనే పనిగట్టుకుని వచ్చాను!” అంటూ హెచ్చరించి విసురుగా వెళ్ళిపోయాడు జగన్నాథగిరి రంగారావు.

భక్తవత్సలం, శీను వైపు బుల్లి నవ్వుతో ప్రశ్నార్థకంగా చూశాడు.

అమరేశ్వరరావు, భక్తవత్సలం వైపు చూసి నెత్తి బాదుకున్నారు.

“ఏంట్రా ఈ కర్మ? వీడు నన్ను బతికుండగా చంపేస్తాడేమో! నువ్వు చూస్తున్నావుగా, మూడు నెలల నుండి. బ్రహ్మాండంగా ఉన్నాను కదా... నా మీద పగ పట్టాడా? నాకు ఏ తెగులు, రోగము లేకపోయినా దబ్బపండులాగా బలంగా ఉన్నా, ఏదో కాటికి కాలు చాపిన వాడిలా నా గురించి వీడు అలా చెప్పడం ఏమిటి? వీడిని ఇక నేను భరించలేను. ఏం చేసుకుంటావో తీసుకుపో!” అన్నాడు విపరీతమైన తలపోటు వ్యవహారంగా.

“నేను కూడా ఒక్క నిమిషం ఉండదలుచుకోలేదులెండి మాస్టారూ ... మీరు మొన్న నా పెళ్లిలో కూడా అందరితో మీ వయసు అయిపోయినట్టే మాట్లాడారు కదా? ‘నా చరిత్ర అయిపోయింది. రోజులు లెక్కపెట్టుకుంటున్నాను’ అని మీరు చాలామందితో అన్నారు కదా! మా ఆవిడ కూడా, మీ పద్ధతి చూసి భయపడుతోంది. ‘మనం కూడా మీ మాస్టారిలాగే ఈ చిన్న వయసులోనే ఏమైనా అయిపోతామేమో...’ అంటూ నన్ను ప్రశ్నిస్తోంది. ఆవిడకు సమాధానం చెప్పలేకపోతున్నాను. నేను కూడా వేరే ఎక్కడికైనా వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నాను మాస్టారూ...” ముక్కు ఎగ చీదుకుంటూ అన్నాడు శీను.

అమరేశ్వరరావు కొంచెం మెత్తబడ్డాడు. “సరే శీనూ! ఏదో అనాథవని చేరదీసాం. మా గౌరవం తీసి పడేస్తున్నావు. ఇక అదంతా పక్కన పెట్టు. ఇదిగోరా భక్తవత్సలం... ఇకముందు నేను ఎవరి దగ్గర కూడా ప్రాణం పోతున్నట్టుగా, నిరాశగా అనవసరపు మాటలు ఏవీ మాట్లాడను. అదే కదా వీడి ఉద్దేశం? ఓకే... అలాగే వీడిని కూడా వీడి పద్ధతి మార్చుకోమను! అంతగా తేడావస్తే అప్పుడు చూద్దాంలే. పాపం పెళ్లయ్యి నెలరోజులే కదా అయింది... వెంటనే పొమ్మనడం నాకు కూడా మనసుకు నచ్చుబాటు కావడం లేదు!” అంటూ ఆ చిరాకు సమస్యను అమరేశ్వరరావు తనంత తానే సర్దుబాటు చేశాడు.

భక్తవత్సలం... తన ప్రమేయం అవసరం లేకుండా సమస్య వాళ్ళిద్దరూ కలిసి సర్దుబాటు చేసుకున్నందుకు కాస్త స్థిమితపడి, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాడు.

★★★

భక్తవత్సలం హైదరాబాద్ వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. లగేజ్ బోగీలో సర్ది, రైలు బయలుదేరుతున్నట్టు చెప్పడంతో గబగబా కిందకు దిగి, కిటికీ దగ్గరికి వచ్చేసాడు శీను.

“ఒరేయ్ శీనూ... అరవై వయసు తర్వాత ఇంకా చాలా కాలం బతకాలని చాలామంది ఆశపడతారు. చాలా కోరికలు తీర్చుకోవాలని, ఆనందాలను పొందాలని, మనసులో తెగ ఉబలాటపడతారు. కానీ ఇప్పటి పరిస్థితులను బట్టి ఇక ఎక్కువ కాలం బతకమేమో అని అనుమానం వచ్చిన వాళ్లు... ఇదిగో ఇలాగే మీ మాస్టారిలాగే ప్రవర్తిస్తారురా!” అంటూ... ప్లాట్ ఫామ్

టికెట్ కొనుక్కొని అప్పుడే ఒకటో నెంబర్ ప్లాట్ ఫామ్ లోకి ప్రవేశిస్తున్న ఒక వ్యక్తిని చూపిస్తూ... “అదిగో రా... అటు చూడు!” అన్నాడు భక్తవత్సలం, శీనుతో.

అందంగా షేవ్ చేసుకొని, నీలంరంగు పువ్వుల షర్టు మీద వైట్ ప్యాంటు టక్ చేసి, వైట్ కలర్ టోపీ పెట్టుకుని, బాటా కంపెనీ వారి బూట్లు వేసుకొని, ఓల్డ్ సినీహీరోలా... పరుగులాంటి నడకతో చకచకా... మంచి ఉత్సాహంగా, తాము ఉన్న ఎస్2 బోగీ సమీపిస్తున్న ఆయన... తన పూర్వగురువు భక్తవత్సలంగారికి సెండాఫ్ చెప్పడానికి వస్తున్న డెబ్బై ఏళ్ళ పైబడ్డ తన మాస్టారు అమరేశ్వరరావుగారేనని గుర్తించాడు శీను.

# తాండవం

తులసి బాలకృష్ణ



✆ 8790115544

***'పవర్ ఉండీ వాడి గూండాయిజంకి భయపడి, పిరికితనంతో నేను చేయలేకపోయిన పనిని, తెగించి, అత్యంత సాహసం చూపించి, భర్త చాటు సామాన్య ఇల్లాలివైన నువ్వు చేశావమ్మా. నీకు పాదాభివందనం. ఇక ఏ కేసూ లేకుండా... ఈ చావుకి కారణం... విపరీతంగా తాగి, ఊరి చివర పెంటల దగ్గర పడున్న ఆ దుర్మార్గుడ్ని కుక్కలూ, పందులూ పీక్కు తినడమేనని నిర్ధారణ చేసే బాధ్యతనైనా నేను తీసుకోకపోతే నా జన్మ ఎందుకమ్మా? ఆ ఏర్పాట్లు అన్నీ నేను చూసుకుంటున్నా' అని ధ్వని రహితంగా ఉచ్చరిస్తున్నాడు.***

హాయిగొలిపే కొండగాలి తాకిడికి పరవశంతో ఊగే పూల మొక్కల్లా ... చక్కని భంగిమలతో తాళబద్ధమైన పద తాడనంతో, క్షణాలలో మారుతూన్న సాత్త్వికాభినయంతో, ఆనందంగా సాగుతోంది 'రసతరంగిణి నాట్యాలయం' పిల్లల ఫైనల్ రిహార్సల్.

వాళ్ళని ఉత్సాహపరచడం కోసం, ఆ నాట్యాలయం గురువు సర్వమంగళ కూడా వాళ్లకి అభిముఖంగా నిలబడి, తను కూడా పూర్తి తాదాత్మ్యంతో నృత్యం చేయసాగింది. మర్నాటి సాయంత్రమే తమ బృందం స్థానిక కళామందిరంలో ప్రోగ్రాం ఇవ్వవలసివుంది.

ఆఫీసులో అలసిపోయి వచ్చిన సోమయాజులు చప్పుడుకాకుండా ఓ ప్రక్కగా కూర్చుని, తన భార్య సర్వమంగళ శిక్షణలో నిగ్గుదేలిన ఆ ఆడపిల్లలు ఇవ్వబోతున్న అద్భుతమైన నృత్య ప్రదర్శన తాలూకు ఫైనల్ రిహార్సల్‌ని తన్మయుడై చూస్తూ, సేద దీరుతున్నాడు.

ఆఫీసు నుంచి అలసిపోయి వచ్చిన తనని గమనించని భార్య పట్ల అతనికి కోపం రాలేదు సరి కదా... ఆమె కార్యదీక్షకి మనసు జేజేలు పలుకుతోంది. పైగా ముద్దమందారంలాంటి అందమైన, అమాయకత్వాన్ని నింపుకున్న ఆమె ముఖం మీది చెమటని సుతారంగా రుమాలుతో అద్దాలనిపిస్తోంది కూడా.

రిహార్సల్ పూర్తవుతూనే అభినందనగా చప్పట్లు చరిచాడు సోమయాజులు. అప్పటికి గాని భర్త ఉనికిని అక్కడ గమనించని సర్వమంగళ ఆనందాన్ని, దానితో బాటు క్షమాపణలతో కూడిన బిడియాన్నీ కూడా ప్రదర్శిస్తూ "అయ్యో... మిమ్మల్ని గమనించనే లేదండీ. సారీ. ఇప్పుడే కాఫీ కలిపి తీసుకొస్తా" అంది.

మరు క్షణం...

"నాక్కూడా... అదే చేత్తో మరో కప్పు మేడం గారూ!" బండరాళ్ళు దొర్లుతూన్న ధ్వనితో కూడిన స్వరం. ఉలిక్కిపడి చూసారు దంపతులు గుమ్మం వైపు.

జోడించిన చేతులతో, ముఖానికి అతికించుకున్న కపటపు నవ్వుతో, స్వేచ్ఛగా లోనికి వస్తున్న దొరబాబుని సులభంగానే గుర్తుపట్టిన ఇద్దరూ ఓ నిముషం పాటు తేరుకోలేకపోయారు. అలా బొమ్మల్లా చూస్తుండిపోయారు.

"ఏటీ... అంతటి దొరబాబుగారేటి... మనింటికి రాడవేటీ అని ఆనందంతో ఆచ్చర్యపోతన్నారా?" అంటూ చొరవగా కుర్చీ

లాక్కుని కూర్చుని, "ఏటి లేదండీ... మేడంగారు సేస్తున్న ... అదే సేయిస్తూన్న డేన్సు సౌండు బెయిటికీ ఎలా ఇనిపిత్తాందో తెల్సా! మాంచి గెజ్జెల గుర్రాలు పరిగెత్తుతూన్నంత ఇనసొంపుగా ఉందన్న మాట. సరే ఓపాలి మన కల్లారా కూడా సూద్దారని లోనికొచ్చా. రాకూడదంటే సెప్పండి.. ఎంటనే ఎల్పోతా!" అన్నాడు దొరబాబు అమాయకత్వం 'ప్రదర్శిస్తూ'.

తప్పనిసరి మొహమాటంతో "అయ్యయ్యో ఎంత మాట. మీలాంటి పెద్దలు మా ఇంటికి రావడమే మా అదృష్టం" అంటూ చేతులు జోడించి, భార్యవైపు చూసాడు సోమయాజులు. అర్థం చేసుకున్న సర్వమంగళ శిష్యురాళ్ళని పంపించేసి, వంటగదిలోకి నడిచింది.



"మాంచి దోర జాంః కాయల్లాంటి ఆడపిల్లలనే శిస్యులుగా తీసుకున్నారూ" అంటూ అసహ్యంగా నవ్వి, క్షేమసమాచారాలు కూడా లాంఛనంగా మాట్లాడిన దొరబాబు, "ఏటి లేదండీ. ఈ నియోజికవొర్గానికి మాయన్న సత్తెం బాబే ఎమ్మెల్లే అయినా... అన్ని యవ్వారాలూ నడిసేది నా సేతుల మీదుగానే అని తవరకి తెల్సుగా..." అంటూ ప్రారంభించి, సడెన్‌గా "అవునూ.. మా కార్యకర్త ఎంకటసామిని కులం పేరుతో తిట్టేర్టంటి మీరు?" అనడిగాడు స్వరంలో కొంత తీవ్రతని ధ్వనింపజేస్తూ.

బిత్తర పోయాడు సోమయాజులు. అతి కష్టం మీద తేరుకుని, "నేనా సార్? నేను తిట్టడమేంటి సార్! అసలు ఆ వెంకటస్వామి ఎవరో కూడా నాకు తెలీదే!" అన్నాడు.

"లేదులెండి .. తిట్టార్ట. సాచ్చికాలున్నాయి. సాలా పెద్ద కేసవుద్ది మరి..." అని దొరబాబు అంటూండగా, ట్రేలో కాఫీలతో వచ్చింది సర్వమంగళ. కప్పు తీసుకుని... ఆమెని ఆపాదమస్తకం కామపు చూపులతో తడుముతూ... మదం నిండిన స్వరంతో దొరబాబు "సా...లా హాట్‌గా వుంది .. అహః.. కాఫీ" అంటూ ఏదో గొప్ప జోక్ వేసినట్లు రేకు చప్పుడుతో కిచకిచ నవ్వాడు.

ఒడలంతా సిగ్గుతో కంపించి పోయిన సర్వమంగళ, పెల్లుబికి రాబోయిన దుఃఖాన్ని గొంతులోనే ఆపుకుని, తల దించుకుని వెనుతిరిగి వేగంగా లోపలికి వెళ్లిపోయింది.

కాఫీ తాగుతూ దొరబాబు... "సరే సార్. మజ్జ తరగతి మరియాద ఫ్యేమిలీవోళ్ళు మీరు. మావోడ్ని తిట్టినందుకు కేసులు గట్రా ఎదుర్కుని నిలబడలేరు పాపం. అందుకని... పదిమందిలోనూ అల్లరి పడకుండా, గుట్టు సప్పుడు కాకుండా సమస్య సెటిల్ అయిపోడానికి నేనో ఉపాయం సెబతా. మూడో కంటికి తెలవదని పెమాణం సేస్తున్నా కూడా..." అని ఆగాడు.

ఊపిరి బిగపట్టి కనురెప్పలు వాల్చడం మరిచి చూస్తున్నాడు సోమయాజులు.

ముందుకు వంగి, గొంతు బాగా తగ్గించి, చికిలింత చూపు సాయంతో చెప్పాడు దొరబాబు, "ఒక్కటే అవకాశం మరి. మీ

యావిడ గార్ని నా కాడికి ఒక్క గంట పాటు పంపించండి సాలు. ఇంకే గొడవా వుండదు!" అంటూ తాపీగా లేచాడు.

ఒక్కసారిగా తల గిర్రున తిరిగి, కూర్చున్న కుర్చీతో బాటు తను అధఃపాతాళంలోకి జారిపోతున్నట్లు అనిపించింది సోమయాజులుకి.

"ఒక్క వారం టైం మీకు. లేకపోతే కేసు... పరువుపోడం... డబ్బు కర్చు... సూసుకోండి మరి! నేను సెప్పినట్టుగా సింపుల్‌గా పోయేలా సూసుకోడం మంచిది మీలాంటి మంచోల్లకి" అని, వంటింటి వైపు తిరిగి, "వొత్తా మేడం గారూ.. కలుద్దాం" అంటూ బయటకి తాపీగా నడుచుకుంటూ వెళ్తున్న దొరబాబుని శిలాప్రతిమలా బిగుసుకుపోయి, అదిరిపడుతున్న గుండెలతో, అలా చూస్తూనే ఉండిపోయాడు సోమయాజులు.

గత రెండు రోజులుగా ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా అడిగినా సమస్య ఏమిటో చెప్పకుండా... తనలో తనే కుమిలిపోతూ, పిచ్చివాడిలా తిరుగుతున్న భర్తని చూస్తూంటే .. అతనేమయిపోతాడోనన్న ఆందోళన, భయం అధికమై, ఈ రోజున సమస్య ఏమిటో చెప్పి తీరాలని, తనకి అతని పరిస్థితి చాలా ఆందోళన కలిగిస్తోందని, చెప్పకపోతే తన మీద ఒట్టనీ, తనకి ఆత్మహత్య ఒక్కటే శరణ్యమనీ... కళ్ళనీళ్ళు పెట్టుకుని ఏడుస్తూ భర్త చేతిని తన తల మీద ఉంచుకుని అడిగింది సర్వమంగళ. దాంతో తప్పని సరై... దొరబాబు చేసిన అభియోగం, బెదిరింపు, నీచమైన కోర్కెల గురించి చెప్పలేక చెప్పలేక చెప్పాడు సోమయాజులు.

ప్రాన్పడి పోయింది సర్వమంగళ. కళ్ళలో నీళ్ళు చిమ్మాయి. చేతుల్లో ముఖం దాచుకుని బావురుమన్నాడు సోమయాజులు. ఇద్దరూ రోదిస్తూ... శిలా ప్రతిమల్లా మాటలు లేకుండా అలా చాలాసేపే కూర్చుండి పోయారు.

కొంతసేపు గడిచాక, భర్త చేతి మీద తన చెయ్యి వేసి అంది సర్వమంగళ... వణుకుతున్న హీనస్వరంతో, "ఎవ్వరికీ ఎన్నడూ ఏ అపకారం తలపెట్టని వాళ్ళం. మనకి అన్యాయం జరగదు. మనం నమ్ముకున్న ఆ నటరాజు జరగనివ్వడు. మీరు ప్రశాంతంగా ఉండండి!"

ఒక్కసారిగా ఆక్రోశంగా అన్నాడు సోమయాజులు "నీకు తెలీదు మంగళా. వాడు ఓసారి ఆర్డరు వేసాడంటే అది జరిగి తీరాల్సిందేనట. లేకపోతే వాడి తాలూకు గూండాల చేతుల్లో మొత్తం ఫ్యామిలీ ప్రాణాలు పోవడం ఖాయమట. మన టైలర్ లతీఫ్ భార్య ఫాతిమా, మేష్టారి అమ్మాయి మేరీ, కార్పెంటర్ సీతాపతి చెల్లెలు వరలక్ష్మీ కూడా వీడిపాలిటపడ్డ అభాగినులేట. ఏం చెయ్యలేక, ఎవరికీ చెప్పుకోలేక వాళ్ళు నోళ్ళు నొక్కుకున్నారట. చివరకి డిసిపి అంతటివాడు సైతం వాడి వలలో చిక్కి, వాడు చేస్తున్న నేరాలన్నీ కాయడానికి అంగీకరించక తప్పలేదట. ఇంక మనమెంత?"

భర్తనే రెప్ప వేయకుండా చూస్తున్న సర్వమంగళ చెవుల్లో అతను చెప్పిన స్త్రీల పేర్లే మార్మోగుతున్నాయి. ఆ ముగ్గురు స్త్రీలూ తనకి పరిచయస్తులే. ఎంతో గౌరవంగా పరువుగా బ్రతుకుతున్నవాళ్ళు. వణుకుతున్న భర్త చేతిని గట్టిగా పట్టుకుంది సర్వమంగళ.

మరో నాల్రోజులు గడిచాయి. ఇంట్లో ఒంటరిగా వుంది సర్వమంగళ. భర్త పిచ్చివాడిలా ఎక్కడ తిరుగుతున్నాడో తెలియదు.

ఫోను మ్రోగింది. భర్త నుంచేమోనని ఆతృతగా రిసీవర్ అందుకుంది.

"నేనే మేడం గారూ. మీ ఆయన ఇంత సింపిల్ ప్రాబ్లంకే ఏటో తలకిందులైపోతూ పిచ్చోళ్లా తిరుగుతున్నాడు రోడ్ల మీద. మీరన్నా బుర్రుపయోగించి ఆలోసించండీ. ఈరోజే గడువుకి లాస్ట్‌డేటు మరి. అప్పుడే రేత్రి తొమ్మిదయ్యింది. ఈ రేత్రి గడిసిన్తర్వాత ఎవురుంటారో... ఎవురుండరో,.." బెదిరిస్తోంది దొరబాబు గొంతు... కొంచెం మత్తుగా, ముద్దగా కూడా వుంది.

వాడి మాటల్ని కట్ చేస్తూ ప్రశ్నించింది సర్వమంగళ "ఇప్పుడు ఏం చెయ్యాల్నేను?" నూతిలోంచి మాట్లాడినట్లు వచ్చింది పూడుకుపోతున్న గొంతులోంచి స్వరం.

దొరబాబు గొంతులో ఆనందం "అదీ తెలివైన పెస్నంటే!" అని, ఊరి చివర గెస్ట్‌హౌస్‌లో తను ఒంటరిగా వున్నానని, గుట్టు చప్పుడు కాకుండా ఆమె తన దగ్గరకు వచ్చేస్తే, ఈ చలి రాత్రిలో ఒక్క రెండు గంటల పాటు తనలోని 'చలి'ని ఆమె దగ్గర కాచుకుని, తిరిగి క్షేమగా ఇంటికి పంపించేస్తాననీ 'మర్యాదగా' మెత్తగా మత్తుగా పలికాడు దొరబాబు.

"వ–స్తు–న్నా" ఒత్తి పలుకుతూ అంది సర్వమంగళ దృఢ నిశ్చయంగా.

తలుపు తీసుకు వస్తున్న సర్వమంగళని చూస్తూనే సంభ్రమాశ్చర్య సహితంగా దొరబాబు ఒళ్లంతా ఆనందంతో విద్యుత్తు పాకినట్లయింది. తల మీదుగా కప్పుకున్న శాలువాని తొలిగించుకుంటూ, తల వంచుకుని, అడుగులో అడుగువేస్తూ, మందగమనంతో వస్తూన్న ఆమె వైపు ఆత్రంగా అడుగులు వేసి, "తేన్కూండి వొచ్చినందుకు. అలా మంచం మీద కూకోండి!" అన్నాడు అతిథి మర్యాద చూపిస్తూ.

చెయ్యి ముందుకు చాపి గుప్పిట తెరిచింది సర్వమంగళ. అందులో రెండు పెద్దపెద్ద కిళ్ళీలు వున్నాయి. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిపోయాడు దొరబాబు. "అయ్య బాబోయ్. ఏటో అనుకున్నాగానీ, మీరు గొప్ప రసికులండి బాబూ" అన్నాడు మెచ్చుకుంటూ.

"రెండూ మీకే. మా ఇళ్ళలో ఆడవాళ్ళం కిళ్ళీలు వేసుకోం!" గోముగా అంది సర్వమంగళ.

"సరే... అలాక్కానీండి. సరసం సేసేతప్పుడు కిళ్ళీలు మాంచి కిక్కిత్తాయి. అందులోనూ మీరు పెచ్చేకంగా సొయానా నాకోసం కట్టినవాయే!" అంటూ రెండు కిళ్ళీలనీ అందుకుని, ఒక్కసారే పశువు నమిలినట్లు పరపరా నమలసాగాడు దొరబాబు.

ఓ నిముషం ఆగి, వెనుతిరిగి వెళ్లి తలుపులు బార్లా తెరిచింది సర్వమంగళ. కిళ్ళీలు నములుతున్న దొరబాబు కొద్దిగా తూలుతూ తల తిరుగుతుండగా "తలుపులెందుకు తీసారూ? అదేటీ... మీరు నలుగురుగా అవుపడుతున్నారేటీ?" అన్నాడు గీరగా తమాషాగా నవ్వుతూ.

"అవుపడ్డం కాదు... నలుగురమే. కళ్ళు విప్పార్చుకు చూడు!" అరిచింది సర్వమంగళ.

"చా వూర్కోండి... పరాచికాలూ..." అంటూ కళ్ళు బాగా విప్పార్చుకు చూసాడు దొరబాబు. కళ్ళెదురుగా... సర్వమంగళతో బాటు... తన చేతుల్లో నలిగిపోయిన ఫాతిమా... మేరీ... వరలక్ష్మీ కూడా. నలుగురూ యుద్ధరంగలో ముందుకు సాగుతూన్న వీరసైనికుల్లా... బుసలు కొడ్తూ, మింగేసేలా చూస్తూ, ముందుకొస్తున్నారు.

తిన్న కిళ్ళీలలో మత్తు మందేదో వున్న కారణంగా తనకి విపరీతమయిన మైకం కమ్ముతోందని గ్రహించిన దొరబాబు తల విదుల్చుకుంటూ కోపంగా "ఏ...య్" అని పెడబొబ్బ పెట్టాడు. సర్వమంగళ దుర్గామాతలా ముందుకురికి, తన చేతిలోని శాలువాని మెలితిప్పి వాడి మెడ చుట్టూ వేసి, పొత్తికడుపులో బలంగా తన్ని, "నీ నీచ వికృత చలి తీర్చడానికి, చలి నెగళ్ళం వచ్చాంరా..." అంటూ, మత్తుతో తూలిపోతున్న వాడ్ని సునాయాసంగా గిరగిరా ఒప్పులకుప్ప తిప్పి కింద పడేసింది. నలుగురి చేతుల్లోనూ కొంగుల చాటున దాచుకు వచ్చిన పదును చాకులు పైకి లేచాయి.

అర్ధనారీశ్వరుడి ప్రళయతాండవం ప్రారంభమయ్యింది.

దొరబాబు కేకలు విని సాయమొచ్చే నాథుడెవ్వడూ లేడు ఆ చుట్టుప్రక్కల.

మర్నాడు భోగి పండుగ. దొరబాబు చావు వార్త చీకట్లోనే ఊరంతా విద్యుత్తులా పాకింది.

'రాత్రి దొరబాబు ఫుల్లుగా తాగి ఊరి చివర గెస్ట్‌హౌస్ దగ్గర పెంటల మీద పడి చచ్చిపోయాట్ట!'

భార్య చేసిన ఘనకార్యానికి సంబంధించిన రహస్యం తనకి తెలియక పోయినా... దొరబాబు చావు వార్త విని, పట్టరాని ఆనందంతో సోమయాజులు భారీ భోగిమంట వేసాడు.

ఆ దారినే వెళ్తూ ఆగి, మంటకి అటు వైపు నిలిచిన డిసిపి ... చేతులు జోడించి నిలువెత్తున లేచిన మంట మీదుగా సర్వమంగళ వైపు ఆరాధనగా చూస్తూ, 'పవర్ ఉండీ వాడి గూండాయిజంకి భయపడి, పిరికితనంతో నేను చేయలేకపోయిన పనిని, తెగించి, అత్యంత సాహసం చూపించి, భర్త చాటు సామాన్య ఇల్లాలివైన నువ్వు చేశావమ్మా. నీకు పాదాభివందనం. ఇక ఏ కేసూ లేకుండా ... ఈ చావుకి కారణం ... విపరీతంగా తాగి, ఊరి చివర పెంటల దగ్గర పడున్న ఆ దుర్మార్గుడ్ని కుక్కలూ, పందులూ పీక్కు తినడమేనని నిర్ధారణ చేసే బాధ్యతనయినా నేను తీసుకోకపోతే నా జన్మ ఎందుకమ్మా? ఆ ఏర్పాట్లు అన్నీ నేను చూసుకుంటున్నా' అని ధ్వని రహితంగా ఉచ్చరిస్తున్నాడు.

ఊరంతా భోగి మంటలు తాటి ఎత్తున లేచి, జ్వాలలు వివశంగా ఊగుతున్నాయి. ఆ మంటల వెలుతుర్లో ఆ ఊరి ఆడవాళ్ళ ముఖారవిందాలు జాజ్వల్యమానంగా వెలిగిపోతున్నాయి.

ఆ మంటలన్నింటిలోనూ వాళ్లకి నటరాజ ఆనందతాండవం కనిపిస్తోంది.

# ప్రతిబింబం

పి. రాజేంద్రప్రసాద్



✆ 9492525607

**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***మగాడి బట్టలు వేసుకుని తలవంచుకుని నించున్న ఆ అమ్మాయిని పరీక్షగా చూశాను. ముఖం సరిగా కన్పించనివ్వకుండా ఒక పక్కకు వంచుకున్నా పరిశీలనగా చూస్తుంటే నాలోని మగకళ్ళు ఆమె గుండెభాగంలో ఒక క్షణం ఆగాయి. మళ్లీ తేరుకుని నడుము దాకా వెళ్లగానే తను నా వైపు కరుగ్గా చూసిన చూపు, నన్ను ఈ లోకంలోకి తీసుకొచ్చింది. అంతటితో నాలోని మనిషి మేలుకున్నాడు. నాకు ఎందుకో ఆమె మీద జాలివేసింది.***

అమావాస్య చీకటి చిక్కగా కమ్ముకుని ఉంది. ప్రకృతి అంతా గాఢాంధకారం. పగటిపూట రెండుమైళ్ళ దూరమైనా అన్నీ కనిపించే ఆ తమిళనాడులోని పల్లెటూరి స్టేషన్ ప్లాటుఫారం మీద అటుచివరా, ఇటుచివరా నేమ్ బోర్డుల దగ్గర ఉన్న నాలుగు ట్యూబులైట్లు మాత్రం తమ వంతుగా చీకటితో పోరాడుతున్నాయి. ఆషాఢమేఘాలు ఆకాశమంతా కమ్ముకున్నందువల్ల చీకటైనా నక్షత్రాలు మాత్రం కనిపించడం లేదు. వర్షం వస్తుంది కాబోలు... విపరీతమైన ఉక్కబోతతో పాటు పుట్టుకొచ్చిన దీపపు పురుగులు, ఆ లైట్ల చుట్టూ తిరుగుతూ, ఉన్న కాస్త వెలుతుర్నీ తినేస్తున్నాయి. డ్యూటీలో ఉన్న పాపానికి నేనూ, నా అసిస్టెంటు పెరుమాళ్ళూ రూములో ఉండలేక బయటే కూర్చున్నాము.

సెల్ ఆన్ చేస్తే దీపం పురుగులు మా మీద పడటం ఖాయం. అందుకని మ్యూజిక్ మాత్రం ఆన్ చేసి వింటున్నాను. చీకటినీ, ఉక్కబోతనీ చీల్చుకుని భానుమతిగారి గొంతు వినిపిస్తోంది.

'ఖగరాజు నీయానతి విని వేగ చన లేడో......

గగనానికి ఇలకూ బహు దూరంబనినాడో...

జగమేలే పరమాత్మా! ఎవరితో మొరలిడుదు?

వగ జూపకు తాళను నన్నేలుకోరా త్యాగరాజనుత

నీ నగుమోము కనలేని నా జాలి తెలిసీ..........'

భానుమతిగారి గొంతులోని మార్దవానికి నేనే కాక, ప్రకృతీ పరవశించి ఇంతసేపూ ఎక్కడ దాక్కుందో చల్లని గాలి హాయిగా ఒంటిని తాకింది. అప్రయత్నంగా 'ఆహ్' అనుకున్నాను. చూస్తుండగానే మలయానిలం, ఝుంఝుమారుతంగా మారి బలంగా వీచసాగింది. దీపపు పురుగులు ఎప్పుడో కొట్టుకుపోయాయి. ఇక మేమూ కొట్టుకు పోతామనుకునేలోపు రూములో ఫోను మోగింది. వెళ్లి ట్రెయినుకి లైన్ క్లియర్ ఇచ్చి వచ్చాను. "పెరుమాళ్ళూ! సెవెన్ అప్‌కి లైన్ క్లియర్ ఇచ్చానయ్యా!" అన్నాను మా అసిస్టెంటుతో.

"కానియ్యండి సారూ, వచ్చేటప్పటికి పావుగంట పట్టిద్దిగా! ఇంగే కూర్చుందాంలే!" అన్నాడు తమిళ యాసతో పెరుమాళ్ళు.

మళ్లీ కుర్చీలో కూర్చున్నాను. వర్షం వస్తుందనుకుంటే గాలే ఆగేలా లేదు. హఠాత్తుగా కరెంటు పోయింది.

నీరవ నిశీథి భయం కలిగిస్తోంది. అజ్ఞానంలాగా దేన్నీ తెలియనివ్వదు. చీకటితో నిశ్శబ్దం తోడైనప్పుడు మరీ భయంకరంగా ఉంటుంది. స్టేషనుకీ రోడ్డుకీ మధ్య ఉండే చెట్ల సందుల్లో, ఎవరో ఇందాక వేసుకున్న చలిమంట కూడా ఈ గాలికి ఆరిపోయింది. వీళ్ళకప్పుడే చలికాలం వచ్చేసిందని నేనూ, మా పెరుమాళ్ళూ అప్పుడు నవ్వుకున్నాం. ఇప్పుడు ఈ గాలికీ, చీకటికీ వాళ్ళేమౌతారో అనిపించింది. ఉన్న కొద్ది వెలుతురూ పోయి ఒక్కసారి ఒళ్లు ఝల్లుమన్నా, ఇది మాకు అలవాటే కాబట్టి అలాగే ఫోనులో పాట వింటూ కూర్చున్నాను.



ఉన్నట్టుండి నా వెనుక నుండి ఎవరో వేగంగా పరిగెత్తినట్టు అనిపించింది. గతుక్కుమన్నాను. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆరుబయట మేమిద్దరం తప్ప వేరే ఎవరూ లేని చోట... ఎవరై ఉంటారు? దయ్యమా?

"పెరుమాళ్ళూ! నా వెనకనుండి ఎవరైనా పరిగెత్తడం గానీ చూశావా?" అని మా వాణ్ణడిగాను.

"ఏమో బాబూ! నేనటేపు సరీగ సూడలేదు గానీ, ఏదో సౌండైతే వచ్చిందండి!" అంటూ బదులిచ్చాడు.

"ఏమై ఉంటుందబ్బా! పోనీలే ఏదో ఒకటి. నా భ్రమేమో!" అనుకుని సరిపెట్టుకున్నాను. పది నిమిషాలు గడిచాయి. లైన్ క్లియర్ ఇచ్చిన ట్రెయిను పక్క స్టేషన్ వదిలిన సంకేతంగా బజర్ వినిపించింది. కుర్చీలోంచి లేచి లోపలికెళ్ళి, హేండ్ లాంపు వెలుతురులో ఆ ట్రెయినుకి సిగ్నల్స్ ఇచ్చి, ఆ టైముని పుస్తకంలో ఎంట్రీ చేయడానికి లైటు అటు తిప్పేటప్పటికి సిగ్నల్ పానెల్ వెనకనుండి ఏదో కదిలిన శబ్దం వినిపించింది. గుండె గతుక్కుమంది. ఇందాకటి శబ్దం గురించి పూర్తిగా మర్చిపోయాను. పానెల్ వెనకాల పాము దూరిందేమో అన్న ఊహ నా వెంట్రుకలు నిక్కబొడుచుకునేలా చేసింది. ఎంట్రీ వెయ్యకుండానే ఒక్క గెంతులో బయటఉన్న పెరుమాళ్ళు దగ్గరకు ఒగుర్చుకుంటూ వెళ్లి...

"పెరుమాళ్ళూ! పానెల్ వెనకాల పామున్నట్లుందయ్యా! ఏం చేద్దాం?" అన్నాను. నేననుకున్నట్టు అతని కళ్ళలో భయం కనిపించలేదు.

"సార్! మనలాంటి చిన్న స్టేషన్‌లో పాములు కాక సింహాలొస్తాయా? మీకు ఈ ఉద్యోగం కొత్త కాబట్టి ఇలాంటివి తెలీదు. ఏం భయపడకండి. కొద్దిసేపాగితే దానంతటదే వెళ్ళిపోతుంది. కరెంటు రానివ్వండి. ఒకవేళ అది పోకపోతే అప్పుడే ఏం చెయ్యాలో చూద్దాం." అన్నాడు ధీమాగా.

నాకు మాత్రం గుండెల్లో గాభరాగానే ఉండింది. మరి కొద్ది సేపట్లో కరెంటు వచ్చింది. పెరుమాళ్ళు ధైర్యం చెప్తుండగా నెమ్మదిగా స్టేషన్ రూములో అడుగు పెట్టాను.

“ఇదిగో! ఈ పానెల్ వెనకనుండే శబ్దం వినిపించింది” చిన్న గొంతులో పెరుమాళ్ళుతో అంటూ ఒక అడుగు పానెల్ వైపు వేశాను.

“అన్నా! రాకండి... ఇటుపక్కకి రాకండి...” అంటూ ఖంగారు ఖంగారుగా... భయం భయంగా గట్టిగా తమిళంలో ఒక ఆడగొంతు వినిపించింది. నేను గతుక్కుమన్నాను. అయినా మాట్లాడింది మనిషే, పైగా ఆడమనిషి కావడంతో ధైర్యంగా... “ఏయ్! ఎవరది! స్టేషన్ లోపలికి రావడమే కాకుండా మమ్మల్నే లోపలికి రావద్దంటావా?” నాకు వచ్చిన సగం సగం తమిళంలో గద్దించాను.

“బాబూ! ఏమనుకోవద్దు! నాకు ఒంటి మీద బట్టలు లేవు. అందుకే మిమ్మల్ని రావద్దన్నాను. మీ దగ్గరున్న బట్టలేమన్నా ఇస్తే బయటికి వచ్చి అంతా చెప్తాను. కోపగించుకోకండి బాబూ!” అంటూ బదులిచ్చింది పానెల్ వెనక ఉన్న అమ్మాయి.

ఇంకేం చేసేది? “సరే! అమ్మాయ్, ఆ పానెల్ వెనక స్టాండుకి నా పాంటు షర్టూ ఉన్నాయి. అవి వేసుకుని ముందు బయటికి రా. అక్కడ నాకు పనుంది” చిరాగ్గా అన్నాను.

కొద్దిసేపటికి ఆ అమ్మాయి నా పాంటూ షర్టూ వేసుకుని నెమ్మదిగా బయటకొచ్చింది. వయసు ఇరవై, ఇరవై ఐదు మధ్యలో ఉండొచ్చు. ఎర్రని ఎరుపు కాకపోయినా మనిషి అందమైనదే. ముఖానికి మందంగా పట్టించి, సగానికి పైగా చెరిగిపోయిన చవకరకం పౌడరు వాసన గుప్పుమంది. చూడగానే స్టేషనుకీ రోడ్డుకీ మధ్య ఉండే స్థలంలో ఆ వ్యాపారం చేసుకునే అమ్మాయేమో అనిపించింది కానీ ఈమె జుట్టు చెదిరిపోయి, చాలాసేపు ఏడ్చినట్టు, ఉబ్బిన ముఖం మీద కట్టిన కన్నీటి చారికలు చెప్తున్నాయి. బయటకు వచ్చి భయంతో ఒదిగి నించుంది. మగాడి బట్టలు వేసుకుని తలవంచుకుని నించున్న ఆ అమ్మాయిని పరీక్షగా చూశాను. ముఖం సరిగా కన్పించనివ్వకుండా ఒక పక్కకు వంచుకున్నా, పరిశీలనగా చూస్తుంటే నాలోని మగకళ్ళు ఆమె గుండెభాగంలో ఒక క్షణం ఆగాయి. మళ్లీ తేరుకుని నడుము దాకా వెళ్లగానే తను నా వైపు కరుగ్గా చూసిన చూపు, నన్ను ఈ లోకంలోకి తీసుకొచ్చింది. అంతటితో నాలోని మనిషి మేలుకున్నాడు. నాకు ఎందుకో ఆమె మీద జాలి వేసింది. ఇంటినుండి వచ్చిన బట్టలు విప్పి స్టాండుకి పెట్టి యూనిఫారం వేసుకుని ఉన్నాను కాబట్టి ఆ అమ్మాయికి నేను బట్టలు ఇవ్వగలిగాను. లేకపోతే? ఎలాగో అనిపించింది. భగవంతుడు ఎవరి పట్ల ఎవరికి ఏ భావం కలిగిస్తాడో, ఎందుకు కలిగిస్తాడో ఆయనకే తెలియాలి.

“ఏయ్! ఏంటే వేషాలు? స్టేషన్‌లో డబ్బులు కొట్టేయడానికి లోపలికొచ్చి దొరికిపోయి ఇలా నాటకాలాడుతున్నావా?” కర్కశంగా అన్నాడు పెరుమాళ్ళు.

అలా అనద్దన్నట్టు చూసింది ఆ అమ్మాయి. “అన్నా! అలా అనొద్దన్నా...పొట్ట కూటి గురించి, నేను ఆ పని చేస్తున్నాను, గానీ దొంగను కాదన్నా! సార్... మీరన్నా చెప్పండి. ఆ దొంగ చచ్చినోడు మరి అలా సెయ్యొచ్చా!” అంది కోపంగా.

“ఎవరు?” అన్నాను అప్రయత్నంగా.

“వాడే! నేను వందడిగానండి! సచ్చినోడు లేవన్నాడు. ఏభయ్యే ఉన్నయ్యన్నాడు. సరే అని ఒప్పుకున్నానయ్యా! తీరా చాటుకెళ్లాక ముందుగా డబ్బులు తియ్యమంటే వాడి పర్సులో పది వేల పైనే ఉన్నాయి సార్! నేను వందా ఇస్తేనే గాని కుదరదని మొండికేశాను. వాడు... వాడు...” దుఃఖంతో గొంతు రుద్ధమౌతుంటే పూర్తి చేసింది. నా చీర లాగేసి నిప్పంటించి తగలబెట్టి ‘అక్కడే చావు లం...!’ అని నన్నలా వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పట్నుంచీ చీకటిలో....” అంటూనే క్రింద కూర్చుండిపోయింది.

చివరి మాటలు ఏడుపు స్వరంతో ముక్కలు ముక్కలుగా వినిపించాయి. సిగ్గుతో, అవమానభారంతో ఆమె కళ్ళల్లోంచి ధారాపాతంగా నీళ్లు కారుతుంటే... హఠాత్తుగా తెలిసింది.

'అంటే అప్పటినుండి స్టేషనుకి వచ్చేవరకు సుమారు మూడు గంటల పాటు ఆ చీకటిలో, నగ్నంగా.....' నాలో నేనే అనుకున్నాననుకున్నాను. ఆ మాటలు పైకే వచ్చేశాయి. "వాడు... వాడు... ఎందుకలా చేశాడు?"

ఒక్కసారిగా తను తలెత్తి సూటిగా నా వైపు చూసింది. చీకట్లో ఆ ముఖంలోని భావాలు కనిపెట్టలేకపోయాను.... ఊహు... కాదేమో... ఆ భావాల్ని మనసారా ఒప్పుకోలేకపోయానేమో! అప్రయత్నంగా ఆ అమ్మాయిని వెళ్లిపోమన్నట్టుగా చేత్తోనే సంజ్ఞ చేశాను.

తను తడబడే అడగులతో రెండు మూడడుగులు నడిచి అక్కడనుండి పరుగందుకుని చీకటిలోకి కలిసిపోయేముందు... ఒక్కసారిగా వెనక్కి తిరిగి... "ఎందుకా... ఎందుకా? ఎందుకంటే... ఆడూ నీలాంటి మగ కుక్కేరా! అయితే నువ్వు కొంచెం మంచి కుక్కవి!" అరుస్తూనే చీకటిలో కలిసిపోయింది.

# బొమ్మ - బొరుసు

నామాని సుజనాదేవి

✆ 7799305575



**దీపావళి 2023 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***"యస్! ఇప్పటి వరకు అర్థంకానివి ఇప్పుడు అర్థం చేసుకునే మాట్లాడుతున్నా! నువ్వు ఒప్పుకుంటావో, ప్రతిఘటిస్తావో తెల్సుకోవడానికే ఇలా చేసాను. మా ఫ్రెండ్ చెబుతూనే ఉన్నాడు. అంతకు పూర్వం నీకు ఒక లవ్ అఫైర్ ఉందటగా! వాడు వాడుకుని వదిలేసి ఉంటాడు, అంతే కదా!" అంటుంటే భరించలేక చెంపపై ఒక్కటిచ్చింది పావని.***

"హేయ్ పావనీ ! మనకు వచ్చే కస్టమర్స్‌ను ఏవిధంగానైనా మనం ఇంప్రెస్ చేయగలగాలి. ఒకసారి మన షాప్‌లో సూట్ కొనడానికో, పాంట్ పీస్ షర్ట్‌పీస్ కొనడానికో రావాల, మళ్ళీ మళ్ళీ మన షాప్‌కే రావాల! అర్థమైందా?" షాప్ ఓనర్ కిషోర్ ఉరిమినట్లు అన్నాడు.

కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతుంటే తల ఊపింది పావని.

"అంతేగని... మల్ల మల్ల గిట్ల గాయన నా చెయ్యి పట్టుకున్నాడు. నా కళ్ళలకు సూసిండు. నాకు కన్ను కొట్టిండు, అని వస్తే ఇగ నీకు మా షాప్‌ల నౌకరీ ఉండదు. జాగ్రత్త! ఇగ పో! పోయి పని జూసుకో!" మరోసారి గట్టిగా హెచ్చరించాడు. తలూపుతూ అక్కడినుండి వచ్చేసింది.

అప్పటివరకు ఆపిన కన్నీళ్లు, గట్టు తెంచుకున్న వాగులా ఉబికి జలజలా చెంపలపై రాలాయి. తుడుచుకుంటూ నడిచింది.

"ఏంటే! పావనీ ఎందుకేడుస్తున్నావు?" వెళుతున్న పావని చేయి పట్టి ఆపి అడిగింది లలిత. ఆ మాత్రం సానుభూతికి ఇక ఆగలేనట్లు మళ్ళీ మత్తడొచ్చిన చెరువులయ్యాయి రెండు కళ్ళు.

ఇంకా తొమ్మిదే కావడంతో షాప్ తలుపులు పూర్తిగా తెరవక పోవడంతో కస్టమర్స్ లేరు.

ఎత్తుగా ఉన్న పాంటు, షర్ట్‌పీసుల గట్టాలు ఎత్తుగా, అడ్డుగా ఉండడంతో అటువైపు ఒకవేళ ఎవరైనా ఉన్నా, వారికి వీరు కనపడరు. అయినా లలిత ఎవరూ చూడకుండా చేయి పట్టి, పావనిని వాష్‌రూమ్ వైపు లాక్కెళ్ళింది. తలుపు పెట్టిన తర్వాత హత్తుకుని ఊరడించి విషయం అడిగింది.

"అక్కా! మొన్న ఒకడు కావాలని చెయ్యి తగిలించాడు. జాగ్రత్తపడుతూ అన్ని చూపించాను. కాని వాడు క్లాత్ పట్టుకుని చూస్తున్నట్లు నటిస్తూ చేయి పట్టుకున్నాడు. ఓనర్ ఎవరిది తప్పైనా నాదే అంటాడని తెలుసు కాబట్టి, ఓర్చుకుని, 'మీ పద్ధతి బాలేదు. మీరు కావాలని చేస్తున్నారు. ఓనర్‌కి చెబుతాను' అన్నాను.

వాడు సీరియస్ అయి, 'ఏం చెబుతావే! తిండికి లేని సేల్స్‌గర్ల్‌వి, నీకే ఇంత పొగరు ఉంటే నాకెంత ఉండాలి? నేనే చెబుతా చూడు!' అంటూ ఓనర్‌కి, 'నేను సరిగ్గా చూపించడం లేదంటూ' అబద్ధాలు చెప్పాడు. ఆయన నన్ను పిల్చి, నేను చెప్పేది

వినకుండా, వాడి ముందరే కడిగేసాడు. విజయగర్వంతో వాడి ముఖం వెలిగిపోయింది. ఈవేళ నేను అసలు విషయం చెబుతుంటే కూడా వినిపించుకోకుండా 'కస్టమర్ అంటే దేవుడు. ఎప్పుడైనా ఆయనదే కరెక్ట్' అంటూ, మరోసారి ఇలాంటి ఫిర్యాదులు వస్తే నన్ను తీసేస్తానన్నాడు. ఈ ఉద్యోగం రావడానికి నేను ఎంత కష్టపడ్డానో నీకు తెల్సుకదా అక్కా! నాన్న పోయాక ఇపుడు మా కుటుంబానికి నా జీతమే ఆధారం. రోజంతా నిలబడి కాళ్ళు లాగుతున్నా, నా అవసరం అలాంటిది కాబట్టి ఈ జాబ్ వదలడం లేదు. పీరియడ్స్ వస్తే ఇక నా బాధ చెప్పనలవి కాదు!"



"మనందరి బాధలు అవే! మింగమంటే కప్పకు, కక్కమంటే పాముకు కోపం వచ్చినట్లు, ఇంట్లో బాధలకు ఉద్యోగం చేయకుండా ఉండలేం. ఇక్కడి బాధలను ఎదిరించలేము. అసలు నువ్వు మగాళ్ళ సెక్షన్ డ్యూటీకి ఎందుకు వెళుతున్నావు?"

"నేను లేడీస్ సెక్షన్స్ చూస్తానని మొత్తుకున్నా, నేను వద్దన్నా ఆ మగవాళ్ళ బట్టల సెక్షన్‌లో వేసారు. పైగా నేను చెప్పింది నమ్మడం లేదు!"

"పిచ్చిదానా! నువ్వు అందంగా ఉన్నావని, నీ ద్వారా వచ్చిన కస్టమర్స్ మొహమాటపడైనా కొంటారని, కావాలనే వేసి ఉంటారు. నువ్వు చెప్పినదంతా నిజమని ఓనర్‌కి తెల్సు, అయినా వారు కస్టమర్ ఎప్పటికీ రైట్ అంటారు. ఇక ఊర్కో! నిజానికి మన ఆడవారిని అలా వేయకూడదని, ఆడవారి బాధలు చెప్పుకోవడానికి ప్రతీ చోట ప్రభుత్వం ఒక ఫోరం పెడుతుందట. కాని మన బతుకులు గింతే! మనం వారితో చెబితే మన ఉద్యోగాలు పోతాయ్. సరే! ఇప్పటికే చాలా సేపయిందని, షాప్‌కి రాగానే బాత్రూం ఏంటని అరుస్తాడు. పద!" అంటూ బయటకు తీసుకొచ్చింది లలిత.

"హలో! ఆ లైట్ క్రీం క్లాత్ చూపిస్తారా?" అన్న కంఠం విని, అటు తిరిగి, పరధ్యానంగా గట్టాలు చుడుతున్న పావని ఉలిక్కిపడి ఇటు తిరిగింది.

ఎదురుగా పచ్చని పసిమి ఛాయతో నూనూగు మీసాల అందమైన కుర్రాడు!

"ఆజాను బాహుం... అరవింద దళాయతాక్షం... అంటూ ఆడవారినే కాదు, మగవారిని సైతం మోహానికి గురి చేసే అద్భుతమైన సౌందర్యం శ్రీరామచంద్రునిది అంటూ రామాయణం గురించి చెబుతూ, చిన్నప్పటి నుండి నాన్న చెప్పింది గుర్తు వచ్చింది పావనికి.

"ఓకె సర్!" అంటూ తీసి చూపించింది. వెంట వచ్చిన ఫ్రెండ్, అతను కలసి దాదాపు అరగంట వరకు డిస్కస్ చేసుకుంటూ, రెండు డ్రెస్‌లు తీసుకున్నారు. అతని ఫ్రెండ్ ఎంగేజ్మెంట్‌కి అని వారి మాటల్లో తెలిసింది. వారు బిల్ పేచేసి వెళ్ళిపోయారు. 'అతన్ని ఒకసారి చూసిన వారు, మళ్ళీ చూడాలని తప్పక అనుకుంటారు...' అనుకుంటూ వారు పరిచిన క్లాత్‌లన్నీ మడత వేస్తున్న ఆమెకు వాటి మధ్య మెరుస్తున్న పర్స్ కనబడింది. ఆ షాప్ కెమెరాలు పెట్టేంత పెద్ద షాప్ కాదు. ఒక్క క్షణం అది తీసి చూసింది. ఆ పర్స్‌లో అమ్మా నాన్నలతో అతను దిగిన ఫోటో ఉంది. వెనక ఐ లవ్ యు అని రాసి ఉంది. లోపల కొన్ని

భావయుక్తమైన కవితలు రాసిన చిన్న పేపర్లు ఉన్నాయి. అవి అద్భుతంగా ఉన్నాయి. చిన్న కవర్ లోపల బంగారు గొలుసు, ఒక ఉంగరం ఉంది. అతను కంగారు పడతాడేమో? ఓనర్‌కి ఇద్దాం అని తీసుకెళ్ళి ఇచ్చింది. ఆ తర్వాత గంటకు సరిగ్గా అతను వచ్చి ఓనర్ దగ్గరకు వెళ్ళాడు. అందులో ఉన్న ఫోన్ నెంబర్‌కి ఓనర్ ఫోన్ చేసినట్లు ఉన్నాడు.

అతను అపురూపంగా దాన్ని అందుకుంటూ పావని ఉన్న సెక్షన్ వైపు చూసాడు. అటే చూస్తున్న పావని తల తిప్పుకుని పనిలో మునిగింది.

"హలో అండీ..." ఒక నిమిషంలో పిలిచిన పిలుపుకు తలెత్తింది. అతనే!

"థాంక్ యు సో మచ్ అండి!" అన్నాడు మధురంగా నవ్వుతూ.

"అయ్యో! నేనేం చేసానని... మీ పర్స్ మీకు ఇచ్చాను. అంతే కదా!" అంది పావని.

"లేదండి! థాంక్స్ అండీ! ఇందులో డబ్బులు మాత్రమే కాదు. మా ఫ్రెండ్ ఎంగేజ్ మెంట్ కని కొన్న రింగ్, చైన్ ఉన్నాయి. నేను రాసుకున్న విలువకట్టలేని నా ప్రాణం ఉంది. మీరు చాలా నిజాయితీగా నాకు చేర్చారు. థాంక్ యు సో మచ్! ఇదిగోండి మీరు ఏమీ అనుకోకపోతే ఈ డబ్బులు ఉంచుకోండి!" అంటూ పర్స్ నుండి డబ్బులు తీయబోయాడు.

"అంటే... మీరు దానికి వెల కడుతున్నారా? అంటే నేను మీకు ఎలా కనిపిస్తున్నాను. డబ్బులకు లేనిదాన్నేమో కాని, ఆత్మాభిమానంలో కాదు!" అంది పావని కొంచెం ఉక్రోషంగా.

"అయ్యయ్యో... ఐ యాం సారీ! అలా అని కాదు. అదేమీ కాదు! పోనీ ఈ విజిటింగ్ కార్డ్ తీసుకోండి. ఎప్పుడైనా ఏ అవసరం వచ్చినా అడగండి!" అంటూ ఇచ్చాడు.

అందులో 'భార్గవ్ భరద్వాజ్' సి.ఎ. అని రాసి ఉంది. తీసుకుంది!

తర్వాత ఏదో కస్టమర్ విషయంలో పావనిదే తప్పు అంటూ, ఓనరు అందరి ముందూ తిట్టడంతో, ఇక సహించలేని పావని ఎడాపెడా వాయించి, ఉద్యోగం మానేస్తున్నానంటూ ఓనర్ కన్నా తనే ముందే చెప్పేసి బయటకు వచ్చేసింది.

రోడ్డు మీద నడుస్తుందన్న మాటే గాని గమ్యం తెలియడం లేదు ఆమెకు. అలా వెళ్ళి గుడిలో కోనేటి గట్టు మీద కూర్చుంది.

"హలో! మీరేంటి ఇక్కడ?" అన్న పిలుపుకి తలెత్తింది. ఎదురుగా భరద్వాజ్.

తరచి తరచి అడిగిన మీదట, విషయం చెప్పింది. "ఓస్ అంతేనా!" అంటూ అప్పటికప్పుడే ఆమె క్వాలిఫికేషన్ తెల్సుకుని, తన దగ్గర క్లర్క్‌గా చేరమన్నాడు. ఆ రకంగా అతని ఆఫీస్‌లో క్లర్క్‌గా చేరి, అతనితో పాటు దాదాపు పి ఏ గా, అన్ని పనుల్లో మమేకం అయిపోయింది. ఇంటికి తీసుకెళ్ళి ఇంట్లో వారిని కూడా పరిచయం చేసాడు. అలా వారిద్దరి మధ్య పెరిగిన సాన్నిహిత్యం ప్రేమకు దారి తీసింది.

ఆ రోజు ఒక కాన్ఫరెన్స్‌కి వెళ్ళి చాలా ఆలస్యం కావడంతో తప్పనిసరై, అక్కడే హోటల్లో ఉండిపోవాల్సి వచ్చింది ఇద్దరికీ. హోటల్లో ఒకే రూమ్ ఖాళీగా ఉండడం వల్ల, ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ వల్ల కాదనలేక, రెండు సింగిల్ బెడ్‌లు ఉన్న రూమ్‌లో ఉండిపోయింది.

కబుర్లు చెప్పుకుని పడుకున్న తర్వాత, మధ్యరాత్రి తన పక్కకు చేరిన అతన్ని చూసి ఉలిక్కిపడింది. పెళ్ళయ్యే వరకు దూరం అంటూ తోసి బెడ్‌పై నుండి కిందకు దిగింది.

కోరికతో ఉన్నపుడు మగాడు రాక్షసుడు అవుతాడు అన్నట్లు, "అంటే నాపై నీకు నమ్మకం లేదా?" అంటూ రెట్టించాడు భరద్వాజ్.

"సారీ అండీ... మీమీద నమ్మకం లేక కాదు. కాని పెళ్ళికి ముందు ఇలాంటివి నాకు ఇష్టం లేదు. ఏదయినా పెళ్ళయ్యాకే!" అంటూ సున్నితంగా తోసిపుచ్చింది.

మాటా మాటా పెరిగింది. కాదన్నందుకు కోపంగా వెళ్ళిపోయాడు ఆ గది నుండి. ఆ రాత్రి ఇద్దరికీ జాగరణమైంది. ఇక ఆ తెల్లవారి ఆమెను మూడు నెలల జీతంతో తీసేస్తున్నట్లు పంపిన పత్రం చూసి ఆశ్చర్యపోయింది పావని.

వెళ్ళి, అడిగిన ఆమెకు... "సమస్యల్లో ఉన్న నీకు ఆధారం చూపించాను. నీ మంచి మనసు నచ్చి ప్రేమించాను! నాకన్నా ఎక్కువగా నిన్ను నమ్మాను. నేనే నువ్వు అనుకున్నాను కాని నువ్వు అదంతా తప్పు అని, నా మీద నీ ప్రేమంతా నటన అని నిరూపించావు. జీవితాంతం తోడుగా ఉండాలనుకున్న నా నమ్మకానికి పడిన దెబ్బ ఇది. ఐ డోంట్ వాంట్ యు టు సీ యు ఇన్ మై లైఫ్ అగైన్... కైండ్‌లీ లీవ్ మీ అలోన్!" గెటౌట్ అని చెప్పకనే చెబుతున్న అతని మాటలు విని నిశ్చేష్ట అయింది పావని.

ఏ అమ్మాయి అయినా, ఏ మహిళ అయినా ఎంతో పవిత్రంగా, ప్రాణం కన్నా మిన్నగా భావించే శీలాన్ని రక్షించుకోవడానికి తను చేసిన ప్రయత్నంలో ఏ తప్పు ఉందో అర్థం కాలేదామెకు. కాని భవిష్యత్ మాత్రం పెనుభూతంమై చుట్టుముట్టింది .

అతికష్టం మీద మరో రెండు నెలలకి తను పనిచేసిన అనుభవంతో చిన్న ప్రైవేట్ కంపెనీలో జాబ్ సంపాదించుకోగలిగింది. ఈలోగా కూడ బెట్టిన డబ్బుతో చెల్లెలి పెళ్ళి చేసింది. తమ్ముడిని ఇంజనీరింగ్‌లో జాయిన్ చేసింది. తల్లితో యాంత్రికంగా జీవితం మొదలు పెట్టింది.

★★★

రెండేళ్ళు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇరుగుపొరుగు, చుట్టాలు అందరూ ఇక ఆమెకు పెళ్ళి కాదన్న విషయం గురించి చెవులు కొరుక్కోవడం మొదలుపెట్టారు.

ఆరోజు కూతుర్ని పిలిచిన పావని వాళ్ళ అమ్మ కాత్యాయని, "తల్లీ, నువ్వు నా కడుపున పుట్టడం నా అదృష్టం అనుకోవాలో, నీ దురదృష్టం అనుకోవాలో తెలియడం లేదు! నువ్వు ఇంటి బాధ్యతలన్నీ తలపైకి ఎత్తుకుని అన్నీ నెరవేరుస్తున్నావు కానీ, నీ గురించి కూడా చూసుకోవాలి కదా! ఇప్పటికే నీ సంపాదనపై కూర్చుని తింటున్నందుకు సిగ్గుగా అనిపిస్తోంది. ఇప్పుడు కేవలం మా ఇద్దరికీ అంటే ఏదో పని చేసుకుని బతుకుతాం. ఇప్పటికే నీ పెళ్ళి చాలా ఆలస్యం అయ్యింది. ఇంకా ఆలస్యం చేయవద్దు! మనకు తెలిసిన బంధువులాయన నిన్న ఒక సంబంధం తెచ్చాడు. నీ విషయం ముందే చెప్పాను కాబట్టి, వాళ్ళు ఈరోజు నిన్ను చూడడానికి వస్తామన్నారు. నీ ఒక్క బాధ్యతా అయిపోతే ఇక నాకు బాధ ఉండదు. ఆలస్యంగా పెళ్ళి అయితే పిల్లలు కావడం చాలా సమస్య అవుతుంది. కాబట్టి నా మాట విను!" అంది.

సబబే అనిపించడంతో, ఆ రోజు లీవ్ పెట్టి ఉండిపోయింది. పది దాటాక వచ్చారు వాళ్ళు. అబ్బాయి పేరు మనోజ్. చిన్న చిన్న ప్రశ్నలు అయ్యాక, పెళ్ళి తను చేసుకోకుండా చిన్నవాళ్లకు ఎందుకు చేసారంటూ అడిగారు. బాధ్యతల కోసం పెళ్లి చేసుకోకుండా ఆగిన విషయం కాత్యాయని ద్వారా తెలుసుకుని చాలా సంతోషించి, వెంటనే వారి అంగీకారం తెలియజేసారు.

ఇంతకు పూర్వము జరిగిన ప్రేమ గురించి తెలియజేయాలని నోటి చివర వరకూ వచ్చినా, 'అందరూ ఒకేలా ఉండరు, పైగా అంతగా పరిచయం లేని మనస్తత్వం... పైగా అది ఏ అనుమానానికి దారితీస్తుందో'నని, భయపడి ఊరుకుంది.

మరో రెండు నెలల్లో ముహూర్తాలు పెట్టారు. మనోజ్ అతనితో షాపింగ్‌లకు, షికార్లకు తీసుకెళుతున్నాడు. ఒకరోజు అతని క్లోజ్ ఫ్రెండ్ పెళ్ళికి పట్నం వెళ్ళి, తెల్లవారి మూడు గంటలకు పెళ్లి కావడంతో, వీరికి బసకు ఇచ్చిన గదిలో ఇద్దరూ ఉండాల్సి వచ్చింది.

ఇంతకు పూర్వం ఉన్న అనుభవంతో వణికిపోయింది పావని. నిద్రపోకుండా పన్నెండు వరకూ ముచ్చట్లతో గడిపినా, అనుకోకుండా బెడ్ పైన కూర్చున్న ఆమె పైగా వంగి నీళ్ళ బాటిల్ అందుకుంటూ ఆమెను హత్తుకున్నాడు. అనుకోని ఈ సంఘటనకు బిత్తరపోయినా అంతకు పూర్వపు అనుభవంతో కొంచెంసేపుండి విడివడింది. కాని ఇంకా హత్తుకుని తమకంతో పెనవేసాడు. ఇంతకు పూర్వంలా, భయంతో గట్టిగా తోసేయలేకపోయింది.

"వద్దండీ!" అని మాత్రం గొణిగింది.

"అదేమిటి! మనిద్దరం పెళ్ళి చేసుకోబోతున్నాం కదా... బెరుకు ఎందుకు?" అంటూ ఆక్రమించుకుంటుంటే ఏమీ అనలేక ఊరకుండిపోయింది. అయితే రెండు నిమిషాలు ఏ ప్రతిఘటన లేకపోగానే లేచాడు మనోజ్.

"ఇది నీకు ఎన్నోసారి?" అంటూ అడిగాడు.

అర్థం కాలేదు ఆమెకు. "ఏమిటి మీరు అనేది?" అంది.

"ఇంతవరకు పెళ్ళి కాలేదు అంటే నిజంగానే బాధ్యతల బరువనుకున్నాను కాని, నీ కారెక్టర్‌లో తేడా అనుకోలేక పోయాను! లేకుంటే ఎంత కాబోయే దంపతులమైతే మాత్రం, పెళ్ళికి ముందే నువ్వు ఇలా అన్నింటికీ ఒప్పుకుంటావా? నేను నిన్ను ఎంతో ఉన్నతంగా ఊహించుకున్నాను, కాని ఇలాంటి చీప్ క్యారెక్టర్ అనుకోలేదు. అసలు వర్జిన్ టెస్ట్ చేయించాల్సింది!"

"అసలు మీరేం మాట్లాడుతున్నారో అర్థం అవుతుందా?" బిత్తరపోయిన పావని తేరుకుని అంది.

"యస్! ఇప్పటి వరకు అర్థంకానివి ఇప్పుడు అర్థం చేసుకునే మాట్లాడుతున్నా! నువ్వు ఒప్పుకుంటావో, ప్రతిఘటిస్తావో తెల్సుకోవడానికే ఇలా చేసాను. మా ఫ్రెండ్ చెబుతూనే ఉన్నాడు. అంతకు పూర్వం నీకు ఒక లవ్ అఫైర్ ఉందటగా! వాడు వాడుకుని వదిలేసి ఉంటాడు... అంతే కదా!" అంటుంటే భరించలేక చెంపపై ఒక్కటిచ్చింది పావని.

"యూ బిచ్! విచ్చలవిడిగా తిరిగిందే కాక, విషయం నాకు తెలిసేసరికి నన్నే కొడతావా? నేను నిన్ను పెళ్ళి చేసుకోను. నీకీ జన్మలో పెళ్లి కాదు!" అవమానంతో ఊగిపోతూ అన్నాడు.

'రాస్కెల్! నువ్వేంటిరా చేసుకునేది? నువ్వు చేసుకుంటానన్నా నేనే నిన్ను చేసుకోను. దానికన్నా ఆజన్మాంతం ఇలాగే ఉండిపోతాను. నీలాంటి అనుమానపు రోగ్‌తో పెళ్ళికి నేనే ఒప్పుకోను. అంటే నువ్వు ప్లాన్ ప్రకారం ఇదంతా చేశావన్నమాట! పెళ్ళికి ముందే నీ క్యారెక్టర్ బయటపడినందుకు, ఆ దేవుడికి నేనే ఋణపడి ఉంటాను. నేను వర్జిన్ టెస్ట్ చేయించుకుని నిరూపించుకుంటా, కాని నువ్వు బ్రహ్మచారివని నిరూపించుకుంటావా? నీలాంటి రోగ్ బారిన మరే ఆడపిల్ల పడకుండా నేనే ఇప్పటి నుండి ఈ ఉద్యమం లేవదీస్తాను! గుడ్ బై ఫర్ ఎవర్!" అంటూ బయటకు నడిచింది పావని. కొత్త శకానికి నాంది పలుకుతున్నట్లు వేగుచుక్క పొడిచింది.

# మాంగల్యం

భాగవతుల భారతి



✆ 8121712950

**దీపావళి 2022 కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

*ఇంత చిన్నవిషయానికే... బాబోయ్! మీ ఆడాళ్ళకి పొగరు ఎక్కువై... "*
*వాక్ప్రవాహానికి అడ్డం పడి, మంగళసూత్రం వైపు చూపించా!*
*"నేను ఇప్పుడు పక్కింటిదాన్ని! ఆవిడని ఇలాగే తిడతారా? తిట్టిరండి... పనిమనిషినే తిట్టలేం! "*
*అని, నా పనిలో నిమగ్నమైపోయా!*

తలతిప్పి గోడవైపు చూసాను!

అదిగో ఆ ఒంకెన గొలుసుతో సహా వేళ్ళాడుతూ కనబడింది మంగళసూత్రం! అది ఆ ఒంకెన చేరి ఆరునెలలయింది. ఆ మాంగల్యం తిరిగి నా మెళ్ళో చేరటానికి ఇంకా ఆరునెలల టైం ఉంది. నా మెడకి చేరుతుందో? చేరదో? నిట్టూర్చాను. ఆలోచనల ముడులు విప్పాను.

★★★

ఈ ఇంట్లోనే అత్తయ్యగారి అత్తగారు, అంటే నాకు అమ్మమ్మ వరుస! అప్పట్లో ఆడవాళ్ళకి బాలసారెలో మాత్రమే పేరు. ఇక ఆ తర్వాత 'ఒసేవ్! ఏమే!' అంతే కాబట్టి పేరు నాకూ తెలీదు. మాకు మాత్రం బుల్లమ్మమ్మ. పురుషాధిక్యత పరాకాష్టలో ఉన్న కాలం అది. భర్త కర్కోటకుడు!

"అమ్మాయ్! బుల్లెమ్మా! భర్తకు ఎదురాడకు. చెప్పినట్లు నడుచుకో! పతియే ప్రత్యక్షదైవం" అని అత్తారింటికి పంపారట, పదునాలుగేండ్ల వయసులో... వెళ్ళింది కసాయి దగ్గరకి గొఱ్ఱెపిల్లలా!

"ఏమేవ్! ఒసేవ్! మీ నాన్న ఎకరం పొలం నీ పేరు మీద కట్నంగా ఇచ్చాడు. అది నా పేరున రాయకపోతే కిరసనాయిలు పోసి తగలబెడతా! దస్తావేజుల కోసం వెడుతున్నా... వచ్చేసరికి వేలిముద్ర వేయాలి!" తప్పతాగి తూలుకుంటూ వెళ్ళిపోయిన భర్తవంక... ఏంజరుగుతోందో కూడా తెలీక నిలబడి చూస్తోందిట, ఇంకా పసితనమే వీడని బుల్లెమ్మమ్మ.

పక్కింటివారు వచ్చి "ఏంటమ్మా! కొద్ది రోజుల నుండీ చూస్తున్నాం... చెప్పమ్మా! ఏదన్నా సమస్యా?" అని అడిగితే, వెక్కిళ్ళ మధ్య, "ఆయన తప్ప తాగి వస్తున్నారండీ. పైగా టేబుల్ మీద చేతులు పెట్టమంటారు. పెడితే రూళ్ళకఱ్ఱతో వేళ్ళమీద కొడుతున్నారండీ. మొన్నరాత్రి ఎవరో పరాయి మగాడిని తెచ్చి, తనకి ప్రమోషన్ కావాలని వాడి పక్కలో... నేను ఎదురుతిరిగానని... వాణ్ణి పంపేసి ఇదిగో ఇలా రూళ్ళకఱ్ఱతో కొట్టారండీ. మంట పుడుతోందండీ! రాత్రి ఎవరో ఆడవాళ్ళను తీసుకువచ్చి స్నేహితులని చెప్పి, నా చేత సేవలు చేయించారు. నవ్వులే నవ్వులు... భయంగా ఉందండీ. ఇప్పుడేమో..." వెక్కిళ్ళ మధ్యన ఆపేసిందిట.

"విన్నాం తల్లీ! భయపడకు! మీ ఆయన వచ్చేలోపు నిన్ను మీ ఇంటికి పంపేస్తా పదమ్మా!" అంటూ వాళ్ళే సందు గొందీ తిప్పుతూ భర్త కంట పడనీయకుండా బస్సు ఎక్కించేస్తే, పుట్టింటికి చేరిందిట. అప్పట్లో ఆ ఊరికి అదొక్కటే బస్సు. తాగి తాగి ఆరునెలలకు భర్త పోయాడనే కబురుతో, కడుపులో బిడ్డతో పదిహేనేళ్ళకే వైధవ్యం పేరుతో, మూలన కూర్చున్న అలాంటి బుల్లెమ్మమ్మలు ఎంతమందో అప్పట్లో!

★★★

అత్తగారి తరం వచ్చింది. ఇదే ఇల్లు... అదే పురుషాహంకారం. కొంత నయం... పేరుతో 'శేషూ!' అని పిలిచేవారు. కానీ అదే హింస!

కోడలుగా నేను అడుగుపెట్టా. కోడల్నే కాదు, మేనకోడల్ని కూడా! కాబట్టి అన్నీ చిన్నప్పటినుండీ చూసినదాన్నే. బుల్లెమ్మమ్మని కూడా.

"ఏమండీ! ఏం టిఫిన్ చేయమంటారూ? ఏం కూర వండమంటారూ?" అత్తయ్యగారి ప్రశ్న.

"ఏదో ఓటి చేయ్!" మామయ్య జవాబు.

'అబ్బ... వినసొంపుగా ఉందే!' అనుకుంటే పొరపాటే.

"ఇదేమిటీ? ఈ టిఫెన్ తగలెట్టావ్?"

"మీరే కదండీ! మిమ్మల్నడిగే చేసాగా!"

"నోర్మూయ్! ఈ కూడు కుక్కలుకూడా తినవు!" గిరాటువేస్తే గోడకుతగిలి ప్లేటు మూడు వంకర్లు తిరిగేది.



"అన్నానికి రండి!"

"ఛీఛీ! దీన్ని తిండి అంటారా? ఇదిగో దీన్ని కూరంటారా? ఇట్లా తగలడిందేం? వేలకువేలు సంపాదిస్తున్నా మగాడికి విలువేదీ? తెచ్చిన సంపాదనంతా తెగతినేసీ మీఆడాళ్ళు బలిసిపోతున్నారే! బయటికి వెళ్ళగొడితే... అప్పుడు తెలుస్తుంది. దవడ వాయగొట్టాలే! పళ్ళురాల గొట్టాలే!"

"ఏమే! రావే కాళ్ళకు నూనె రాయి! ఏమే... కాళ్ళుకడుక్కున్నా, తడిగా ఉన్నాయి. తుండుగుడ్డతో తుడవవే!" ఇలా లేచినప్పటినుండి పడుకునే దాకా... చెప్పలేని గృహహింసలు. ఇలాంటివెన్నో!

ఆఫీస్‌లో పనిచేసే ఆడమగ అందరూ, మామయ్యకోసం ఇంటికి వచ్చేవారు.

"ఏమే! అది చేయవే! ఇది చేయవే!" పురమాయిపులు.

"ఏమండీ! శేషారత్నంగారూ! రావుగారు అద్భుతమైన వ్యక్తి అండీ! ఇలాంటి భర్త దొరకాలంటే పెట్టిపుట్టాలండీ, మాతో ఎంత సరదాగా ఉంటారనీ! మీరు చాలా అదృష్టవంతులండీ!" వచ్చిన ఆడవారి కితాబు. అంటే వాళ్ళ మొగుళ్ళు కూడా ఇంట్లో ఇలాగే ప్రవర్తిస్తారన్నమాట! ఈయన ఇకిలించుకుంటూ మాట్లాడేటప్పటికి ఆనందపడిపోతున్నారు. మరి ఈయన ఇంట్లో ఎలా ఉంటాడో వాళ్ళకెందుకూ?

కళ్ళు ఒత్తుకుంటూ, "అత్తయ్యగారూ! ఏమిటి ఇదంతా?" అంటూ నేను.

అత్తయ్య , నేనూ మంచి స్నేహితుల్లా ఉంటాం.

"కాత్యాయనీ! మీ మామగారెప్పుడూ ఇంతేనమ్మా! నన్నెప్పుడూ మనిషిలా చూళ్ళేదు. ఇదేం చూసావ్? పిల్లల చిన్నప్పుడు మీ మామగారు ఏదో ఊరెళ్ళారు. మీ ఆయన, నీ ఆడబిడ్డలూ, 'అమ్మా, నువ్వెప్పుడూ ఇల్లువదిలి బయటికి రావు, నాన్న ఊరెళ్ళారు. అందరం కలిసి సినిమాకెడదాం' అని బలవంతం చేసారు. సరే అన్నా. తాళంచెవి పక్కింట్లో ఇచ్చాం. 'ఆరాధన' సినిమా. మేం సినిమానుండి ఇంటికి వచ్చేసరికి ఈయన ఇంటి దగ్గర ఉన్నారు. ఆవేళ జరిగిన రాద్ధాంతం ఇప్పటికీ నీ ఆడబిడ్డలు గుర్తుచేస్తూ ఉంటారు. నన్ను బయట నిలబెట్టేసారు. వెళ్ళిపొమ్మన్నారు. లేదా తనే వెళ్ళిపోతానని ప్యాంటు, చొక్కా వేసుకున్నారు. పిల్లలు వాళ్ళ నాన్న కాళ్ళు పట్టుకుని, "నాన్నా! అమ్మ తప్పేంలేదు నాన్నా! మేము రమ్మంటేనే వచ్చింది." అని ఏడిచి శోకాలుపెడితే ఎప్పటికో శాంతించారు. అప్పటి రోజులూ... అప్పటి మగవాళ్ళూ, ఏమిటోలే! ఇంకా ఈ రోజుల్లో మీ మొగుళ్ళు చాలా నయం! అప్పటి మగాళ్ళైతే, ఇప్పటి మీరు అసలు కాపరాలే చేయలేరు. కోపం వస్తే అదిగో గ్లాసులూ, చెంబులూ విసిరేయటం, అకారణ కోపాలూ, బ్రతిమలాడటాలూ... అంతే!" అత్తయ్యగారి నిట్టూర్పుల మధ్య--- నాన్న తిట్లకి అమ్మ దొంగచాటుగా కళ్ళు తుడుచుకోవటమూ గుర్తుకు వచ్చింది నాకు.

కనుచెమరింతల మధ్య నాదో ప్రశ్న. "మామయ్య బయటి ఆడవాళ్లతో, జనంతోఎంతో చక్కగా ఉన్నారుగా అత్తయ్యా?"

"వాళ్ళంతా బయటివాళ్ళు! కాసేపు ఉండిపోయేవాళ్ళు! వాళ్ళకేం తెలుస్తుంది?" అత్తయ్య అతికీ అతకని జవాబు.

నేను సరదాగా "అత్తయ్యా! తాలిబన్ల శిక్షణ నిమిత్తం శిక్షణాశిబిరాలకు వాళ్ళ కమాండర్లకు బదులుగా, మన మధ్యతరగతి కుటుంబాలలోని మగవాళ్ళను నియమించాలి! రక్తపాతం చిందించకుండా, శత్రువులను ఎన్ని హింసలు పెట్టవచ్చో వీళ్ళు బాగా శిక్షణ ఇస్తారు. వీళ్ళ హింస భరించలేక ఎక్కడెక్కడ బాంబులు పెట్టారో, ఎన్ని విద్రోహచర్యలు చేసారో, ఉగ్గుపాల దగ్గరనుండీ చేసిన నేరాలన్నిటినీ దెబ్బకు చెప్పేస్తారు!" అనేదాన్ని. అత్తయ్యనవ్వేది. జాయింట్ ఫామిలీ కాబట్టి, ఈయనా ఒక్కరే కొడుకు కాబట్టి, ఊళ్ళో ఉద్యోగం కాబట్టి, ఇదే ఇంట్లో ఇవన్నీ చూస్తూ భరిస్తూ, ఆమె వేదనలో నేనూ పాలుపంచుకుంటూ, మామయ్యగారికి చెప్పలేక, ఎదిరించలేక, ఈయనకు చెప్పినా పట్టించుకోక... ఇన్ని సంవత్సరాలూ గడిపేసాం.

మామయ్యగారు పోయారు.

ఓ ఏడాది బానే జరిగింది. అప్పటివరకూ తండ్రి చాటున పెరిగిన సింహకిశోరం... (అదే మావారు) అసలు స్వరూపంతో పంజా విప్పింది.

"ఉద్యోగం ఎందుకు నీకు? ఇంటి పనీ, బయటిపనీతో అలిసిపోటానికీ!" సన్నాయి శృతి చేసారు.

సరే ఓకే! మానేసా.

"ఇదేమిటీ ఈ గ్లాసు తోమాలని తెలీదా? ఈ పళ్ళెం అలాగేనా కడిగేదీ? అన్నం వండటమే రాదు నీకు. మా అమ్మ దగ్గర నేర్చుకో! టమాటా పచ్చడి మా అక్కనడిగి తెలుసుకో! అయినా మొగుణ్ణి ఎలా గౌరవించాలో, ఎలా చూసుకోవాలో, మీ చెల్లి దగ్గర నేర్చుకోవాలి నువ్వు. పక్కింటావిడా చూడు... మొగుడితో చక్కగా ఎంత మృదువుగా మాట్లాడుతుందో! మా ఆఫీసులో సుగుణ మొన్న బిర్యానీ చేసుకొచ్చిందీ! అబ్బ... భలే ఉంది నువ్వూ చేస్తావ్ ఎందుకూ!"

ఆ మొగుళ్ళు కూడా వాళ్ళ పెళ్ళాలతో ఇలాగే సంభాషిస్తారని నాకు తెలుసు.

"ఏమైనా మీ వాళ్ళు నిన్ను సరిగా పెంచలా! నువ్వు వేస్ట్! నా ఖర్మ కొద్దీ దొరికావు!"

నాకర్థమైపోతోంది. ఇంకో తరం ఆడది కన్నీళ్ళు తుడుచుకోటానికి చీరకొంగు రెడీ చేసుకోవాలని.

అయినా బుల్లమ్మమ్మ భర్త, అంత వ్యసనపరుడూ... ఆడవాళ్లను గౌరవించాడు. భార్యను వాకిట్లో నిలబెట్టిన మామగారూ... ఆడవాళ్లను మన్నించాడు కోడలినైన నాతో సహా!

మరి ఈయన? ఆడవాళ్ళందరూ నచ్చుతున్నారు, నేను తప్ప. లోపం ఎక్కడుందీ? మగాళ్ళంతా సంస్కారవంతులే మరి? ఆడవాళ్లందరూ కుటుంబాలకు అంకితమైన వారేగా? లోపం ఎక్కడుందీ?

మంగళసూత్రంలోనా?

భార్య అంటే అంత లోకువా? ఆలోచనలతో బుఱ్ఱ వేడెక్కింది.

నేను సమాజాన్ని ఉద్ధరించక్కర్లా. నా పరిస్థితికి పరిష్కారం ఆలోచిస్తున్నా. నా మార్గం మార్గదర్శకమైనా కాకున్నా... ఏంచేయాలో, ఆ రోజే నిండు కాఫీగ్లాసు నట్టింట్లో భళ్ళున చప్పుడుచేస్తూ చెప్పింది నాతో... ఉదయాన్నే కాఫీ చేతికిచ్చా!

"ఛీ ఇది కాఫీనా? ఇన్నాళ్ళనుండీ కాఫీ ఇస్తున్నావ్, మొగుడికి ఎలా చేస్తే నచ్చుతుందో తెలిస్చావదా? అసలు నీలో ఆడలక్షణాలుంటేగా తెలిసేదీ? అదిగో మీ మరదలు ఎంత చక్కటి కాఫీ పెడుతుందో... ఫోన్ చేసి చెబుతానుండు నీకు నేర్పమనీ..." అంటూ చేతిలోని కాఫీగ్లాసు గిరాటుకొడితే అది క్రిందపడి గిరగిరా తిరిగింది. ఇల్లంతా ఛండాలం. నాలో ఈగో దెబ్బతిన్నది.

అంటే ఇప్పుడు నేను 'అయ్యో! సారీ అండీ! కాఫీ బాలేదా? మళ్ళీ తెస్తా' అంటూ పరుగెత్తుతూ కాఫీ ఇచ్చి, కన్నీళ్ళు పెట్టుకుంటూ ఇదంతా తుడిచీ శుభ్రం చేయాలా?

నో... చివ్వున తలెత్తి ఓ క్షణం చూసా!

మెళ్ళో ఉన్న మంగళసూత్రం గొలుసు మెడలోంచి తీసి, చేత్తో పొడవుగా పట్టుకుని చూపించా!

అత్తయ్యగారు అవాక్కై "అయ్యో! అయ్యో! ఇదెక్కడి పోయేకాలం?" అంటూ ముందుకు రాబోయారు.

ఆ క్షణంలో ఆవిడవంక నే చూసిన చూపులో తరతరాల స్త్రీజాతి కోటి ప్రశ్నలూ, జవాబులూ కనిపించాయేమో! గదిలోకి వెళ్ళిపోయారు.

"ఇదిగోండీ! ఏడ్వటాలూ, మొత్తకోటాలూ. పిల్లలతో పుట్టింటికిపోయి వాళ్ళనెత్తిన ఎక్కటాలూ, సంధులూ, రాయబారాలూ,

నచ్చచెప్పటాలూ, బుజ్జగింపులు, నాకు చిరాకు! ఈ మాంగల్యం ఈ గోడకు తగిలిస్తున్నా! ఇవాల్టి నుండీ, నేను మీ ఫ్రెండ్‌ని, పక్కింటిదాన్ని, ఎదురింటిదాన్నీనూ! మీకెవరెవరైతే ఆదర్శమూర్తులయ్యారో దాన్నిమాత్రమే! ఇప్పట్నించి సంవత్సరకాలం సమయమిస్తున్నా. నన్నూ వాళ్ళతోపాటు గౌరవిస్తే ఈ సూత్రపు గొలుసు తిరిగి నా మెడలోకి వస్తుంది. లేదంటే మీ పురుషాహంకారంలా గోడకు వేలాడుతూ ఉంటుంది." అంటూ ఒంకెకు తగిలించేసా.

"ఇంత చిన్న విషయానికే... బాబోయ్! మీ ఆడాళ్ళకీ పొగరు ఎక్కువై..." ఆయన వాక్ప్రవాహానికి అడ్డం పడి, మంగళసూత్రం వైపు చూపించా!

"నేను ఇప్పుడు పక్కింటిదాన్ని! ఆవిడని ఇలాగే తిడతారా? తిట్టిరండి చూద్దాం... పనిమనిషినే తిట్టలేం!" అని, నా పనిలో నిమగ్నమై పోయా!

నేను చేసిన పనిని జీర్ణించుకోటానికి నెలరోజులు పట్టింది ఆయనకి. ఎన్నో, ఎంతమందితోనో చర్చలు, మీటింగులు. కానీ నా జోలికి రాకపోవటం గమనించాను. ముఖం మాడ్చుకుని, ఇద్దరమూ గృహకృత్యాలలో ఉన్నాం.

ఇప్పటికి ఆరు నెలలయింది. ఇప్పుడే కాస్త ప్రశాంతత నెలకొంటోంది. ఆ సూత్రం మళ్ళీ నా మెడలోకొస్తే, ఆట మళ్లీ మొదలే!

సూత్రాలవంక చూస్తూ నిట్టూర్చి గతంలోంచి బయటికొస్తుండగా దబ్బున చప్పుడయింది. గభాలున పరుగెత్తా. అత్తయ్యగారు కాలుజారిపడ్డారు. ఇక ఈ వయసులో, ఇలాంటివి చాలా ఇబ్బంది. హాస్పిటలూ, మందులూ, కట్లూ, ఎడమా కుడీ అనకుండా సేవలూ, బెడ్‌రెస్ట్‌లూ, ఈ లోపే ఇంట్లో పిల్లలకీ, ముఖ్యంగా ఆయనగారికి సీజనల్ ఎఫెక్ట్స్ జ్వరాలూ, కోలుకోటానికి బలమైన ఆహారాలూ, ఆయనా ఇంట్లోనే రెస్ట్! ఈ నేపథ్యంలో నాకు చేతకాకపోయినా, ఓపికతో ఎంతో చాకచక్యంతో నెట్టుకొస్తూ... మంగళసూత్రాల సంగతి మరిచిపోయా!

చాకిరీనంతా ఒంటి చేత్తో, వేయి చేతుల బలంతో, నిర్వర్తించటం అన్నీ అందరూ గమనిస్తూనే ఉన్నారు.

రెండు నెలలైంది. అత్తయ్యగారు కాస్త లేచి తిరగటం, ఇంట్లో పరిస్థితులన్నీ చక్కబడుతున్నాయి ఇప్పుడిప్పుడే.

"నిజంగా నీకు ఇంత ఓపిక ఎక్కడనుండి వస్తోందీ? వేయి చేతులున్నాయా? ఇవన్నీచేయటానికీ... బాబోయ్!" అంటుండేవారు ఈయన. ఇదిగో ఈ ప్రశంస కోసం కాదా ఆడవాళ్లు ఎదురుచూసేదీ!

ఈరోజు దేవుడి దగ్గర పూజ చేస్తుండగా, వెనుక అలికిడి అయ్యింది. తిరిగి చూసేలోపే, ఆయన ఒంకెకున్న మంగళసూత్రం గొలుసు గభాలున నా మెడలో వేశారు. వేస్తూ... "కాత్యాయనీ! ఈ మాంగల్యం ఆ దేవుడి సాక్షిగా మెడలో వేస్తున్నాను. లోకంలో స్నేహితులూ, శ్రేయోభిలాషులూ, పరిచయస్థులూ, చుట్టరికమూ, ఇన్ని కోణాలున్న బంధమేదైనా ఉందంటే అది ఆలుమగల బంధమే! నువ్వు వాటిల్లో ఏదైనా అనుకో! కానీ ఇది నీ మెడలోనే ఉండాలి!" అని వెనుదిరిగి వెళ్ళిపోతున్నఆయన్ని తలతిప్పి చూసా!

నా చూపుకే భాషుంటే ఏం మాట్లాడి ఉంటుంది?

# చిగురించిన తెలుగు పలుకు

వి. వి. సత్యప్రసాద్



✆ 6309654446

## విశిష్ట అతిథి కథ

షిప్ ఎక్కాల్సిన ప్రయాణికులందరూ సైరన్ మోగడంతో ఒక్కసారి ఎలర్ట్ అయ్యి, గబగబ డెక్ మీదకు చేరుకున్నారు. దూరతీరాలకు తరలిపోయేవారికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన బంధువుల, స్నేహితుల కౌగిలింతలూ, కన్నీళ్ళూ మొదలైన దృశ్యాలతో ఆ ప్రాంతమంతా ఆత్మీయతా పరిమళాలు గుభాళిస్తూ కోలాహలంగా ఉంది. బరువైన హృదయాలతో సామాన్లు మోసుకుంటూ బరువుగా షిప్‌లోకి కదులుతున్నారు ప్రయాణికులంతా.

“సింధూ, బీ కేర్ఫుల్. హోల్డ్ ద రాడ్ కేర్ఫుల్లీ” తన కూతురికి జాగ్రత్తలు చెప్తూ అరుస్తున్నాడు సత్యరాజ్.

“ఓకే డాడీ, ఓకే. నో ప్రోబ్లెం” జవాబుగా అరుస్తోంది సింధు.

సత్యరాజ్ కుటుంబ సభ్యులంతా షిప్‌లో అడుగు పెట్టి వాళ్ళకు కేటాయించిన ఛాంబర్స్ లోకి ప్రవేశించారు. సత్యరాజ్ ‘హమ్మయ్య’ అని ఊపిరి పీల్చుకొని, సిగరెట్ వెలిగించాడు.

సైరన్ రెండోసారి మోగింది. ‘‘గాస్–సూయెజ్’ పేరు గల పెద్ద కమర్షియల్ పాసింజర్ షిప్ ప్రశాంత గంభీరమైన సముద్రపు అలల్లో అల్లకల్లోలాన్ని సృష్టిస్తూ, బరువుగా నెమ్మదిగా కదిలింది.

ప్రయాణికులంతా ఎవరి ఛాంబర్స్‌లో వారు సామాన్లు సర్దుకుంటూ, నెమ్మదిగా స్థిమితపడుతున్నారు.

సింధు తనకిష్టమైన ఇర్వింగ్ వాలెస్ నవల ‘త్రీ ఐలెండ్స్’ చదవడంలో నిమగ్నమైపోయింది. సత్యరాజ్ భార్య, మిసెస్ సుబ్బుకి ఆ ఓడ బాగా నచ్చింది. చెప్పలేనంత ఆనందం ఆమె కళ్ళలో తొణికిసలాడుతోంది.

“ఐ ఆల్వేస్ ప్రిఫర్ టు ట్రావెల్ బై షిప్ దేన్ ఎయిర్” అంది భర్తతో.

“వాట్స్ ద స్పెషాలిటీ?” కొంటెగా అడిగాడు సత్యరాజ్.

”ఇట్స్ సో థ్రిల్లింగ్ యూ సీ. ద ఓషన్ ఈజ్ డిఫరెంట్ ఫ్రం ద స్కై” అంటూ కళ్ళు చక్రాల్లా తిప్పుతూ, నవ్వుతూ చెప్తుంటే ఆ కళ్ళనే తదేకంగా చూస్తూ ఉండిపోయాడు సత్యరాజ్.

వాళ్ళిద్దరి చూపుల్నీ భంగపరుస్తూ చిన్నకొడుకు బబ్లూ... “వాట్ మమ్మీ, దిస్ జర్నీ ఈజ్ ఎ బిగ్ బోర్! ఐ డోంట్ లైక్!” అన్నాడు విసుగ్గా మొహం పెడుతూ. మిసెస్ సుబ్బూ కొడుకుని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని, ముద్దుపెట్టుకొని “డోంట్ సే లైక్ దట్. షిప్ జర్నీ ఈజ్ సేఫర్. ఎయిర్ జర్నీ ఈజ్ రిస్కీ!” కొడుకుని ఒప్పించడానికి ప్రయత్నం చేసింది. వాడు మొండిగా “నో... నో... వియ్ కెన్ గో వితిన్ ఎ ఫ్యూ అవర్స్. దిస్ జర్నీ టేక్స్ మోర్ డేస్” అంటూ నవ్వాడు.

“పాయింటే” అన్నట్టు చూసాడు సత్యరాజ్ వేలితో సైగ చేస్తూ. “హి ఈజ్ ఎ కిడ్” నవ్వింది మిసెస్ సుబ్బు.

★★★

వివిధ ఛాంబర్స్‌లో ఉన్న ప్రయాణికులందరూ కాలక్షేపంకోసం కారిడార్లోకి వచ్చారు. ఒకరొనకరు పలకరించుకుంటూ పరిచయాలు చేసుకుంటున్నారు. ఆ షిప్‌లో వేరువేరు ప్రాంతాలనుంచి వచ్చిన భారతీయులు కూడా ప్రయాణం చేస్తున్నారు. అన్ని పూవుల్నీ ఏకంచేసే దారంలా వారికి ఇంగ్లీషు భాష ఉపయోగపడుతోంది.

కొందరు రెస్టారెంట్ లో, కొందరు బార్‌లో, మరికొందరు థియేటర్‌లో, ఇంకొంతమంది లాంజ్‌లో... ఎవరికి తోచిన చోట వారు చేరి, షిప్‌లో ఉన్న సౌకర్యాలన్నీ అనుభవిస్తున్నారు. నిమిషాలూ, గంటలూ గడుస్తున్నకొద్దీ అక్కడ వాతావరణం ఆహ్లాదకరంగా మారసాగింది.

“సింధూ మై బేబీ, ఐ షల్ మీట్ హరికిషన్ అండ్ కం బేక్” అంటూ సత్యరాజ్ తన ఛాంబర్ నుంచి బయటకు నడిచాడు. చదువుతున్న పుస్తకం ఆపి, తండ్రివంక చూసి, సిగ్గుతో తలదించుకుంది సింధూ.

హరికిషన్ పేరు ఎత్తితేనే ఏదో తన్మయత్వం, ఆనందం ఆమెలో! ఢిల్లీలో డిఫెన్స్ సర్వీసెస్‌లో ఉన్న మేజర్ గరోడియా ఏకైక కుమారుడు హరికిషన్. గరోడియా కుటుంబం బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారు. సరిగ్గా పది సంవత్సరాల క్రితం, ముంబైలో పనిచేస్తున్నప్పుడు పక్క ఫ్లాట్ లోనే ఉండేవారు. సత్యరాజ్‌కీ, గరోడియాకీ బాగా స్నేహం కుదరడంతో చిన్నపిల్లలుగా ఉన్న సింధు, హరికిషన్ల మధ్య చనువు బాగా పెరిగింది. ముంబైలోనే పుట్టి, పెరిగిన సింధు చదువంతా మొత్తం ఇంగ్లీషు మీడియంలోనే సాగడం వల్ల తెలుగు అసలు తెలీదు. ఇంట్లో కూడా అందరూ ఇంగ్లీషులో మాట్లాడుకోవడమే అలవాటు. మేజర్ గరోడియాకి ముంబై నుంచి ఢిల్లీకి ట్రాన్స్‌ఫర్ పదేళ్ళు దాటినా, సత్యరాజ్‌తో స్నేహం మాత్రం చెరిగిపోలేదు. అంతేగాక, ఒకరికొకరు వియ్యంకులు కావాలన్న ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

సత్యరాజ్ పుట్టింది ఆంధ్రాలో. అసలు పేరు సింగరాజు వెంకట సత్యనారాయణ. అతన్ని ఇంగ్లీషు మీడియం స్కూల్లో జాయిన్ చేసినప్పుడు ఇంటిపేరులోని ‘రాజు’ను చివరికి చేర్చి, సత్యనారాయణలోని ‘సత్య’ను ఉంచి, తెలుగుదనం కనబడకుండా ‘రాజు’ను ‘రాజ్’గా మార్చేసారు. ఇప్పుడు ‘సత్యరాజ్’గా చలామణి అవుతున్నాడు. ముంబైలోని మెరైన్ ఇంజనీర్ కేడెట్ కోర్సుకి ఎంపికై, శిక్షణ పూర్తయ్యాక, ‘మెరైన్ కాలేజ్ ఆఫ్ సౌత్ షీల్డ్స్’ (ఇంగ్లండ్)లో మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తిచేసి, బ్రిటిష్ స్టీమ్ నావిగేషన్ కంపెనీలో రెండవ ఇంజనీరుగా ఉద్యోగంలో ప్రవేశించాడు.

డిపార్ట్‌మెంటల్ టెస్టులు పాసై, వైస్ కేప్టెన్ స్థాయికి ఎదిగాడు. ప్రస్తుతం ప్రయాణిస్తున్న ‘గాస్–సూయెజ్’ షిప్‌కి టెక్నికల్ ఎడ్వైజర్‌గా రమ్మని ఆహ్వానం అందడంతో, సింధూకీ, బబ్లూకీ వేసవి సెలవులు కూడా కలిసి వచ్చాయని, మొత్తం కుటుంబ సభ్యులందర్నీ తీసుకొని వెళ్తున్నాడు.

మూడు నెలల ‘హాలీడే టూర్ పేకేజీ’లో ఆస్ట్రేలియా వెళ్తున్న ఓడ ‘గాస్–సూయెజ్’. ముంబై నుంచి చెన్నయ్ వచ్చి, అక్కడ్నుండి శ్రీలంకకూ, అక్కడ్నుండి సింగపూర్, తరవాత సుమిత, జావా ద్వీప సముదాయం దాటి, ఆస్ట్రేలియాకు ఎసన్మెంట్ ఫిక్స్ అయింది.

సత్యరాజ్ ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలూ చూసాడు. అయినా అతనికి ఆస్ట్రేలియా అంటే ఎందుకో ప్రత్యేక అభిమానం. భూమధ్యరేఖకి దిగువగా, ఒంటరిగా ఉన్న ద్వీపం కావడం, ప్రపంచ చిత్రపటంలో శూన్య ప్రదేశాన్ని నీటితో నింపెయ్యకుండా, కళాత్మకంగా బాలెన్స్ చేస్తూ, తన కుంచెతో భగవంతుడు కళాత్మకంగా తీర్చిదిద్దిన పెయింటింగ్‌గా ఒక అందమైన ఐలెండ్‌ని సృష్టించినట్టు ఆస్ట్రేలియాని ఊహించుకుంటాడు. అందుకే టెక్నికల్ ఎడ్వైజర్ డెప్యుటేషన్‌కి ఆనందంగా అంగీకరించాడు.

తన కూతురు సింధుని హరికిషన్‌కి ఇచ్చి పెళ్ళి చెయ్యాలన్న ఆలోచన ఉన్నప్పటికీ, గరోడియాతో ముఖాముఖీ మాట్లాడుకునే అవకాశం ఉద్యోగరీత్యా దొరకలేదు. అందుచేత గరోడియాను మూడు నెలలు సెలవు పెట్టమనీ, హరికిషన్ ఎంబిఏ పూర్తిచేసి, ఉద్యోగప్రయత్నాల్లో ఎలాగూ ఖాళీగానే ఉన్నాడు గాబట్టి, మొత్తం కుటుంబ సభ్యులందర్నీ ఈ ఆస్ట్రేలియా టూరుకు రమ్మనీ, షిప్‌లో ప్రయాణం సరదాగా, ఆహ్లాదకరంగా ఉంటుందనీ, ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లు తను చూసుకుంటాననీ, ఉత్తరం రాయడంతో దానికి అంగీకరించి, మేజర్ గరోడియా కుటుంబంతో సహా సత్యరాజ్ తో కలిసి ప్రయాణం చేస్తున్నారు.

సత్యరాజ్ గరోడియా ఛాంబర్‌కు వెళ్ళి, ఆప్యాయంగా పలకరించి, అందర్నీ తన ఛాంబర్‌కి ఆహ్వానించాడు. హరికిషన్ అందమైన సూటూ బూటూ వేసుకొని, సత్యరాజ్ వెంట కదిలాడు.

మిసెస్ గరోడియాని సాదరంగా ఆహ్వానించింది మిసెస్ సుబ్బా సత్యరాజ్. హరికిషన్ సింధూతో కరచాలనం చేస్తూ "హౌ డు యూ డు?" అని పలకరించాడు. "ఓకే, నైస్. వెల్కం టు యూ" అంటూ చిరునవ్వు నవ్వింది. రెండు కుటుంబాల వారూ సముద్రపు వింతల గురించీ, ఆస్ట్రేలియా ఖండంలో విశేషాల గురించీ మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. సంధ్యాసమయం ఆసన్నమైంది. అస్తమిస్తున్న సూర్యుడి ప్రతిబింబం, సముద్రుడి నుదుటిమీది సింధూర బొట్టులా భాసిస్తోంది.

సైరన్ మోగింది. అది షిప్ డ్యూటీలకు సంకేతం. అప్పటివరకూ డ్యూటీలో ఉన్న అధికారులూ, ఉద్యోగులూ డ్యూటీ దిగిపోతారు. సైట్ డ్యూటీ వాళ్ళు సెకండ్ షిఫ్ట్‌లో చేరడానికి సమాయత్తమౌతారు.

అప్పుడే డ్యూటీ దిగిన కేప్టెన్ బోష్విక్ తన ఛాంబర్‌కి వెళ్ళి, నెత్తిమీద టోపీని స్టేండుకి తగిలించి, యూనిఫాం తీసేసి, ఫ్రెష్‌గా తయారై, సివిల్ డ్రెస్ వేసుకొని, కారిడార్లోకి వచ్చాడు.

కేప్టెన్ బోష్విక్ జర్మనీ దేశస్తుడు. గత ముప్పై సంవత్సరాలుగా ఓడలమీద ఎన్నో దేశాలు తిరిగినవాడు. ఆయా దేశాలలో ప్రముఖంగా ఉన్న భాషలమీద ఆసక్తి పెంచుకున్నవాడు. ఏ దేశంలో అడుగుపెడితే ఆ దేశ భాష మాట్లాడాలని సరదా ఉన్నవాడు. అతనికి భారతదేశం అంటే ప్రత్యేకమైన అభిమానం. ఎన్నోసార్లు భారతదేశానికి వచ్చాడు. అక్కడ అనేక భాషలు మాట్లాడేవారు ఉంటారని తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. ఆ దేశభాషల గురించీ, సంస్కృతీ వైభవాల గురించీ క్షుణ్ణంగా తెలుసుకోవాలన్న కుతూహలంతో పట్టుబట్టి, సాధ్యమైనంత వరకూ భారతదేశానికి ప్రయాణమయ్యే ఓడలలోనే డ్యూటీ వేయించుకునేవాడు. జర్మన్ దేశస్తుడవడం వల్ల 'మాక్స్ ముల్లర్' ప్రభావం అతనిపై గాఢంగా పడింది. మాక్స్ ముల్లర్ భారతీయ ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన గొప్ప తత్వవేత్త, సాహితీవేత్త.

ఆయన రచనల ద్వారా భారతదేశపు ఔన్నత్యాన్ని ఆకళింపు చేసుకొని, ప్రపంచ దేశాలకన్న భిన్నమైన సంస్కృతిగల దేశం అని గుర్తించాడు. భారతీయుల ఆచార వ్యవహారాలంటే ఆసక్తి, ఇష్టం! అతను తీరిక సమయాల్లో ఓడలోని ప్రయాణీకుల ద్వారా వారివారి భాషలు నేర్చుకొని, వాటిలోని పుస్తకాలు చదవడానికి ప్రయత్నించేవాడు. ఆ విధంగా భారతదేశంలో ప్రముఖమైన హిందీ, బెంగాలీ, మరాఠీ, తమిళ, తెలుగు, మలయాళ భాషలను నేర్చుకున్నాడు. అన్నిటికన్నా తెలుగులో 'అ' 'ఆ' 'ఇ' 'ఈ' లు రాయడం అంటే సరదా. అన్ని అక్షరాలకీ రైలింజన్ చక్రంలా పెద్ద సున్నానో, చిన్న సున్నానో, అరసున్నానో జతగూడి, అన్ని అక్షరాలూ గుండ్రంగా, అందంగా స్పష్టంగా ఉంటాయని మురిసిపోతాడు. అదే విషయం తన స్నేహితులకీ, పరిచయస్తులకీ చెప్తాడు.

ఒక మాటలో చెప్పాలంటే 'బోష్విక్' ఒక భాషాజిజ్ఞాసువు! సాహితీ పిపాసి! అన్ని భాషల పరిమళాలనూ ఆస్వాదించగల రసపిపాసి. అతనితో మాట్లాడేటప్పుడు అన్ని భాషలవారూ బోలెడంత విజ్ఞానాన్ని జుర్రుకుంటూ ఉంటారు.

సత్యరాజ్ భారతీయుడని తెలుసుకొని పలకరిద్దామని వచ్చాడు బోష్విక్. అతడ్ని సాదరంగా ఆహ్వానించి 'టిన్డ్ కూల్‌డ్రింక్' అందించాడు సత్యరాజ్. మేజర్ గరోడియాను పరిచయం చేసాడు. ఇద్దరూ వారివారి కుటుంబ సభ్యులందరినీ పరిచయం చేసారు. మేజర్ గరోడియా బెంగాల్‌కూ, సత్యరాజ్ ఆంధ్రప్రదేశ్‌కూ చెందిన వారని తెలుసుకొని సంతోషించాడు. రెండు భాషల్లోనూ మహోన్నతులైన సాహితీవేత్తలున్నారని కీర్తించాడు. కేప్టెన్ బోష్విక్‌కు భారతీయ భాషలపై అంత అవగాహన ఉన్నందుకు రెండు కుటుంబాల వారూ ఆశ్చర్యపోయారు. ఆయన మాట్లాడుతున్నంత సేపూ ఎంతో ఆనందపడ్డారు. ఆ కొద్దిసేపట్లోనే బోష్విక్ వారందరికీ ఎంతో సన్నిహితుడైపోయాడు. భోజన సమయం అయ్యేవరకూ కబుర్లు చెప్పుకొని, రెస్టారెంటుకు అందరూ కలిసి వెళ్ళి భోజనాలు చేసారు. తరవాత ఎవరి ఛాంబర్స్‌కు వారు వెళ్ళిపోయారు. అందర్నీ జోకొడుతూ, అలలపై ఊగుతూ నెమ్మదిగా సాగిపోతోంది 'గాస్–సూయెజ్'.

★★★

రెండు రోజుల్లోనే కెప్టెన్ బోష్విక్‌కు ఉన్న భాషపరిజ్ఞానం, వివిధ దేశాల, ప్రాంతాల సంస్కృతీ సాంప్రదాయాలపట్ల అవగాహనా, ఆయన అనుభవాలూ వింటున్న ప్రయాణికులంతా ఆయనకు చాలా సన్నిహితులైపోయారు. సాధారణంగా షిప్ అధికారులు తీరికవేళల్లో వీడియోల ముందో, బార్లలోనో కాలం గడుపుతారు.

బోష్విక్ మాత్రం అలా కాకుండా, ప్రయాణికులందరితోనూ కలబోసుకొని మాట్లాడడం, సరదాగా గడపడం అందర్నీ ఆకర్షించింది. షిప్‌లో రోజులు గడుస్తున్న కొద్దీ అందరూ ఆత్మబంధువుల్లా మెలుగుతున్నారు.

★★★

సింగపూర్ నగరం దగ్గర పడుతోంది. ఈ రాత్రీ, మరో పగలూ గడిస్తే సింగపూర్ నగరం వింత శోభలను తిలకించే మహదవకాశం చేరువౌతుంది. అందరూ ఆతృతతో ఎదురు చూస్తున్నారు. ఒకరోజు సాయంత్రం కేప్టెన్ బోష్విక్ డ్యూటీ దిగి, ఒక కొత్తకార్యక్రమాన్ని రూపొందించాడు. అందులో ప్రతీ ప్రయాణికుడూ తనకు తోచిన విధంగా ఐదు నిమిషాలు ఉపన్యాసం ఇవ్వాలని నియమం పెట్టాడు. ఆ ఉపన్యాసం దేనిమీదైనా కావచ్చు. నచ్చని విషయాలను విమర్శించొచ్చు కూడా! అయితే వ్యక్తిగత దూషణ మాత్రం నిషిద్ధం.

అన్ని భాషల వారూ తమని తాము పరిచయం చేసుకుంటూ, వారివారి ప్రాంతాలలో ఉన్న విశేషాలూ, దేవాలయాలూ, నదులూ, పురాణగాథలూ, ప్రముఖ గ్రంథాలూ, ప్రసిద్ధ రచయితలూ, భాషావేత్తలూ... ఇలా అనేక విషయాలను గురించి మాట్లాడేరు.

అందరి ఉపన్యాసాలూ అయిపోయాక, చివర్లో సత్యరాజ్ వంతు వచ్చింది. అతను తన ఉద్యోగనిర్వహణలో ఎదురైన కష్టనష్టాలను గురించి మాత్రం ఇంగ్లీషులో మాట్లాడి ముగించాడు. ఆ షిప్‌లో ఉన్న ఏకైక తెలుగువాడైన సత్యరాజ్ తెలుగువారి గురించి మాట్లాడతాడేమోనని బోష్విక్ అనుకున్నాడుగాని, ఆశాభంగమైంది. అందుచేత ఆంధ్రుల గురించి తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

ప్రారంభంలోనే "సోదర సోదరీమణులారా!" అంటూ వింత యాసతో సంబోధించేసరికి అందరూ చప్పట్లు కొట్టారు. తెలుగు బాగా పలకలేని సందర్భాలలో హిందీ, ఇంగ్లీషు ఉపయోగిస్తూ అతను చేసిన ఉపన్యాస సారాంశం ఇది...

'మూడు రోజులుగా మీరందరూ నాకెంతో సన్నిహితులైపోయారు. అందుకు మీ అందరికీ నా ధన్యవాదాలు. నేను నా సర్వీసులో

భారతదేశానికి సుమారు ఇరవైసార్లు వచ్చుంటాను. మొదటిసారి వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఎన్నో మార్పులు గమనించాను. ప్రజల జీవనవిధానంలో ఎంతో అభివృద్ధి కనిపించింది. అందుకు సంతోషం కలుగుతోంది. ఐతే, భారతదేశంలో పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్, తమిళనాడు, కేరళ, కర్ణాటక మొదలైన రాష్ట్రాలలో వారివారి భాషల ఔన్నత్యాన్ని కాపాడుకుంటుంటే, ఆంధ్రాలో మాత్రం దానికి భిన్నంగా ప్రవర్తిస్తున్నారు. అదే నాకు చాలా బాధను కలిగిస్తోంది.'

'నాకు తెలుగుభాష అంటే చాలా ఇష్టం. ఆంగ్లేయులు పరిపాలిస్తున్న కాలంలోనే తెలుగుభాషకు ఎంతో ప్రాముఖ్యత లభించింది. వారు తెలుగును ఎంత గౌరవించేవారంటే, రూపాయి నాణేలపై ఒక్క తెలుగు భాషలోనే 'ఒక్క రూపాయి' అని ముద్రించేవారు. భారతదేశంలో ఒక తెలుగు జిల్లాలో కలక్టర్‌గా పనిచేసిన మహానుభావుడు, సి.పి.బ్రౌన్, మొట్టమొదటి ఇంగ్లీష్–తెలుగు నిఘంటువు రాయడం మాత్రమే కాకుండా, వేమన పద్యాలను మొదటిసారిగా గ్రంథస్థం చేసాడు. అనేక ప్రాచీన కావ్యాలను పరిశోధించి, విశ్లేషణాత్మకమైన వ్యాఖ్యలు రాసాడు. ఆయన ఆంధ్రదేశంలో ఉద్యోగరీత్యా ఉన్నంతకాలం ఎందరో భాషావేత్తలను ప్రోత్సహించి, కింగ్ జార్జ్ పంచమ చక్రవర్తి సహితం ఆంధ్రభాషను ప్రశంసించేలా చేసాడు.'

'అటువంటి భాషామతల్లికి తనయులైన నేటి 'యంగ్ జెనరేషన్' తెలుగు భాషంటే 'ఏంగ్రీ జెనరేషన్'గా మారుతున్నారు. తెలుగు మాట్లాడమే ఒక అపరాధంలా, చిన్నతనంగా భావిస్తూ, తమ భాషను తామే మరుగున పడేస్తున్నారు. తెలుగువాడినని చెప్పుకోవడమే నామర్దాగా భావిస్తూ, తమ తల్లిదండ్రులు పెట్టిన పేర్లలో కూడా తెలుగుదనం కనబడకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎన్నో దేశాలను చూసాను కాని, ఇటువంటి మనస్తత్వం ఏ దేశంలోనూ, ప్రాంతంలోనూ నేను చూడలేదు.'

కాసేపు ఆపి, సత్యరాజ్ వంక చూసాడు బోష్విక్. సత్యరాజ్ తలవంచుకున్నాడు. "ఈయనకు ఇన్ని విషయాలు ఎలా తెలుసబ్బా. మనకే తెలియలేదు" అంటూ పక్కనే ఉన్న అతని భార్య సత్యరాజ్ చెవిలో ప్రశంసాపూర్వకంగా ఆశ్చర్యపోయింది. సింధూ సత్యరాజ్ వైపు అసహనంగా చూసింది. హరికిషన్‌కి ఏమీ అర్థంకాక తెల్లబోయి చూస్తున్నాడు. అతను లేవబోతుంటే, లేవొద్దని సుబ్బు వారించింది. హరికిషన్ అసహనంగా కూర్చున్నాడు. సింధు ఆసక్తిగా వింటోంది.

బోష్విక్ తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు. 'ఇప్పటి యంగ్ జనరేషన్ ఎన్నో మహత్తరమైన ప్రాచీన గ్రంథాలను విస్మరిస్తోంది. ఆ గ్రంథాలన్నీ యూనివర్సిటీల్లో రీసెర్చ్ స్కాలర్లకే పరిమితమైపోతున్నాయని నా మిత్రులు చెప్తున్నారు. అప్పటి కవులూ, రచయితలూ ఏం రాసారు, ఏం వర్ణించారన్న కుతూహలం కూడా కనబరచడం లేదు. ఇదే ధోరణి ముందు తరాల్లో కూడా ప్రబలితే ఇక తెలుగువాడి గొప్పదనాన్ని శాశ్వతంగా మరచిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. విదేశీయులు సైతం ఎంతో అభిమానిస్తున్న తెలుగుభాషను తెలుగుగడ్డపై పుట్టిన వారు విస్మరించడం అపరాధమే అవుతుంది. అందుచేత, తెలుగువారి గౌరవాన్ని తిరిగి నిలుపుకోవాలంటే ప్రతీ తెలుగు పౌరుడూ తనను తాను గుర్తించుకునేలా చేసుకోవాలి. తమ భాషపట్ల ఏహ్యాభావం కాకుండా, గౌరవభావం పెంచుకోవాలి' అని ముగించాడు.

జనం అందరూ చప్పట్లు కొట్టారు. ఉపన్యాసాల కార్యక్రమం ముగిసిందని చెప్పడంతో అందరూ లేచి, రెస్టారెంట్ వేపు నడుస్తున్నారు. సింధు సత్యరాజ్ దగ్గరగా వచ్చి "డాడీ .. ఆర్ తెలుగూస్ సో గ్రేట్ ఏజ్ హి టోల్డ్?" అని అడిగింది.

"యస్ బేబీ. ఐ వాస్ బోర్న్ ఎట్ భీమవరం; ఎ స్మాల్ టౌన్ ఇన్ ఆంధ్రప్రదేశ్. ఎ పెర్ఫెక్ట్ తెలుగు స్పీకింగ్ ప్లేస్" అన్నాడు నవ్వుతూ. "తెలుగూస్ ఆర్ గ్రేట్" అని మళ్ళీ అన్నాడు.

"బట్ యు నెవర్ టోల్డ్ మీ!"

"వుయ్ డిడ్నాట్ ఎవర్ గెట్ ఎనీ ఆపర్చ్యూనిటీ టు టాక్ ఎబౌట్ తెలుగూస్"

"ఈజ్ మమ్మీ ఆల్సో ఎ తెలుగూ?"

"యా!"

కొంచెం దూరంనుండి గమనిస్తున్న బోష్విక్ వారిద్దరి గుసగుసలకీ నవ్వుకున్నాడు. రెస్టారెంట్లో డైనింగ్‌టేబుల్ దగ్గర కూర్చున్నాక,

"మిస్టర్ సత్యరాజ్. డజ్ యువర్ చైల్డ్ నో ద 'ఆల్ఫా బెట్' ఆఫ్ తెలుగు?" అని అడిగాడు.

"నో!"

సింధుకు తల తీసేసినట్లైంది.

"ఎట్లీస్ట్ దు యు నో?"

"యస్" అన్నాడు ధైర్యంగా.

"ప్లీజ్ రైట్ ఆన్ దిస్ పేపర్" అంటూ ఓ కాయితాన్నీ, బాల్ పాయింట్ పెన్నునీ సత్యరాజ్ చేతికి అందించాడు.

'అ, ఆ, ఇ, ఈ' ల వరకూ రాసాక, తరవాత 'ఉ, ఊ'లు వస్తాయో, 'ఒ, ఓ'లు వస్తాయో సందేహం వచ్చి, కాసేపు ఆగాడు. సుబ్బు తన చిన్నప్పటి చదువుని జ్ఞాపకం చేసుకొని కొంచెం సాయం చేసింది. అయితే, 'ఔ', 'జ్ఞ', 'ఋ' వంటి అక్షరాల్ని పూర్తిగా మరచిపోయాడు. కన్ఫ్యూజన్‌కు గురై, అటుదిటూ, ఇటుదటూ రాయడమేకాక, కొన్ని అక్షరాలనైతే అసలు రాయలేకపోయాడు కూడా!!

బోష్విక్ పగలబడి నవ్వాడు. "ఐ షల్ రైట్ అండ్ షో యూ" అంటూ మరో కాగితాన్ని తీసుకొని, పొల్లుపోకుండా మొత్తం అక్షరాలన్నీ రాసేటప్పటికి, టేబుల్ చుట్టూ మూగిన జనం అంతా చప్పట్లు కొట్టారు. సత్యరాజ్ బోష్విక్‌ని ప్రశంసించాడు. విందు ముగిసింది.

సత్యరాజ్ తన కూతురి పెళ్ళి విషయం గరోడియాతో ప్రస్తావించదానికి అనువైన సమయం మూడురోజులు గడిచినా దొరకలేదు. సింగపూర్ చేరితే, మరో నాలుగు రోజుల వరకూ ఆ ప్రస్తావన తీసుకురావడానికి కుదరదు. అందుచేత అక్కడికి చేరకముందే మాట్లాడితే మంచిదని, మధ్యాహ్నం రెండుగంటలకి గరోడియా దంపతులతో సమావేశాన్ని ప్లాన్ చేస్తున్నాడు భార్యతో కూర్చొని.

వీళ్ళ సంభాషణ కర్ణాకర్ణీగా విన్న సింధు ఒక్క ఉదుటున లేచి, తల్లిదండ్రుల దగ్గరకు వచ్చింది. సీరియస్‌గా మొహం పెట్టి, బరువైన హృదయంతో...

"డాడీ, ప్లీజ్ డ్రాప్ ద ఐడియా. ఐ డోంట్ వాంట్ టు మేరీ హరికిషన్" అంది. అప్రతిభులైపోయారు దంపతులిద్దరూ. ఆశ్చర్యంనుంచి తేరుకొని "వై? వాట్స్ ద మేటర్?" అని ప్రశ్నించాడు సత్యరాజ్.

'దిస్ ఈజ్ మై డెసిషన్" నొక్కి చెప్పింది. "వాటెబౌట్ హరికిషన్?" కూతురి కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది సుబ్బు.

“హీ ఈజ్ మై చైల్డ్ హుడ్ ఫ్రెండ్. దట్సాల్. వియ్ షల్ రిమైన్ గుడ్ ఫ్రెండ్స్ ఫరెవర్” దృఢమైన స్వరంతో చెప్పేసరికి, సత్యరాజ్ సుబ్బు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

“వాట్ హేపెన్డ్ టు యు? వై హావ్ యు టేకెన్ సచ్ డెసిషన్?” సత్యరాజ్ చిరాకుగా అడిగాడు.

“అయాం వెరీ మచ్ ఇన్స్పైర్డ్ విత్ ద స్పీచ్ ఆఫ్ మిస్టర్ బోష్విక్! హీ వివిడ్లీ ఎక్స్ప్లయిన్డ్ ఎబౌట్ ద గ్రేట్నెస్ ఆఫ్ తెలుగు. ఐ వాంట్ టు మేరీ ఎ తెలుగు మేన్, లెర్న్ తెలుగు అండ్ బికం మదర్ ఆఫ్ ఎ ప్రౌడ్ తెలుగు సన్. ఇఫ్ ఐ మేరీ ఎ బెంగాలీ ఐ విల్ బికం బెంగాలీ అండ్ ఆల్సో ఎ మదర్ ఆఫ్ బెంగాలీ సన్స్ అండ్ డాటర్స్”


గట్టి షాక్ తిన్నట్టైంది దంపతులిద్దరికీ. సత్యరాజ్ గరోడియాతో పెళ్ళి ప్రస్తావన తీసుకురావడం మానుకున్నాడు. రెండు కుటుంబాలూ తమ బంధాన్ని బంధుత్వంగా మార్చుకునే ఆలోచనకు స్వస్తి పలికి, స్నేహానికి మాత్రమే పరిమితం చేసుకొని, జీవనయానంలో సుదూరతీరాలకు సాగిపోయాయి.

*ఇది నిజంగా జరిగిన కథ. తెలుగువాడు గర్వించదగ్గ కథ. బోష్విక్ అనే జెర్మన్ దేశస్తుడు సిసలైన తెలుగు భాషాభిమాని. 'గాస్–సూయెజ్' షిప్‌కి సెకండ్ ఆఫీసర్‌గా ఉన్న నా మేనల్లుడు 'చిన్నూ'కి కృతజ్ఞతలతో...*

(నవ్య మే 25, 2011 సంచికలో ప్రచురితం)

# దివాణం సేరీవేట

కీ. శే. పూసపాటి కృష్ణంరాజు



**కథామార్గదర్శి కథ**

***సాయిబు చాపమీద మాంసము చిన్నచిన్న వాటాలు వేసాడు. తవిటయ్య క్షణంలో అన్ని వాటాలూ తాటికమ్మల్తో అందంగా ముంగాలు కట్టేడు. ఊళ్ళో రాజులంతా తలా వాటా పట్టుకుపోయేరు. డిస్ట్రిక్టుబోర్డు ఆసుపత్రికి కొత్తగా వచ్చిన డాక్టరుగారికి కూడా ఒక వాటా పంపించేరు. ఒక గంటకి పూర్వం పెద్ద కమేలా వలే ఉన్న చావిడి, మళ్లీ యథాస్థాయికి వచ్చింది.***

అడవి పందిని పొడుచుకొచ్చేరు!

యింకా సూర్యుడుదయించనే లేదు. చావిడి ముందు నీలాటి రేవుకి వెళ్ళే పడతులంతా చుట్టూ వలయం కట్టి నిలుచున్నారు. పాలికాపులంతా పొలాలకు పోతూ పోతూ, ఆ ముచ్చట కాస్త తొంగిచూసి మరీ వెళుతున్నారు. ఎదురుగావున్న కాగుచెట్టు పచ్చగా ఆకు తొడిగి ముచ్చటగా వుంది. పక్కనే చెట్టునానుకొని వున్న కోనేటిలో తామరపువ్వులూ, ఆకులూ సూర్యుని కోసం విప్పుకుంటూ ఉన్నాయి. బంగార్రాజుగారి పెద్దకొడుకు కాగుచెట్టు మీద కోతిలాగ మెలికలు తిరిగిపోతూ పందుప్పుడకలు విరుస్తున్నాడు. కడవలు పట్టుకుని నోట్లో పందోము పుడకలు నములుకుంటూ రెండు చేతులూ ఊపుతూ, నెత్తిమీద కడవలు కింద పడకుండా కాసుకుంటూ, ఒకర్నొకరు తోసుకుని అంతవరకూ సాగుతున్న లోకాభిరామాయణం చాలించి, చచ్చిపడి ఉన్న పందిని వింతగా తిలకిస్తున్నారు. చావిడి అరుగుల మీద చినరాజులంతా చతికిలబడి కూర్చున్నారు. రాట్లకూ, స్తంభాలకూ వేటకుక్కల్ని కట్టారు. గోడలకు చేరబెట్టిన ఈటెలు తళతళా మెరిసిపోతున్నాయి. వాళ్ళ ప్రతాపాలూ, కబుర్లూ వీరోచిత గాథల్లో... జయలక్ష్మిని చేపట్టి వచ్చిన సైనికుల సంభాషణల్ని స్ఫురింపచేస్తున్నాయి.

"ఓలమ్మా! ఎంత బలిసిందే. దాని జిమ్మడా... గరువుమీన ఏరుచనగ చేనంతా దానెదాన్నెట్టుకుందే!" అంది

బంగారి నోటిలో పందోము పుడకతీసి తుబుక్కున ఉమ్ముతూ.

"పెదరాజుగోరు అడివికెల్లినప్పుడింతకి నాలుగింతలుంటాదె కోరలు కూడా వొచ్చినయ్యె. నువ్వెరగవు గాని, నానా ఇంట్లో పని సేసేదాన్నె! అప్పుడా పెదరాజులంతా ఏటకెల్లి పందుల్ని తెచ్చేవోరు. పందెప్పుడు దివానానికి వొచ్చినా... అయ్యగారు తోళ్ళు పులుసూ, కూడూ యెట్టేవోరు, ఎంత కమ్మగుండేదనుకున్నావు... మళ్లీ జనమలో అనాటిది రుసి సూద్దేదనుకో!" అంది ముసలి మంగి, నోరు చప్పరిస్తూ పడిపోయిన దివాణాల గోడలవైపు చూస్తూ.

"ఓ చప్పుడు దాకెందుకె, నాను మా యత్తోరూల్లో రాజుగోరి చేరీనోకి పాటుకెల్లినాను. ఆయాల ఉడుపులోల్లందరకీ ఏటపోతు నేయించి, మావిడిబద్దలు నంచుకెట్టి, పులుసూ కూడు ఏసినారు. అది రుసంతే రుసికాదు, గంగ పిన్నమ్మా! ఏదన్నా రాజుగోరింటి కూడు రుసేనే. నువ్వంతే ఏదో అనుకున్నాంగానే." అంది అట్టాడ చిట్టి.

"నీ బొంద దేందె! గంగమ్మత్త అడివి పందిచయం చెపుతుంతే మద్దిని దానత్తోరూసు..।" నరసమ్మ విసుక్కుంది.

"అడివి పంది మాంచం ఎప్పుడయినా మూసూసినావె?" చిట్టిని నిలవేసడిగింది గంగి.

"నా కెక్కడిదే? నువ్వే ఆనోగిలీ ఆనోగిలీ దేకురుతావు... మావిడిబద్దలికీ గట్టాను. కుంతట్టుకురాయె అంతే తెత్తావా... ఏవన్నానా? అక్కడే నోట్లో వొడీసుకొత్తావు. మాదాకా వొత్తాయా?" అంది చిట్టి మూతి బిగించి.

ఆ సామంగీకి వయస్సు మళ్లింది. మనువుకి వెళ్లక పూర్వం ముందు రాజుగారి దివాణంలో అంట్లు తోమేది. వయస్సులో ఉండగానే దివాణం గోడలు జారిపోవడం రాజులు సత్తా సన్నగిల్లడమూను. అప్పటి రాజులు అరుగులు దిగేవారా! కాలు కదిపేవారా! ఇప్పుడీ చినరాజులు ఎక్కడ చూసినా వారే. తోటకట్టల్లోనూ, మెట్టు గరువుల్లోనూ, అన్ని జాతుల్తోనూ తిరుగుతున్నారు. దివాణంతో పాటు బుద్దీ మారినట్టేనా? జారిన గోడల మీద తాటికమ్మతో నిలబెట్టిన కొంజాను చావిడని అంటారు గాని, ఆనాటి దివాన్ ఖానాకీ దీనికీ పోలికే లేదు! పదేళ్ల కిందట ఊరు కాలిపోయినప్పుడు సకం సకం కాలి మొరడులా వున్న దాన్ని సింహద్వారమని, గోడలన్నీ జారి దిబ్బపడ్డ భాగాన్ని దివాన్ ఖానా అనీ, చావిడి ముందు భాగాన్ని బొంకులు దిబ్బ అనీ, అనుకోవడం లాంఛనప్రాయంగా మిగిలేయి గాని, వాటి స్వరూపమే మారిపోయింది. ఆ తరంలో మిగిలిన వారల్లా ఎనభై ఏళ్ళు దాటిన రాంభద్రరాజు గారు మాత్రం కనుపిస్తున్నారు. దర్జాలూ, కోటలూ ఒక్కలాగున్నాయి. ఇవన్నీ గంగికి తెలిసినవే, అయినా అడివిపందిని చూస్తూ వుంటే, అయ్యగారు దివాణంలో స్వయంగా తనను పిలిపించి దగ్గరుండి పందివోళ్ల పులుసు వడ్డింపిస్తే, ఆప్యాయంగా తిన్న రోజులు జ్ఞప్తి కొచ్చేయి.

ఈ ముసలిరాజుగారు పూనుకుని, తుప్పుపట్టిన యీటెలను దులిపించి, చినరాజులనందర్నీ 'తలో కుక్కనీ మేపమని', సరంజాం అంతా కూర్చి తరివీజు యిస్తున్నారు! వేట మొదలు పెట్టి ఆరు మాసాలయినా, పంది పట్టుబడ్డం యిదే ప్రథమం. వేరుశనగకాయల రోజులు పందులు కొండ దిగి పల్లపు పొలాలకు వచ్చేయి. చేలు పాడుచేస్తున్నాయి. మాంతి బంగారి గరువు కొండ అంచునే వుంది. ఆ గరువులో చేనంతా పందుల పాలబడ్డదట. అందుకే బంగారి గోల పెడుతూ వుంది.

"అదేందె. చూత్తందోలమ్మా! నాకు బయ్యిమె. నాను సూడనేనమ్మో!" అంది అప్పుడే వచ్చిన ఎంకి, బిందె వయ్యారంగా నడుంమీద తిప్పుతూ.

"ఏటో లొగలాడె, చింగినాదం గాని, చచ్చి వొల్లక తొంగున్న పంది దీని కోసం కన్ను తిప్పిందట." అంది సీతాలు విసురుగా! సీతాలు మాటకి అంతా గొల్లున నవ్వేరు.

ఎంకిని చూస్తే తక్కిన ఆడవాళ్ళకందరికీ ఏదో అనాలనే వుంటుంది. మంచి యీడులో వుంది. బొద్దంచు కోక కట్టుకుని, కానీ అంత బొట్టు పెట్టుకుని, పెద్ద సవరంతో తాటికాయంత కొప్పు ముడివేసి ముక్కుని నత్తు కదుల్తూవుంటే గడ్డిబుంగ చేత్తో వూపుకుంటూ, వీధిలో నడిచి వెళుతూ ఉంటే, చినరాజులంతా వాళ్ల హృదయాల మీద హంసలు నాట్యం చేస్తున్నట్టు మథనపడతారు. గడ్డిబుంగ పట్టుకుని ఎంకి ఏ గరువు మీదకు గడ్డిపరకలకు వెళితే, ఆ గరువంతా కళకళలాడుతూ వుండవలసిందే. ఒక అందకత్తె తక్కిన ఆడవాళ్ళ హృదయాల్లో ఈర్ష్య రేకెత్తిస్తుంది.

"నా వూసెత్తొద్దంటే సిగ్గేటి!" అంటూ బిందె నడుం మీద కుదురుగా వుంచుకుని గబగబా అంగలు వేసుకుంటూ నీలాటి రేవుకి వెళ్లిపోయింది ఎంకి.

రాంభద్రరాజుగార్ని అంతా పెదరాజుగారని పిలుస్తారు. దివాణం పడిపోయినా, కాలూ చెయ్యి వొంగినా... మీసాలు దువ్వడం,

చేపాటికర్ర వూపడం రాజుగార్ని వదల్లేదు. చేరీలో నుండి నక్కపిల్లి చేపాటికర్ర వూపుకుంటూ వస్తున్నారు. వెంకడు ఆయన వెనకనే పిల్లిలా అడుగులు వేసుకుంటూ నడుస్తున్నాడు. యీ కబురాకబురు చెప్పి, పెదరాజుగార్ని స్వయంగా దగ్గరుండి తీసుకొస్తున్నాడు. ఆయన కుర్రతనంలో వేటలో ఆరితేరిన చెయ్యి. లేడిని మెప్పించి పరుగెత్తేవారట. యీ వేట అంతా ఆయన 'పట్టుదల, ప్రజ్ఞాను!' ఆయన చినరాజులందరికీ భీష్ముడు. అలగా జనం అంతా రాజుగారిని చూసి దూరంగా తప్పుకున్నారు. వేటకుక్కలన్నీ తోకలాడించేయి. చినరాజులంతా లేచి నిలుచుని పెదరాజుగారి మీద గౌరవం వెల్లడించేరు.

"ఏ పొలంలో దూపుడయింది జగన్నాథం?" అడిగారు రాజుగారు. జగన్నాథం చినరాజులందరికీ వేటలో సైన్యాధిపతి. ఆయన దగ్గర రెండు కూనలున్నాయి. అందులో ఒకటి గాలి కూన. ఆ కూన కోసం ఎన్నో వ్యయప్రయాసలకు లోనై తీసుకొచ్చేరట. పందిజాడ ఏ వైపునుండి వస్తున్నదీ పసిగట్టి, తక్కిన కుక్కల్నీ వేటగాళ్ళనీ ఆ వైపుకి నడిపిస్తుంది. అందుకు ఆ కుక్క అంటే అందరికీ అభిమానం.

"ఎర్రవాని గరువుమీది కూనల్ని విడిచిపెట్టాం బావాజీ!" జగన్నాథం పెదరాజుగారికి మనవి చేసేరు.

"బొత్తిగా వరిగలా అవుపిస్తుంది బాబూ!" రాజుగారు చేపాటికర్ర బుజాల మీద వేసుకుంటూ అడిగేరు.

"తొగలో వుండి గిడసదేరి పోయింది. తొగ నిరుటి తొగయి కూడా వుంటది తాతయ్యా!" సమాధానం చెప్పేడు,

తాతమ్మ.

"వెళ్ళిన గంటకే కూన గాల్లాగింది. అందరం కూనల్ని విడిచి పెట్టాం... పంది గరువు దాటి బంద అరగడిలోకి దిగుతుండగా కుక్కలడ్డాయి. శంకరం యీటె వేసాడు!" జగన్నాథంగారు మనవి చేసేరు.

"ఇదేదో అంత బాగా ఆనడం లేదు జగన్నాథం!" సందేహించేరు పెదరాజుగారు.

"ఒంటి పంది క్షణంలో తప్పుకుంది, లేకపోతే యీపాటికి తమరు బండి తోలించుకు అడివికి రావలసిందే" అన్నాడు సుదర్శనం.

"వీడి కోతలకేం లెద్దురు తాతయ్యా! గెడ్డలో చతికిలబడి కూర్చున్నాడు. ఏవిటోయ్... యిక్కడున్నావని అడుగుతే, 'ఒంటిపంది నడ్డుకుని యిటొచ్చాను. ఆ బలుసు దుబ్బు చాటుని మాటేసుక్కూర్చుంది, మాట్లాడకు పుటాయించి పోద్ది' అంటాడు. తీరా చూస్తే అక్కడ పందీ లేదు. వాడి బొందా లేదు!" అన్నాడు తాతమ్మ.

"అవునమ్మా, పంది మిమ్మల్ని పొడవమని అక్కడ కూర్చుంటుందా? క్షణంలో ములుగు ములుగుపోద్ది!

పంది ముందయితే, అడ్డడం ఫాలాక్షుని తరం కాదు!" అన్నారు అనుభవజ్ఞులు రాజు గారు.

"మీరు నా మాట నమ్మరు... ఏం చేద్దునూ!" అన్నాడు సుదర్శనం.

"నీకింకా అనుభవం చాలదమ్మా, కుర్రకుంకవి!" అంటూ పెదరాజుగారు మీసాలు దువ్వుకుని చావిడి అరుగు మీద కూర్చున్నారు.

"కాళ్ళు కురసగా వున్నాయోయ్" అన్నారు రాజుగారే మళ్ళీ ముభావంగా.

"అయినా విపరీతమైన బలుపు వుంది తాతయ్యా! నలుగురం పాత చేరీ వరకూ మెయ్యలేక గూళ్ళు పులిసిపోయినాయి!" అన్నాడు శంకరం.

"ఏదో అయింది. మంగలి తవిటియ్యకీ, పీరు సాయిబుకీ వర్తమానం పంపేరా?" అంటూ లోగిట్లోకి దయచేసేరు పెదరాజుగారు.

"ఇంక ఆలస్యం ఎందుకూ, పట్టండి నలుగురూ, చావిట్లో వేద్దాం!" అన్నారు జగన్నాధం గారు.

"శంకరం! తాటికమ్మలు కోసుకురావద్దటోయ్?" అడిగేడు తాతమ్మ

"సుదర్శనం వాళ్ళ పాలికాపుని పంపించాడు!" అన్నాడు శంకరం.

"నేనూ వెళ్ళనా... ముంగాల కమ్మలికి?" అడిగేడు బంగా(రాజుగారి అబ్బాయి...నిక్కరు మీదకు లాక్కుంటూను.

"వొద్దు. అరుగు మీద చాపలు తీసి వరండాలో వెయ్యమ్మా!" అన్నారు జగన్నాధం గారు.

బంగారాజు గారి కుమారుడు తారాజువ్వలా పరుగెత్తేడు.

మంగలి తవిటియ్యా, పీరు సాయిబూ చూరకత్తులు జిగజిగా మెరిసేలా పదును పెట్టుకుని వచ్చేరు. సుదర్శనం, తాతమ్మా, బంగారం, మంగలి తవిటియ్యా పందిని తెచ్చి అమాంతం చావిడి వెనక భాగం వసారాలో చాపల మీద దించేరు.

పావుగంటలో పందిని సాయిబూ, తవిటియ్యా, సుదర్శనం, జగన్నాధం కలసి ముక్కలు ముక్కలుగా తరిగేరు. మాంసపు దుకాణంలో కసాయివాడు దుక్క మీది కైమా కొట్టినట్టు... చకచకా దుమ్ముల నన్నిటిని తాతమ్మ విడమర్చిసేడు,

"డాక్టరుగారికి ఒక వాటా పంపించండోయ్" అనుకుంటూ పెద్దరాజుగారు స్నానం చేసి, యిస్త్రీ పంచె కట్టుకుని చావిట్లోకి దయచేసారు.

సాయిబు చాపమీద మాంసము చిన్నచిన్న వాటాలు వేసాడు. తవిటయ్య క్షణంలో అన్ని వాటాలూ తాటికమ్మల్తో అందంగా ముంగాలు కట్టేడు. ఊళ్ళో రాజులంతా తలా వాటా పట్టుకుపోయేరు. డిస్ట్రిక్టుబోర్డు ఆసుపత్రికి కొత్తగా వచ్చిన డాక్టరుగారికి కూడా ఒక వాటా పంపించేరు. ఒక గంటకి పూర్వం పెద్ద కమేలా వలే

ఉన్న చావిడి, మళ్లీ యథాస్థాయికి వచ్చింది.

రాజులంతా వేటపంది మాంసము సుష్టుగా భోజనం చేసి రోజంతా విశ్రాంతి తీసుకున్నారు. ఎండంత సేపు స్కూలు కుర్రాళ్ళు చావిట్లో నిర్భయంగా ఆడుకున్నారు. మధ్యాహ్నం నాలుగు దాటింది. ఒక్కొక్కరే వచ్చి చావిట్లో ఆసీనులవుతున్నారు. పెదరాజుగారు కూడా వచ్చేరు.

రాత్రి వేట విషయాలు, పూర్వం పెదరాజుగారి అనుభవాలూ, అన్నీ కలగాబులగంగా సంభాషణలలో దొర్లిపోతున్నాయి. పెదరాజుగారి పాలికాపు వెంకడు వచ్చేడు. వాడితో మరో ఇద్దరు నూతన వ్యక్తులు కూడా ఉన్నారు. అందులో ఒకడు పెదరాజుగారికి నమస్కరించేడు. ఆయన ప్రతి నమస్కారం చేస్తూ,

"ఎవరు వెంకా వాళ్లు?" అని ప్రశ్నించేరు.

“కొండకాద గొల్లపాలెం బావూ!” వెంకడు చెప్పేడు.

“నాను బావూ చంద్రాయిని. ఏలిన వోరు మరిసిపోనారు గానె, నాను తఁవరేటకొచ్చినొప్పుడు తాటికాయా, మట్టా కొట్టి మకాంనో కొట్టుకొచ్చీ వోడ్ని!” అన్నాడు.

“నువ్వు చెంద్రి గాడివటరా! మీ బాబు అప్పిగాడు కులాసాగా ఉన్నాడా?” అన్నారు రాజుగారు చంద్రాయిని పోల్చుకొని.

“నేదు బావూ, మూనేదు శనక్కాయల రోజుల్లో కాలం సేసినాడు!” అన్నాడు విచారంగా.

“అవునెప్పటివాడు, నాకంటే పెద్దవాడు! నేనేదో యిలా వున్నాను కాని, కొంచెం నడుస్తే ఆయాసం అదీ వొస్తుంది!” అన్నారు పెదరాజు గారు.

“ఏలినవోరు కరునించాల బావూ!” అన్నాడు జంకుతూ చంద్రాయ.

“ఏం... ఏం కావాలి?” అని చూసేరు రాజుగారు.

“పొరపాటు జరిగిపోనాది. దివానం రేతిరి సిన్రాజులంతా వొచ్చి నా కొంప దీసినారు!” అన్నాడు చంద్రాయ.

“మేం నిన్నేం చేశామురా?” అడిగారు జగన్నాథంగారు.

“మా తమ్ముడు చరదా పడితేనె, నిరుడీ రోజుల్లో పందలోల్ల కాడ జిగిని పందికూన నుచ్చుకున్నాను. రేత్తిరి గూటికి రానేదు. ఏవయిందా అనే ఆ యాలదాకా గరువులన్నీ ఎతికినాం. అదే వొత్తది కదా అనె కునుకొచ్చి తొంగుండిపోనాం. దివానం ఏలినవోరు సిన్రాజులంతా బేసిల్ని ఎంటేసుకొచ్చే గరువుకాడ సిక్కడ్డ కూన్నె పొడుసుకొచ్చినారంట. మూనాల కిందట చాకలోల్లొచ్చె డెబై రూపాయలిత్తానంటే యిచ్చేందు కాదు మావోడు... నాను యిచ్చియ్యే అంటే యిన్నాడు కాదు. మావీ పొద్దు గరువులు మీన తిరుగుతుంటే, సతివాడోల్లు సెప్పినారు... ‘దివానం రేతిరి బేపిల్ని ఏసుకొచ్చి, తెల్లారిగట్ట పందిం తెచ్చి మా కళ్లంకాడ దించినారు. మాం సూసినాం ఏటి బావూ! జిగినిపంది నొట్టికెల్తన్నారంతే’ రాజులకి కోపం వొచ్చి తంతారేవో అని వల్లకున్నాం. ‘నీదయితే అప్పుడే అడుగుదుం’ అన్నారు బావు. తెలిసొచ్చినాను... ఏలినవారు కటాచ్చించాల!” అన్నాడు గుడ్లలో నీరు నింపుకుని.

“మేము అడవి పందిని పొడుచుకొస్తే, మీ పంది అని వేషాలు వేసుకొస్తారా?” అంటూ శంకరం లేచేడు.

“నేదు మారాజా! బూదేవి సొచ్చిగా, నా తమ్ముడు మీన సెయ్యేసి సెపుతున్నాను. సతివాడోల్లు సూసినారు

దివానం!” అన్నాడు.

“అన్నీ దొంగవేషాలు... తన్ను గాడిదని” అన్నారు జగన్నాథం గారు.

తాతమ్మ నాటకంలో యాక్టరులా లేచాడు, చంద్రాయ దవడ టపాకాయలా పేలింది.

“బాబోయ్ రాజులు సంపేసినారు” అంటూ అక్కడే చతికిలబడ్డాడు చంద్రాయ.

నీలాటి రేవుకి వచ్చే జనం నిలుచున్నారు. పశువులన్నీ దొడ్లకు తిరిగొస్తున్నాయి.

రాజుగారు మెల్లగా అరుగు దిగొచ్చేరు. చంద్రాయిని చెయ్య పట్టున లేవనెత్తి చావిట్లోకి తీసికెళ్లి ఏబైరూపాయిలు

చేతికిచ్చి పొమ్మన్నారు. చంద్రాయితోనే మళ్ళీ చావిట్లోకి తిరిగొచ్చేరు. చినరాజులంతా కిక్కురుమన లేదు. బిక్కమొహాలు వేసి కూర్చున్నారు.

"నాకు అనుమానం వేసింది... ఊరపందేమో అని! లేకపోతే అడవిపంది సాహూదస్కం దీనికి లేకపోవడం ఏమిటా... అంటే ఊరుకున్నారా? గిడసదేరిపోయింది, తొగలో వుండిపోయింది, తొరిగపంది బరువుగా వుంది, దిబ్బ.. వొల్లకాదు అన్నారు. ఛీ! వెధవలు, వేటా లేదు పాటా లేదు. రాచపుట్టుక పుట్టి ఊరపందిని తిన్నారు. పొండి వెధవ నాగమ్మలు!" అనుకుంటూ రాజుగారు కోనేటి వైపు వెళిపోయారు.

"నాకూ అనుమానం వేసిందోయ్.. చెప్పకేం గాని" అన్నారు జగన్నాథంగారు కాళ్ళు చాపుకుని కూర్చుంటూను.

మరో పది నిమిషాల్లో చావిడంతా ఒకరితో ఒకరు చెప్పకుండా కాళీ చేసేరు.

ఎంకి బుంగనిండా గడ్డి తవ్వుకుని నెత్తినుంచుకుని వొయ్యారంగా వస్తూంది. చిట్టీ, మంగీ, సరిసీ కడవలు

పట్టుకుని నీలాటి రేవుకొస్తున్నారు.

"మంగత్తా మంగత్తా సూసినావె... రేతిరి సిన్రాజులు ఏట కెల్లి తెచ్చింది అడివిపంది కాదటే, ఏతి చెంద్రాయ

మేపుకుంతన్న జిగిని పందట! రాజు గోరి ఎంకడు సెప్పినాడు, గడ్డికెల్లోత్తుంటేనె" అంది, ఎంకి... చిత్రంగా ముక్కులో నత్తు ఎగర వేసుకుంటూను.

"ఓలమ్మా... ఓలమ్మా! ఏం గాచారమే" అని మంగమ్మ ముక్కు మీద వేలు పెట్టుకుంది.

"సిన్రాజులే సేరీ ఏట జిగిని పందిని కాపోతే అడివిపంది మీనటే" అంది సరిసీ నవ్వుతూనూ.

ఎంకికి అంతా, అర్థమైనట్టు బుర్ర తిప్పుకుంటూ గ్రామంలోకి వెళిపోయింది!

*(ఆంధ్రపత్రిక, 13.04.1955 వారపత్రిక నుంచి పునర్ముద్రణ)*

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.

అవసరాల వెంకటరావు
*9989976688*

జయంతి ప్రకాశ శర్మ
*9848629151*

◈

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.
మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*
మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

◈

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
*www.kathamanjari.in*

◈

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
*submit@kathamanjari.in*